

@vaartanews @mvnewstv

మన మీ.. వార్త

ప్రతి అక్షరం... ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

www.mivaartanews.com

TGBIL/25/A0512

శనివారం
07 నవంబర్ 2026

సూర్యపేట, హైదరాబాద్

MANA MI VARTA NEWS

సంపుటి : 02
సంచిక :125
పేజీలు : 12 వెల : 5/-



PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE |

హౌసింగ్ బోర్డుకు సుప్రీం డెడ్‌లైన్

- ఈ నెల 23లోగా ఇళ్ల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలి
- ఆస్తుల విక్రయాలు, బదిలీలపై నిషేధం
- తుది తీర్పు వచ్చేవరకు మూడో పక్షానికి హక్కులు కల్పించొద్దు
- ఏళ్ల నిరీక్షణకు తెరపడేనా?



హైదరాబాద్

తెలంగాణ హౌసింగ్ బోర్డు ఇళ్ల రిజిస్ట్రేషన్ల వివాదంపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఈ నెల 23వ తేదీలోగా పూర్తి చేయాలని హౌసింగ్ బోర్డును ఆదేశించింది. అదే సమయంలో వివాదాస్పద ఆస్తులను ఇతరులకు విక్రయించడం, బదిలీ చేయడంపై ఆంక్షలు విధించింది. కేసులో తుది తీర్పు వెలువడే వరకు మూడో పక్షానికి ఎలాంటి హక్కులు కల్పించరాదని స్పష్టం చేసింది. హౌసింగ్ బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల ఇళ్ల రిజిస్ట్రేషన్లకు సంబంధించిన - మిగతా10లో



ప్రపంచ ఏఐ అప్లికేషన్ క్యాపిటల్‌గా భారత్

- సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ తయారీలో మరో ముందడుగు
- సెమికాన్ 2.0 పోర్టల్ ప్రారంభించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్
- రూ.7,500 కోట్లకు పైగా విలువైన 12 ఎలక్ట్రానిక్స్ ప్రాజెక్టులకు ఆమోదం
- దేశీయ జీపీయూ చిప్ అభివృద్ధికి రోడ్‌మ్యాప్ సిద్ధం

కొడంగల్‌లో అభివృద్ధి జాతర!

- మూడు రోజుల పాటు సీఎం రేవంత్ రెడ్డి పర్యటన..
- రూ.9,100 కోట్ల పనులకు శ్రీకారం
- మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శన ప్రారంభం..
- 13 అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- 10 జిల్లాల నుంచి 50 వేల మంది రైతులతో భారీ బహిరంగ సభ..
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో దీపావళి వేడుకలు



వికారాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఈ పర్యటనలో నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేయనున్నారు. సుమారు రూ.9,100 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు ఇప్పటికే పూర్తయిన పలు నిర్మాణాలను ప్రారంభించనున్నారు. మెగా రైతు మేళా, పారిశ్రామిక ప్రదర్శనను ప్రారంభించి రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి సమావేశాలు నిర్వహించనున్నారు. మూడు రోజుల పర్యటనలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు రైతు సంక్షేమం, మహిళా సాధికారతపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. శనివారం ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఎంసీహెచ్ఆర్డీ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరనున్న సీఎం రేవంత్‌రెడ్డి వికారాబాద్ జిల్లా హకీంపేటకు చేరుకుంటారు. అక్కడ ఏర్పాటు చేసిన మెగా రైతు మేళా, పారిశ్రామిక ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారు. - మిగతా10లో

దిల్లీని కమ్మేసిన కాలుష్యం.. గ్రాప్-3 ఆంక్షలు అమలు

- ఏక్యూఐ 390 దాటడంతో అత్యవసరం కాని నిర్మాణ పనులపై నిషేధం
- బీఎస్-3 పెట్రోల్, బీఎస్-4 డీజిల్ వాహనాలపై ఆంక్షలు
- చిన్నారులకు ఆన్‌లైన్ తరగతులు.. మెట్రో, బస్సు సర్వీసులు పెంపు
- ధంతేరస్ కొనుగోళ్లతో కిక్కిరిసిన రహదారులు



అన్నదాత సహా అందరికీ ముప్పే!



- ఎల్‌నినో దెబ్బ.. అన్నదాత నుంచి సామాన్యుడి వరకు ముప్పే
- వ్యవసాయాన్ని కుదిపేస్తున్న వాతావరణ మార్పులు: క్లైమేట్ ట్రెండ్స్ శ్వేతపత్రం
- ఆహార ధరలు, గృహ బడ్జెట్లు, ద్రవ్యోల్బణంపైనా ప్రభావం
- దేశంలో ఆరు రాష్ట్రాల్లో కరవు ప్రకటన
- ప్రకృతి వ్యవసాయం, కోల్డ్ చైన్ విస్తరణకు నివేదిక సిఫార్సు

న్యూఢిల్లీ

ఎల్‌నినో ప్రభావంతో దేశంలో వాతావరణ పరిస్థితులు మారుతున్నాయని, వ్యవసాయ ఉత్పాదకతపై తీవ్ర ప్రభావం పడుతోందని క్లైమేట్ ట్రెండ్స్ సంస్థ హెచ్చరించింది. నీటి ఎద్దడి, పర్యావరణ క్షీణత, సాగు పెట్టుబడుల పెరుగుదలతో వ్యవసాయ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని పేర్కొంది. ఈ పరిస్థితులు రైతుల జీవనోపాధికే కాకుండా ఆహార ధరలు, కుటుంబాల ఖర్చులు, ద్రవ్యోల్బణంపైనా ప్రభావం చూపనున్నాయని వెల్లడించింది. ఈ అంశాలపై సంస్థ ప్రత్యేక శ్వేతపత్రాన్ని విడుదల చేసింది. ఎల్‌నినో కారణంగా చోటుచేసుకుంటున్న వాతావరణ మార్పులు రైతుల ఆదాయాన్ని, జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయని శ్వేతపత్రం - మిగతా10లో



ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన వారికి మరో అవకాశం

- ఏపీ, తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల ఓటర్లకు ఈసీ వెసులుబాటు
- ఎన్యూమరేషన్ ఫారాలు అందని వారికి మళ్లీ దరఖాస్తు చేసుకునే ఛాన్స్
- ఇంటింటికీ వెళ్లి ఓటర్లను సంప్రదించాలని అధికారులకు ఆదేశాలు
- ఈసీ నిర్ణయంపై కాంగ్రెస్ విమర్శలు.. యూటర్న్ అంటూ జైరాం రమేశ్ వ్యాఖ్యలు



ఓటు హక్కుతో పాటు సంక్షేమ పథకాలకూ ముప్పు

- ఇది ఓట్ల చోరీ కాదు.. పౌరుల హక్కుల చోరీ: రాహుల్ గాంధీ
- ఆధార్‌కు బదులుగా ఓటర్ ఐడీతో పథకాల అమలుపై అభ్యంతరం
- ఎస్ఐఆర్‌తో ఓటర్ల పేర్ల తొలగింపుపై కాంగ్రెస్ ఆందోళన
- కాలుష్యం, ధరల పెరుగుదలపైనా కేంద్రంపై జైరాం రమేశ్ విమర్శలు

పాత విద్యుత్ వినియోగానికి కొత్త బాదుడు



- వాడిన కరెంటుకు ఇప్పుడు బిల్లుల మోత
- తెలంగాణ వినియోగదారులపై ట్రూ అప్ భారం
- నవంబర్‌లో యూనిట్‌కు 30 పైసలు.. డిసెంబర్ నుంచి 50 పైసలు
- 29 నెలల పాటు వసూళ్లు.. హైదరాబాద్ వాటా రూ.2,533 కోట్లు
- ఇల్లు మారిన అద్దెదారులకూ పాత వినియోగం ఛార్జీలు!

హైదరాబాద్

అప్పుడెప్పుడో వినియోగించిన విద్యుత్తుకు ఇప్పుడు వినియోగదారుల నుంచి అదనపు ఛార్జీల వసూళ్లు మొదలయ్యాయి. తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) ట్రూ అప్ ఛార్జీల పేరుతో నవంబర్ నెల బిల్లుల్లో అదనపు భారాన్ని మోపాయి. గతంలో వినియోగించిన విద్యుత్తుకు సంబంధించిన యూనిట్లు, వాటిపై విధించిన ట్రూ అప్ ఛార్జీల వివరాలను ప్రస్తుత బిల్లుల్లో - మిగతా10లో



శాటిలైట్ కమ్యూనికేషన్ రంగంలో అందరికీ ఆహ్వానం

- స్టార్‌లింక్ చివరగా దరఖాస్తు చేసింది: కేంద్రం స్పష్టీకరణ
- భారత్‌లో పోటీకి పూర్తి స్వేచ్ఛ.. వినియోగదారుడే అంతిమ నిర్ణేత
- స్పెక్ట్రమ్ కేటాయింపు, ధరల ఖరారుపై కసరత్తు
- భద్రతా నిబంధనలు పూర్తి చేసిన తర్వాతే వాణిజ్య సేవలు



ఓబీసీ క్రీమీలేయర్‌లో తల్లిదండ్రుల జీతం లెక్కించొద్దు

- కేంద్రం అభ్యర్థనను తిరస్కరించిన సుప్రీంకోర్టు
- సీఎస్ఈ--2025 అభ్యర్థులకూ మార్చి తీర్పు వర్తింపు
- పాత నియామకాలు, సర్వీసు కేటాయింపులు తిరిగి తెరవాల్సిన అవసరం లేదు
- తీర్పు అమలుకు కేంద్రానికి మరో రెండు నెలల గడువు

సంపాదకీయం

స్వతంత్ర సంస్థలకు రాజకీయ క్రిమీడ

ప్రజాస్వామ్యానికి కాపలాదారులు గా ఉండాల్సిన రాజ్యాంగ సంస్థలు పాలకుల రాజకీయ పంజరంలో బందీలైతే ప్రజాస్వామ్యానికి సమాధి కట్టినట్టే! అధికారానికి ఊడిగం చేయడానికి కాదు సంస్థలున్నది.. రాజ్యాంగాన్ని కాపాడటానికే. ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఎన్నికలు పెట్టడం, ఓట్లు లెక్కింపు, ఫలితాలు ప్రకటించడమే కాదు.. అధికారంలో ఉన్న వారిని ప్రశ్నించే వ్యవస్థలుగా ఉండాలి.పాలకుల నిర్ణయాలకు అడ్డుకట్ట వేయగల స్వతంత్రసంస్థలుగా ఉండాలి. అధికార దుర్వినియోగాన్ని నిలదీయగలగాలి. కానీ నేడు దేశంలో స్వతంత్ర సంస్థల స్వయంప్రతిపత్తిపై జరుగుతున్న చర్చలు ప్రజాస్వా మ్యానికి పెను హెచ్చరికగా మారుతున్నా యి. సంస్థలు స్వతంత్రంగా పనిచేయాల్సిన చోట ప్రభుత్వ నీడలో నడుస్తున్నా యనే అనుమానాలు బలపడితే అది కేవలం ఒక సంస్థ ప్రతిష్ఠకు సంబంధించిన సమస్య కాదు. దేశ ప్రజాస్వామ్య పునాదులకే ప్రమాద ఘంటిక.రాజ్యాంగ సంస్థలు అధికారంలో ఉన్న ప్రభుత్వానికి ఊడిగం చేయడానికి ఏర్పడిన కార్యాలయాలు కావు. ప్రభుత్వ నిర్ణ యాలకు గుడ్డిగా తలూపే ముద్ర వేసే యంత్రాలు అంతకంటే కావు. ప్రజల ప్ర యోజనాలను, రాజ్యాంగ విలువలను కా పాడాల్సిన బాధ్యత వాటిపై ఉంది. అధికారంలో ఉన్నవారికి అనుకూలంగా నిర్ణ యాలు తీసుకుంటేనే స్వతంత్ర సంస్థలుగా గుర్తింపు వస్తుందా? ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిజాన్ని చెప్పే ధైర్యం లేకపోతే ఆ సంస్థలకు స్వయంప్రతిపత్తి ఉన్నట్టా? పాలకులే జవాబు చెప్పాలి. స్వతంత్రత అనేది ప్రభుత్వానికిచ్చే కానుక కాదు. అది ప్రజాస్వామ్యం కల్పించిన రాజ్యాంగ బాధ్యత.పథకాలు చూడండి2016లో జరిగిన పెద్ద నోట్ల రద్దు దేశ ఆర్థిక వ్యవస్థను కుదిపేసింది. సామాన్య ప్ర జలు బ్యాంకుల ముందు క్యూలో నిలబడ్డారు. చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపో యారు. పేదల జీవనాధారాలు దెబ్బతిన్నాయి. ఇంతటి కీలక నిర్ణయం విషయం లో రిజర్వ్ బ్యాంకు స్వతంత్రంగా వ్యవహరించిందా? ప్రభుత్వ నిర్ణయాన్ని లోతుగా పరిశీలించిందా? లేదా ముందే తీసుకున్న నిర్ణయానికి ఆమోదముద్ర వేసిందా? అనే ప్రశ్నలు ఇప్పటికీ అలాగే ఉన్నాయి. దేశ ఆర్థిక వ్యవస్థకు కాపలాదారుగా ఉండాల్సిన కేంద్ర బ్యాంకు ప్రభుత్వ నిర్ణయాల ముందు స్వతంత్రతను కోల్పోతే సామాన్యుడి ఆర్థిక భద్రతకు దిక్కెవరు? ప్రభుత్వా నికి నచ్చిన నిర్ణయమే సరైనదని చెప్పే సంస్థకు స్వతంత్ర సంస్థ అనే పేరెందుకు? ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైనది ఓటు. ఆ హక్కును కాపాడాల్సిన ది ఎన్నికల సంఘం. అది ఏ ఒక్క రాజకీయ పార్టీకి అనుకూలంగా ఉండకూడదు. అధికార పార్టీకి ఒక కొలమానం, ప్రతిపక్షానికి మరో కొలమానం ఉంటే అది నిష్పక్షపాత అనిపించుకోదు. ఎన్నికల కోడ్ అందరికీ సమానంగా వర్తించాలి. అధికార బలం, ధనబలం, రాజకీయ పలుకుబడి ఎన్నికల ను ప్రభావితం చేయకుండా చూడాలి. ఈసీ నిర్ణయాలపై ప్రజల్లో అనుమానాలు పెరగడం అంటే ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకం సన్నగిల్లుతుంది. స్వతంత్ర సంస్థల స్వేచ్ఛను దెబ్బతీసే మొదటి అడుగు వాటి నియామకాల నుం చే మొదలవుతుంది. కీలక పదవుల్లో ఎవరిని నియమిస్తున్నారు?వారి అర్హత ఏంటి? వారి ఎంపికలో పారదర్శకత ఉందా? రా జకీయ విధేయతకు ప్రాధాన్యతనిస్తున్నా రా? అనే ప్రశ్నలు తప్పనిసరిగా రావాలి. అధికార పార్టీకి అనుకూలమైన వ్యక్తులనే కీలక పదవుల్లో నియమిస్తే భవిష్యత్తులో ఆ సంస్థలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటాయనే నమ్మకం ఎలా కలుగుతుం ది? అందుకే నియామక ప్రక్రియలో అధికార, ప్రతిపక్షాల భాగస్వామ్యం, పారదర్శ కత, అర్హతలకు ప్రాధాన్యముండాలి. సం స్థల పునాదులనే రాజకీయ ప్రయోజనాలతో కలుషితం చేస్తే వాటి నుంచి నిష్ప క్ష పాతాన్ని ఆశించడం పగటికలే అవుతుంది.స్వయంప్రతిపత్తి అంటే ప్రశ్నించడానికి వీల్లేని అధికారం కాదు. ప్రభుత్వ జోక్యం ఉండకూడదన్న పేరుతో సంస్థలు కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించడానికి వీల్లేదు. అధికార దుర్వినియోగం జరిగినా, నిర్ణయాల్లో తప్పులు దొర్లినా, ప్రజా ప్ర యోజనాలకు విరుద్ధంగా వ్యవహరించినా ప్రశ్నించే వ్యవస్థ ఉండాలి. ప్రజాస్వామ్య పర్యవేక్షణ, పార్లమెంటరీ సమీక్ష, న్యాయపరమైన పరిశీలనకు సంస్థలు జవాబు దారీగా ఉండాలి. కానీ ఈ పర్యవేక్షణ రాజకీయ కక్షసాధింపుకు ఆయుధంగా మార కూడదు. ప్రభుత్వ పెత్తనం ఒక ప్రమాదమైతే, జవాబుదారీతనం లేని స్వతంత్రత మరో ప్రమాదం. ఈ రెండింటి మధ్య రా జ్యాంగ సమతుల్యతే ప్రజాస్వామ్యానికి రక్షణ.దేశంలో అధికారాలు శాశ్వతం కావు. ప దవులు శాశ్వతం కావు. ప్రభుత్వాలు శాశ్వ తం కావు. కానీ రాజ్యాంగం శాశ్వత విలువలతో నిలబడాలి. నేడు అధికారంలో ఉన్నవారు రేపు ప్రతిపక్షంలో ఉండవచ్చు. అందుకే తమకు అనుకూలంగా ఉన్నప్పుడు సంస్థల స్వతంత్రతను సమర్థిస్తూ, ప్రతికూల నిర్ణయాలు వచ్చినప్పుడు వా టిపై దాడి చేసే ద్వంద్వ వైఖరిని రాజకీయ పార్టీలు విడనాడాలి. ప్రజాస్వామ్యం అం టే పాలకుల ఇష్టమే చట్టం కాదు. ప్రజల హక్కులే దాని ప్రాణం. రాజ్యాంగ సంస్థలు పాలకుల కరతాళ ధ్వనులకు అనుగుణం గా పనిచేసే వేదికలుగా మారితే ప్రజాస్వా మ్యం కేవలం ఎన్నికల తంతుగా మిగిలిపోతుంది.రాజకీయాలు చూడండిఎన్నికల సంఘం కావచ్చు, రిజర్వ్ బ్యాంకు కావచ్చు, మరే ఇతర రాజ్యాంగ సంస్థ కావచ్చు.. వాటి విధేయత ప్రభుత్వాల పట్ల కాదు, రాజ్యాంగం పట్ల ఉండా లి. వాటి నిర్ణయాలకు ప్రాతిపదిక రాజకీ య ప్రయోజనాలు కాదు, ప్రజా ప్రయోజనాలు కావాలి. అధికారాన్ని ప్రశ్నించే గొంతులను అణచివేయడం పాలన కాదు. ప్రశ్నలకు సమాధానం చెప్పడం, విమర్శలను స్వీకరించడం, తప్పులను సరిదిద్దుకోవడమే ప్రజాస్వామ్య పరిపక్వత. సంస్థలను తమ గుప్పిట్లో పెట్టుకోవాలని చూసే పాలకులు గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే.. అధికారం ప్రజలు ఇచ్చేది.. రాజ్యాంగం పరిమితులు విధించేది! స్వతంత్ర సంస్థలను బలహీనపరిస్తే చివరకు బలహీనమయ్యేది పాలకులు కాదు.. ప్రజాస్వామ్యమే

డిప్యూటీ మేయర్ బీజేపీ వర్సెస్ జనసేన



విశాఖపట్టణం : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో విశాఖపట్నం కు ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్రంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్ కావడంతో ఇక్కడి రాజకీయ పరిణామాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రాధాన్యత సంతరించుకుంటాయి. తాజాగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అద్భుతమైన ఫలితాలు సాధించడంతో ఇప్పుడు పదవుల పంపకాలపై ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ముఖ్యంగా డిప్యూటీ మేయర్ పదవి ఎవరికి దక్కుతుందన్నది మూడు పార్టీల్లోనూ ఉత్కంఠ రేపుతోంది. విశాఖలో తెలుగుదేశం పార్టీకి మొదటి నుంచి బలమైన పట్టు ఉంది. భారతీయ జనతా పార్టీకి కూడా కొన్ని ప్రాంతాల్లో మంచి ఆదరణ ఉండగా, జనసేనకు సామాజిక సమీకరణల పరంగా ఓటు బ్యాంకు ఉంది. ఈ మూడు పార్టీల బలాలు కలవడంతో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించింది. మొత్తం 120 వార్డులకు గాను 98 స్థానాలను అధికారిక కూటమి అభ్యర్థులు గెలుచుకున్నారు. మరో ఎనిమిది మంది స్వతంత్ర అభ్యర్థులుగా విజయం సాధించినప్పటికీ, వారు కూటమికి చెందిన రెబల్స్ కావడం గమనార్హం. దీంతో కూటమి వైపు మొత్తం 106 మంది కార్పొరేటర్ల మద్దతు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వైసీపీ 13 స్థానాలతో ప్రతిపక్షంలో ఉండనుండగా, సీపీఎం ఒక స్థానాన్ని గెలుచుకుంది.మేయర్ పదవి టీడీపీకి దక్కే అవకాశాలు ఎక్కువగా ఉండటంతో ఇప్పుడు డిప్యూటీ మేయర్ స్థానంపై బీజేపీ, జనసేన మధ్య పోటీ నెలకొంది. విశాఖలో తమకున్న రాజకీయ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకుని మేయర్ పదవిని ఇవ్వాలని బీజేపీ గతంలోనే కోరినట్లు తెలుస్తోంది. 2024 ఎన్నికల్లో ఎంపీ స్థానం కూడా కేటాయించకపోవడంతో కనీసం డిప్యూటీ మేయర్ పదవైనా ఇవ్వాలని టీడీపీ పెద్దల వద్ద ప్రస్తావించినట్లు ప్రచారం జరుగుతోంది.ఈ నేపథ్యంలోనే విశాఖ బీజేపీ అధ్యక్షుడు పరశురాం రాజు కార్పొరేటర్‌గా పోటీ చేశారని, ఆయనకు డిప్యూటీ మేయర్ అవకాశం కల్పిస్తామని అప్పట్లో హామీ ఇచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. ప్రస్తుతం ఆయన పేరు ఈ పదవికి ప్రముఖంగా వినిపిస్తోంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కూడా ఈ పదవి తమ పార్టీకి దక్కేలా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.మరోవైపు జనసేన కూడా డిప్యూటీ మేయర్ పదవిపై ఆశలు పెట్టుకుంది. విశాఖలో 26 మంది కార్పొరేటర్లతో కూటమిలో రెండో అతిపెద్ద పార్టీగా ఉన్న తమకు ఈ అవకాశం ఇవ్వడం సమంజసమని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. కేవలం ఎనిమిది మంది కార్పొరేటర్లు ఉన్న బీజేపీకి కాకుండా, తమకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతున్నట్లు తెలుస్తోంది. అయితే గతంలో ఇచ్చిన రాజకీయ హామీలను పరిగణనలోకి తీసుకుంటే తమకే అవకాశం వస్తుందని బీజేపీ నేతలు ధీమాగా ఉన్నారు.ఉత్తరాంధ్ర రాజకీయ సమీకరణాలు కూడా ఈ పదవుల పంపకంలో కీలకంగా మారే అవకాశం ఉంది. విశాఖపట్నం, విజయనగరం కార్పొరేషన్లలో టీడీపీకి ప్రాధాన్యత దక్కగా, రాబోయే శ్రీకాకుళం కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేనకు అవకాశం కల్పించే ఆలోచన ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అవసరమైతే విజయనగరంలో డిప్యూటీ మేయర్ పదవిని జనసేనకు కేటాయించే ప్రతిపాదన కూడా ఉన్నట్లు తెలుస్తోంది.గతంలో విశాఖ మేయర్ పదవిని బీజేపీ గెలుచుకున్న చరిత్ర కూడా ఆ పార్టీ నేతలకు గుర్తుంది. ఇప్పుడు డిప్యూటీ మేయర్ స్థానం దక్కితే నగర రాజకీయాల్లో తమ ప్రాబల్యాన్ని పెంచుకోవచ్చని భావిస్తున్నారు. అయితే జనసేన కూడా తన బలాన్ని తక్కువగా అంచనా వేయకూడదని పట్టుబడుతోంది. దీంతో చివరకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, బీజేపీ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. విశాఖ డిప్యూటీ మేయర్ పీఠం బీజేపీకి దక్కుతుందా? లేక జనసేన తన బలంతో ఆ స్థానాన్ని సాధించుకుంటుందా? అన్నది త్వరలో తేలనుంది. ముక్కా శ్రావణి. తమ కుటుంబం ముప్పై ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో ఉందని.. అందుకే తమకు ఈ అవకాశం దక్కిందన్నారు. కూటమి పార్టీల్లో అనుభవం ఉన్న నేతల సహకారంతో విశాఖపట్నాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళతానన్నారు.ముక్కా శ్రావణి తండ్రి ముత్యాలనాయుడు తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేతగా ఉన్నారు.. ఆయన గతంలో కార్పొరేటర్‌గా పనిచేశారు. శ్రీవాణి వృత్తిరీత్యా ఫిజియో థెరపిస్ట్ కాగా.. ఆమె రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. 2015 నుంచి టీడీపీలో యాక్టివ్ అయ్యారు.. 2021 ఎన్నికల్లో 26వ వార్డు (అక్కయ్యపాలెం ప్రాంతం) నుంచి కార్పొరేటర్‌గా పోటీచేసి గెలుపొందారు. అలాగే ముక్కా శ్రావణి తన డివిజన్‌లో పనులకు సంబంధించి నిర్లక్ష్యం వహిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాట్లాడిన వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యింది. ఇటీవల ఆమెకు టికెట్ ప్రకటించిన తర్వాత ఆ వీడియో సోషల్ మీడియాలో మళ్లీ చక్కర్లు కొట్టింది. వైరల్ అయిన వీడియోలో ఏదో ఒకరోజు తమకు టైం వస్తుందన్నారు.. చెప్పినట్లుగానే ఆమె విశాఖ నగరానికి మేయర్ అయ్యారు.అంతేకాదు కూటమి పార్టీల మధ్య పొత్తు, సీట్ల సర్దుబాటుతో కొంత గందరగోళం ఏర్పడింది. మొత్తం 120 వార్డుల్లో 246మంది స్వతంత్రులు పోటీచే శారు. కూటమి పార్టీల్లో కూడా రెబల్స్ పోటీచేసి గెలిచారు. విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం 36వ వార్డులో కొల్లి సింహాచలం (జనసేన పార్టీ రెబల్), . అగనంపూడి జోన్ 106 వార్డులో రామునాయుడు (జనసేన పార్టీ రెబల్) గెలుపొందారు. విశాఖపట్నం పశ్చిమ నియోజకవర్గం 73వ వార్డులో పెతకంశెట్టి శ్యాం సుధాకర్‌రావు (జనసేన పార్టీ రెబల్). 39, 41 వార్డుల్లో (టీడీపీ రెబల్స్) బత్తిన నవీన్, పంపాన రాజ్యలక్ష్మిలు విజయం సాధించారు. 118 వార్డులో (పెందుర్తి) టీడీపీ రెబల్ గంట్ల లక్ష్మి గెలిచారు.గాజువాక 86 వార్డులో కాకి గోవిందరెడ్డి (టీడీపీ రెబల్) బరిలో విజయాన్ని అందుకున్నారు. విశాఖపట్నం జీవీఎంసీ ఎన్నికల ప్రక్రియ పూర్తికాగా.. ఇప్పుడు అందరి దృష్టి డిప్యూటీ మేయర్ పదవివైపు మళ్లింది. ఈ పదవి కూటమిలో ఏ పార్టీకి దక్కుతుందనే చర్చ జరుగుతోంది. డిప్యూటీ మేయర్ రేసులో ప్రధానంగా విశాఖపట్నం జిల్లా బీజేపీ అధ్యక్షుడు పరుశరామరాజు పేరు వినిపిస్తుంగా.. ఆయన 54వ డివిజన్ నుంచి గెలిచారు. కూటమి పొత్తులో భాగంగా ఆయనకు పదవి ఖాయమనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ జనసేన పార్టీకి కనుక పదవి ఇస్తే.. రేసులో విశాఖపట్నం దక్షిణం నియోజకవర్గం పరిధిలోని 40 డివిజన్ నుంచి గెలిచిన భీశెట్టి వసంత లక్ష్మికి అవకాశం ఉందంటున్నారు. అయితే డిప్యూటీ మేయర్ పదవిపై ఒకటి, రెండు రోజుల్లో స్పష్టత వస్తుందని చెబుతున్నారు.

శరవేగంగా కుంభమేళ పనులు



భోపాల్ : దేశంలో ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయిని వంటి ప్రాంతాల్లో కుంభమేళా జరుగుతుండగా.. నాసిక్ కుంభ మేళాకు ప్రత్యేకత ఉంది. ఇది నాసిక్‌తో పాటు త్రయంబకేశ్వ ర్‌లోనూ నిర్వహిస్తారు. 1838లో త్రయంబకేశ్వర్‌లో శైవ, వైష్ణవ సాధువుల మధ్య స్నానాల ప్రాధాన్యత విషయంలో ఘర్షణలు జరగడంతో అఖాడాలను వేర్వేరు ప్రాంతాలకు తరలించారు. అప్పటి నుంచి శైవ సాధువులు త్రయంబకేశ్వర్‌లోని కుశావర్త తీర్థం వద్ద.. వైష్ణవ అఖాడాలు నాసిక్‌లోని రామ్‌కుండ్, తపోవన్ ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించే సంప్రదాయం కొనసాగుతోంది.వచ్చే ఏడాది 3 ప్రధాన అమృత స్నానాలు జరగనున్నాయి. 2027 ఆగస్ట్ 2, ఆగస్ట్ 31, సెప్టెంబర్ 11వ తేదీల్లో జరగనున్నాయి. వీటితో పాటు నాసిక్‌లో 45, త్రయంబకేశ్వర్‌లో 29 శుభస్నాన తేదీల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2027 కుంభమేళా కోసం చేపట్టిన అభివృద్ధి పనులు కేవలం తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం కావడం లేదు. మొత్తం 350కిపైగా ప్రాజెక్టులు చేపట్టగా.. వాటిలో దాదాపు 85 శాతం శాశ్వత మౌలిక సదుపాయాలుగా నిర్మిస్తున్నారు. కుంభమేళా ముగిసిన తర్వాత కూడా నాసిక్, త్రయంబకేశ్వర్ ప్రాంతాల ప్రజలకు ఇవి ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించారు. కుంభమేళాతో పోలిస్తే ఈసారి మౌలిక సదుపాయాల కోసం పెట్టే వ్యయం దాదాపు 10 రెట్లు అధికమని కుంభమేళా మంత్రి గిరీశ్ మహాజన్ తెలిపారు. 2027 వేడుకలను పరిశుభ్రంగా, సురక్షితంగా, సమర్థంగా నిర్వహించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గత కుంభమేళా ఎలాంటి ప్రాణనష్టం లేకుండా ప్రశాంతంగా ముగిసిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రవాణా వ్యవస్థను విస్తరించడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా దాదాపు 150 కిలోమీటర్ల మేర రహదారులను విస్తరించి, ఆధునికీకరిస్తున్నారు. గోదావరి, దాని ఉపనదులపై కొత్తగా 8 వంతెనలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కుంభమేళా సమయంలో భారీగా తరలివచ్చే భక్తుల రాకపోకలను సులభతరం చేయడం వీటి ప్రధాన ఉద్దేశం. ఇక నాసిక్ నగర ట్రాఫిక్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం చూపేలా 65.6 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.7,613 కోట్ల వ్యయం అంచనా వేశారు. రింగ్ రోడ్డు పూర్తి అయితే నగరంలోకి వచ్చే వాహనాల రద్దీ తగ్గడంతో పాటు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు.కుంభమేళాలో పవిత్ర స్నానాలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. ఈ నేపథ్యంలో నాసిక్‌లో గోదావరి నది వెంట సుమారు 3.4 కిలోమీటర్ల పొడవున కొత్త ఘాట్లను నిర్మిస్తున్నారు. త్రయంబకేశ్వర్‌లోనూ అదనపు స్నాన ఘాట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. చారిత్రక ఆలయాలు, కుండాలను పునరుద్ధరిస్తున్నారు. త్రయంబకేశ్వర్ ఆలయ పట్టణాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'శివ దర్శన్ పథ్' ప్రాజెక్టును చేపట్టారు. దీనివల్ల ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఆ ప్రాంత పర్యాటక ప్రాధాన్యత కూడా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.కోట్లాది మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించే గోదావరి నది పరిశుభ్రత ఈ కుంభమేళాలో అత్యంత కీలకమైన అంశం. నదిలోకి శుద్ధి చేయని మురుగునీరు చేరకుండా అడ్డుకునేందుకు నాసిక్‌లో భారీ మురుగునీటి నిర్వహణ ప్రాజెక్టును చేపట్టారు. ఇందులో భాగంగా 4 ఆధునిక మురుగునీటి శుద్ధి కేంద్రాలు, దాదాపు 200 కిలోమీటర్ల పొడవున మురుగునీటి పైప్‌లైన్లు నిర్మిస్తున్నారు. ఈ పనుల్లో సగానికిపైగా ఇప్పటికే పూర్తి అయ్యాయని నాసిక్ మున్సిపల్ కమిషనర్ మనీషా ఖాత్రీ తెలిపారు. కుంభమేళా ప్రారంభానికి ముందే మిగిలిన పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నాసిక్ నగరంలో మురుగునీటి నిర్వహణ వ్యవస్థ మెరుగుపడటంతో పాటు గోదావరి కాలుష్యాన్ని నియంత్రించేందుకు దోహదపడతాయి.మహారాష్ట్రలో ఈ ఏడాది బలహీనమైన రుతుపవనాల కారణంగా పలు ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో లక్షలాది, కోట్లాది మంది భక్తులకు అవసరమైన నీటిని అందించడం, స్థానిక ప్రజల అవసరాలను కూడా సమతుల్యం చేయడం అధికారులకు సవాలుగా మారనుంది. ముఖ్యంగా పుణ్యస్నానాల కోసం గోదావరిలో తగినంత నీటి లభ్యత ఉండేలా ముందస్తు ప్రణాళికలు అవసరం. భక్తుల అవసరాలు, నగరాల రోజువారీ నీటి అవసరాల మధ్య సమన్వయం సాధిస్తామని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం నిర్మిస్తున్న మౌలిక సదుపాయాలు కుంభమేళా ముగిసిన తర్వాత కూడా కనీసం 30 ఏళ్లపాటు ఈ ప్రాంతానికి ఉపయోగపడతాయని నాసిక్-త్రయంబకేశ్వర్ కుంభమేళా అథారిటీ కమిషనర్ శేఖర్ సింగ్ వెల్లడించారు. రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పర్యాటకం అభివృద్ధి చెందుతుందని, నాసిక్ అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా ఎదిగేందుకు ఈ ప్రాజెక్టులు తోడ్పడతాయని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా 2027 సింహస్థ కుంభమేళా ఆధ్యాత్మిక వేడుకగానే కాకుండా.. ఉత్తర మహారాష్ట్రలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలక మలుపుగా నిలవనుంది.

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ప్రజా పాలనలో భాగం కావా?

- వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ బత్తిని శ్రీనివాస్ గౌడ్

వరంగల్ నవంబర్ 6 (మల్లేష్ మీవార్త ప్రతినిధి) :

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, పూటకో మాట మారుస్తూ పేదింటి ఆడపడుచులను వంచిస్తోందని బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర నాయకులు, వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ జనరల్ సెక్రటరీ, నర్సంపేట మాజీ మార్కెట్ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధకుడు, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు 2014 అక్టోబర్ 2న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రారంభించి పేద కుటుంబాల్లోని ఆడపడుచుల వివాహాలకు ఆర్థిక చేయూత అందించారని తెలిపారు. 2014 నుంచి 2023 వరకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సుమారు 13 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ యువతులకు ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద అర్హులైన యువతులకు రూ. 1,00,116తో పాటు తులం బంగారం అందిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అలాగే అన్ని కులాలకు చెందిన వికలాంగ మహిళలకు రూ. 1,02,500తో పాటు తులం బంగారం అందిస్తామని ప్రకటించిందన్నారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్క లబ్ధిదారురాలికి కూడా తులం బంగారం అందించలేదని ఆరోపించారు. వేలాది మంది ఆడపడుచులు సంవత్సరాలుగా ఆర్థిక సహాయం కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.



పెండింగ్ దరఖాస్తులు ఎప్పుడు పరిష్కరిస్తారు?

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 3,65,000 దరఖాస్తులు అందగా, కేవలం 1,60,000 మంది లబ్ధిదారులకు మాత్రమే సుమారు రూ. 1,600 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంకా రెండు లక్షలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. 2024 సంవత్సరంలో రూ. 2,175 కోట్లు, 2025 సంవత్సరంలో రూ. 3,683 కోట్లు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఈ పథకాలకు కేటాయించినట్లు పేర్కొంటూ, ఆ నిధులు ఎక్కడికి వెళ్లాయని ప్రశ్నించారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఈ పథకాలకు స్పష్టమైన ప్రణాళిక లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలకు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, వాటి కార్పొరేషన్ల ద్వారా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. గత మూడు సంవత్సరాల్లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమానికి రూ. 1,26,000 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ. 33,116 కోట్లు కేటాయించినట్లు పేర్కొంటూ, ఆయా శాఖలకు కేటాయించిన నిధుల్లో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఎందుకు నిధులు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. బడ్జెట్‌లో వేల కోట్ల రూపాయలు కేటాయించినట్లు ప్రకటిస్తూ, ఆ నిధులను అర్హులైన లబ్ధిదారులకు ఎందుకు అందించడం లేదో ప్రభుత్వం ప్రజలకు లెక్కలతో సహా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పెండింగ్ దరఖాస్తులకు వెంటనే నిధులు విడుదల చేయాలి

కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద పెండింగ్‌లో ఉన్న రెండు లక్షలకు పైగా దరఖాస్తులకు వెంటనే నిధులు విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని బత్తిని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన సుమారు 3,60,000 మంది ఆడపడుచులకు తులం బంగారం అందించాలని కోరారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరిస్తూ, పేద కుటుంబాలను నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు మరో రూ.7 కోట్ల నిధులు మంజూరు

- మందుముల పరమేశ్వర్‌రెడ్డి కృషితో అభివృద్ధి పనులకు ఊతం -- రామంతాపూర్, చిల్కానగర్, ఉప్పల్ కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

ఉప్పల్, నవంబర్ 6 (మన మీ వార్త):

ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధుల ప్రవాహం కొనసాగుతోంది. ఉప్పల్ సర్కిల్ పరిధిలోని రామంతాపూర్, చిల్కానగర్, ఉప్పల్ డివిజన్లలో వివిధ కాలనీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం మరో రూ.7 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి, ఉప్పల్ మాజీ కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి చేసిన కృషి ఫలితంగా నిధుల మంజూరు కొనసాగుతోందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

నియోజకవర్గంలోని అన్ని కాలనీలు, బస్తీలలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా రహదారులు, మురుగునీటి కాలువలు, సామాజిక భవనాలు తదితర అభివృద్ధి పనులకు నిధులు సమకూరుస్తున్నారు. తాజాగా మంజూరైన నిధులతో ఉప్పల్ సర్కిల్ పరిధిలో చేపట్టనున్న పనుల వివరాలు ఇలా ఉన్నాయి.

----ఉప్పల్ డివిజన్‌లో చేపట్టనున్న పనులు,

మంజూరైన అభివృద్ధి పనుల విషయాలను వారు వెల్లడించారు. రూ. 37 లక్షలతో 28వ వార్డు పరిధిలోని శ్రీశ్రీనగర్ ప్రధాన రహదారిపై మధ్య విభజన నిర్మాణం,రూ. 18 లక్షలతో రామంతాపూర్ శ్రీరామణపురం కాలనీలో రెండు ప్రాంతాల్లో సిమెంటు రహదారుల నిర్మాణం,రూ. 12 లక్షలతో ఉప్పల్ హిల్స్‌లో ఇంటి నంబరు 2-3-215/2/25 నుంచి విద్యుత్ మార్పిడి యంత్రం వరకు సిమెంటు రహదారి నిర్మాణం,రూ. 28 లక్షలతో మల్లికార్జున నగర్ కాలనీలో రెండవ, ఐదవ వీధుల్లో సిమెంటు రహదారుల నిర్మాణం,రూ. 58 లక్షలతో శ్రీ సాయి కాలనీలో నాలుగు, ఐదు, ఆరవ వీధుల్లో సిమెంటు రహదారుల నిర్మాణం,రూ. 48 లక్షలతో లక్ష్మారెడ్డి కాలనీలో శ్రీ చైతన్య పాఠశాల నుంచి అభయ ఆసుపత్రి వరకు, నాలుగవ వీధిలో దెబ్బతిన్న సిమెంటు రహదారుల పునర్నిర్మాణం,రూ. 13 లక్షలతో అమృత కాలనీలో ఇంటి నంబరు 15-91/2 నుంచి 15-98/1 వరకు సిమెంటు రహదారి నిర్మాణం,రూ. 10.30 లక్షలతో గాంధీనగర్‌లోని నవోదయ యువజన సంఘం భవనంలో విద్యుత్ పనులు, నేలపై పలకల ఏర్పాటు, బోరుబావి తవ్వకం,రూ. 26 లక్షలతో ఉప్పల్ ముదిరాజ్ సంఘం సామాజిక భవనంలో నేలపై పలకల ఏర్పాటు, లిఫ్ట్ సదుపాయం కల్పన,రూ. 45 లక్షలతో ఉప్పల్ పాత పురపాలక కార్యాలయ భవన నిర్మాణం,రూ. 17 లక్షలతో ఉప్పల్ సీనియర్ పౌరుల భవనానికి అదనపు విస్తరణ, మిగిలిన నిర్మాణ పనుల పూర్తి కోసం నిధులు మంజూరైనట్లు వివరించారు.

----చిల్కానగర్, రామంతాపూర్ ప్రాంతాల్లో చేపట్టనున్న పనుల వివరాలను వారు తెలిపారు. రూ. 70 లక్షలతో చిల్కానగర్ 23వ వార్డు పరిధిలోని ఆనంద్‌నగర్ తొమ్మిది, పదకొండవ వీధులతో పాటు





ప్రధాన రహదారిపై సిమెంటు రహదారుల నిర్మాణం,రూ. 50 లక్షలతో లక్ష్మీనారాయణ కాలనీలో బజరంగబలి కిరాణా దుకాణం నుంచి ఆర్.కె. పాఠశాల వరకు, అలాగే ఇంటి నంబరు 2-24-105/22/4 నుంచి బైపాస్ రహదారి వరకు దెబ్బతిన్న సిమెంటు రహదారుల పునర్నిర్మాణం,రూ. 65 లక్షలతో రామంతాపూర్ 26వ వార్డు పరిధిలోని గాంధీనగర్‌లో సామాజిక భవన నిర్మాణం,రూ. 1.98 లక్షలతో రామంతాపూర్ 26వ వార్డు పరిధిలోని శాంతినగర్‌లో మనస్వి వైద్యశాల నుంచి ఆరవ వీధి వరకు పెట్టె ఆకారపు మురుగునీటి కాలువ నిర్మాణం.మంజూరైన నిధులతో ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనులను త్వరలోనే ప్రారంభించనున్నట్లు మందుముల పరమేశ్వర్‌రెడ్డి, మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డి వెల్లడించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు కాలనీల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

వెంకట్ రెడ్డి నగర్ కాలనీలో విద్యుత్ సమస్యకు తక్షణ పరిష్కారం

- కాలనీ వాసుల విజ్ఞప్తిపై స్పందించి విద్యుత్ స్తంభం, కేబుల్ వైర్ ఏర్పాటు చేయించిన యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్

వెంకట్ రెడ్డి నగర్, నవంబర్ 6 (మన మీ వార్త):

వెంకట్ రెడ్డి నగర్ కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యను ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ తక్షణమే పరిష్కరించారు. కాలనీలో విద్యుత్ స్తంభం, కేబుల్ వైర్ లేకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కాలనీ వాసులు అరుణ్ పటేల్ దృష్టికి తీసుకెళ్లారు.

దీనిపై వెంటనే స్పందించిన అరుణ్ పటేల్ సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి, కాలనీకి అవసరమైన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయించడంతో పాటు కేబుల్ వైర్ సౌకర్యాన్ని కల్పించారు. దీంతో కాలనీ వాసుల విద్యుత్ సమస్యకు పరిష్కారం లభించింది.





దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కావడంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ అరుణ్ పటేల్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ వర్కింగ్ లైన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేష్, కాలనీ పెద్దలు బాణాల నారాయణ, శ్రీను, రమేష్, నాగేష్, భాను, సాయి, శివ, పాషా, శ్రీనివాస్‌తో పాటు పలువురు మహిళలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే బాధ్యతగా, ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఈ సందర్భంగా అరుణ్ పటేల్ పేర్కొన్నారు.

23 వేల అడుగుల ఎత్తైన హిమాలయ శిఖరాన్ని అధిరోహించిన రామంతాపూర్ వాసి జయసింహగౌడ్

- పర్వతారోహకుడి సాహసానికి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అభినందనలు.. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించేందుకు సహకారం అందిస్తామని హామీ

రామంతాపూర్, నవంబర్ 6 (మన మీ వార్త):



రామంతాపూర్‌కు చెందిన ప్రముఖ మారథాన్ రన్నర్, పర్వతారోహకుడు కలాలి జయసింహగౌడ్ అరుదైన ఘనత సాధించారు. ఇటీవల నేపాల్‌లోని సుమారు 23 వేల అడుగుల ఎత్తైన హిమాలయ పర్వత శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించి తన సాహసాన్ని చాటుకున్నారు. గతంలోనూ ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతంతో పాటు అర్జెంటీనా, నేపాల్, లడఖ్ ప్రాంతాల్లోని పలు ఎత్తైన పర్వత శిఖరాలను అధిరోహించి తన ప్రతిభను నిరూపించుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం జయసింహగౌడ్ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనను ఘనంగా సత్కరించి, హిమాలయ పర్వతారోహణలో సాధించిన విజయానికి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. జయసింహగౌడ్ దేశవిదేశాల్లోని అత్యంత ఎత్తైన పర్వత శిఖరాలను ధైర్యసాహసాలతో అధిరోహించడం ఎంతో ప్రశంసనీయమని పేర్కొన్నారు. కఠినమైన పరిస్థితులను అధిగమిస్తూ పర్వతారోహణలో విజయాలు సాధించడం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. భవిష్యత్తులో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలనే జయసింహగౌడ్ లక్ష్యానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, క్రాంతి, ప్రశాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బహువార్షిక పశుగ్రాస సాగుకు రూ. 55 వేల ప్రభుత్వ సాయం

- పశు వైద్యుడు డాక్టర్ శ్రీకాంత్

ఖానాపురం నవంబర్ 6(మల్లేష్ మీవార్త ప్రతినిధి) :



పశుగ్రాస అభివృద్ధికి ప్రోత్సాహం అందించేందుకు తెలంగాణ రాష్ట్ర పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జాతీయ పశు ధన మిషన్ (ఎన్ఎల్ఎం) ద్వారా పశుగ్రాస అభివృద్ధి పథకాన్ని అమలు చేస్తున్నట్లు శాఖ వరంగల్ జిల్లా ఖానాపురం మండల వెటర్నరీ వైద్యులు డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ఎల్ఎం పథకం కింద బహువార్షిక పశుగ్రాసం సాగు చేసే అర్హులైన రైతులకు ప్రభుత్వం రూ. 55,000 ఆర్థిక సహాయం అందించనుందన్నారు.

ఈ పథకం ద్వారా కనీసం ఒక హెక్టారు (2.5 ఎకరాలు) విస్తీర్ణంలో మూడేళ్ల పాటు బహువార్షిక పశుగ్రాసాన్ని సాగు చేసే రైతులకు ఆర్థిక ప్రయోజనం కల్పించనున్నారు. పశుగ్రాస ఉత్పత్తిని పెంచడంతో పాటు పశుపోషణకు అవసరమైన మేతను అందుబాటులోకి తీసుకురావడం ఎన్ఎల్ఎం పథకం ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. పథకానికి అర్హత కలిగిన, ఆసక్తి ఉన్న రైతులు తమ ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, సాగునీటి వివరాలతో కూడిన ప్రొఫార్మా-111 దరఖాస్తును సమర్పించాల్సి ఉంటుంది. పథకానికి సంబంధించిన పూర్తి వివరాలు, అర్హతలు, దరఖాస్తు విధానం, పశు గ్రాస సాగుపై సాంకేతిక సలహాల కోసం రైతులు తమ స్థానిక ప్రభుత్వ పశు వైద్యశాల నందు గాని పశు వైద్యాధికారులను సంప్రదించవచ్చునన్నారు.

రాగంపేటలో పేరుకుపోయిన చెత్త.. ప్రజలకు తప్పని ఇబ్బందులు

ఖానాపురం నవంబర్ 6 (మల్లేష్ మీవార్త ప్రతినిధి) :



వరంగల్ జిల్లా ఖానాపురం మండలం రాగంపేట గ్రామంలో చెత్త పేరుకుపోవడంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో చెత్త ఎక్కడికక్కడ పేరుకుపోయి ఉండటంతో పారిశుద్ధ్య సమస్య నెలకొంది. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.



గ్రామంలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, పారిశుద్ధ్య నిర్వహణపై సరైన శ్రద్ధ చూపడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ కార్యదర్శి ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి, పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా గ్రామ సర్పంచ్ స్థానికంగా అందుబాటులో లేకపోవడం, ప్రజా సమస్యలను పట్టించుకునే వారు లేకపోవడంతో గ్రామస్థులు తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

సంబంధిత అధికారులు స్పందించి రాగంపేట గ్రామంలో పారిశుద్ధ్య సమస్యను పరిష్కరించాలని, చెత్త తొలగింపుతో పాటు గ్రామంలో పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అమీన్పూర్ డిసిని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ జడ్పిటిసి గంగుల సుధాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఈగ లలిత మల్లేష్.



పటాన్ చేరు అక్టోబర్ 06 మీ వార్త ప్రతినిధి :

అమీన్పూర్ సర్కిల్ నూతన డిప్యూటీ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన కుమారి ఎ. లలిత శ్రావణిని మాజీ జడ్పిటిసి గంగుల సుధాకర్ రెడ్డి, వడక్పల్లి మాజీ సర్పంచ్ ఈగ లలిత మల్లేష్, ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, వడక్పల్లి నాయకులు డిసినిమర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన డిప్యూటీ కమిషనర్ కు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

అనంతరం అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని పలు సమస్యలపై భేటీ అయ్యారు. సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని డిసీ హామీ ఇచ్చారు. అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీలలో అభివృద్ధి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ అదిస్తామని వారు పేర్కొన్నారు.

రామంతాపూర్ మినీ ట్యాంక్ బండ్ వద్ద ఘనంగా శ్రీ ధన్వంతరి జయంతి వేడుకలు

-- ధన్వంతరి భగవానుడికి పూలమాలలు వేసి నివాళులర్పించిన బీజేపీ నాయకులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

రామంతాపూర్, నవంబర్ 6 (మన మీ వార్త):



శ్రీ ధన్వంతరి జయంతిని పురస్కరించుకుని రామంతాపూర్ ప్రధాన రహదారిలోని మినీ ట్యాంక్ బండ్ వద్ద ధన్వంతరి జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి శ్రీ ధన్వంతరి భగవానుని విగ్రహానికి బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ భారతీయ సనాతన ధర్మ సంప్రదాయంలో భగవాన్ శ్రీ ధన్వంతరి ఆయుర్వేదానికి ఆద్యుడిగా, వైద్యశాస్త్ర పితామహుడిగా పూజలందుకుంటున్నారని తెలిపారు. సకల మానవాళికి సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ధన్వంతరి భగవానుడిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రామంతాపూర్ నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బాలయ్య నాయి, సంఘ ప్రతినిధులు, స్థానిక యువకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణాలకు నిధుల విడుదలపై హర్షం



(మన మీ వార్త న్యూస్) : నవంబర్ 06, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-

హైదరాబాద్ లో బీసీ ఆత్మగౌరవ భవనాల నిర్మాణం కోసం నిధుల విడుదలపై హర్షం వ్యక్తం చేస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలోని కేర్ డిగ్రీ కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

ప్రతి బీసీ కులానికి రూ.5 కోట్ల చొప్పున..

ప్రతిఒక్క బీసీ కులానికి రూ.5కోట్ల చొప్పున దాదాపు రూ.88 కోట్లు విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి, పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ కు బీసీ సంక్షేమ సంఘం తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు నరాల సుధాకర్ తెలిపారు. హైదరాబాద్ మహానగరంలో బీసీల కోసం ఒక ఆత్మ గౌరవ భవనం ఏర్పాటు అనేది బీసీలందరూ గర్వంచదగ్గ విషయమన్నారు. బీసీలకు ప్రభుత్వాలు ఎల్లవేళలా వెన్నుదన్నుగా నిలువాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కొయ్యాడ శంకర్, సాయి బసవ, పోతుగంటి గంగాధర్, దేశాయి గంగాధర్, సత్యనారాయణ, హన్మాండ్లు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ టౌన్‌షిప్‌లో మౌలిక వసతుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

- 90 శాతం పూర్తయిన నిర్మాణ పనులు.. మిగిలిన పనులకు వేగం పెంచాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, కలెక్టర్ సత్య శారద సమీక్ష



మన మీ వార్త నవంబర్ 06 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో భూములు కోల్పోయిన వారికి కేటాయించిన రాజీవ్ గాంధీ టౌన్‌షిప్‌లో మౌలిక వసతుల అభివృద్ధి పనుల త్వరితగతిన పూర్తి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులకు సూచించారు.

రాజీవ్ గాంధీ టౌన్‌షిప్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై శుక్రవారం వారు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ భవనం, ప్రభుత్వ పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వెటర్నరీ ఆసుపత్రి తదితర మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టిన నిర్మాణ పనులను సమీక్షించారు. ఇప్పటికే చేపట్టిన నిర్మాణ పనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మిగిలిన పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఎమ్మెల్యే, కలెక్టర్ సూచించారు. రాజీవ్ గాంధీ టౌన్‌షిప్‌లో నివసించే ప్రజలకు విద్య, వైద్యం, ఇతర ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉండేలా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలని పేర్కొన్నారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

ఈ సమీక్షలో ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, జోనల్ మేనేజర్ స్వామి, డీఆర్వో విజయలక్ష్మి, వరంగల్ ఆర్డీవో సుమ,గీసుకొండ తహసిల్దార్ రియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 10న జరగబోయే 'చలో కలెక్టరేట్' ధర్నాను జయప్రదం చేయండి: సీపీఐ పిలుపు

జవహర్ నగర్, నవంబర్ 06: (వార్త ప్రతినిధి)



ఈ నెల 10వ తేదీన జిల్లా కలెక్టరేట్ వద్ద తలపెట్టిన 'చలో కలెక్టరేట్' మహా ధర్నా కార్యక్రమాన్ని ప్రజలు, కార్మికులు, రైతులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు నిమ్మల నరసింహులు పిలుపునిచ్చారు.

జవహర్ నగర్ ప్రాంతంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రధాన డిమాండ్లు:

1. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను తక్షణమే అరికట్టాలి.
2. రైతులకు జరుగుతున్న అన్యాయాలను నిలిపివేసి, పంటలకు గిట్టుబాటు ధర కల్పించి న్యాయం చేయాలి.
3. కార్మికులకు జరుగుతున్న నష్టాలను, కార్మిక చట్టాల సవరణలను అరికట్టాలి.
4. ఎల్ నినో ప్రభావం పేరుతో కరెంటు చార్జీలు, ఇతర చార్జీలు పెంచి ప్రజలపై అదనపు భారం మోపవద్దు.

ప్రభుత్వాలు ప్రజా సమస్యలను గాలికొదిలేసి కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నాయని విమర్శించారు. అందుకే సీపీఐ, ఏఐటీయూసీ, రైతు సంఘం, మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఈ పోరాటం చేపడుతున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కాప్రా మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, ఏఐటీయూసీ నాయకులు, మండల అధ్యక్షులు అంబాల ఎల్లయ్య, పి. కిరణ్ కుమార్, ఆదర్శనగర్ శాఖ కార్యదర్శి డి. నాగేష్, గిరిప్రసాద్ నగర్ శాఖ సహాయ కార్యదర్శి కె. కురుమయ్య, సీహెచ్. ఎల్లయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు కె. జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ సొసైటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా నియమితులైన కర్నాటి వజ్రమ్మ వెంకటేశంకు ఘన సత్కారం

- శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపిన నాచారం మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్

నాచారం, నవంబర్ 6 (మనం మీ వార్త):

ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ సొసైటీ, న్యూఢిల్లీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా నియమితులైన శ్రీమతి కర్నాటి వజ్రమ్మ వెంకటేశంకు ఘన సత్కారం లభించింది. ఈ సందర్భంగా నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి శాంతి సాయిజెన్ శేఖర్ ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి హృదయపూర్వక శు



భాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా కర్నాటి వజ్రమ్మ వెంకటేశంను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ సొసైటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం అభినందనీయమని పేర్కొంటూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా చేనేత కార్మికుల సంక్షేమం, అభ్యున్నతికి కృషి చేస్తూ సమాజానికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో చిటిపోలు పద్మ లక్ష్మీనారాయణ, చిటిపోలు ఇందిరా సత్యనారాయణ, చిటిపోలు రమేష్, చిటిపోలు అనిత సురేష్, జెల్ల పద్మ నరసింహ తదితరులు పాల్గొని కర్నాటి వజ్రమ్మ వెంకటేశంకు అభినందనలు తెలిపారు.

ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు దిశగా తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

పటాన్ చేరు నవంబర్ 06 మీ వార్త ప్రతినిధి:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపిన పటాన్చెరువు నియోజకవర్గ ఎస్టి సెల్ నాయకులు మెగావత్ సురేష్ నాయక్

తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటివరకు ఉమ్మడి ఎస్సీ, ఎస్టీ కమిషన్ కొనసాగుతున్న నేపథ్యంలో, గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, హక్కుల పరిరక్షణకు మరింత ప్రాధాన్యత కల్పించేలా ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని పటాన్చెరు నియోజకవర్గ ఎస్టీ సెల్ నాయకులు మెగావత్ సురేష్ నాయక్ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు వల్ల గిరిజనుల సమస్యలను ప్రత్యేకంగా గుర్తించి, వారి హక్కుల పరిరక్షణకు, విద్యా, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధికి మరింత సమర్థవంతంగా కృషి చేసే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలకు సత్వర



పరిష్కారం లభించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేందుకు ఈ కమిషన్ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సామాజిక న్యాయానికి, అణగారిన వర్గాల అభ్యున్నతికి పెద్దపీట వేస్తూ తీసుకుంటున్న నిర్ణయాలు అభినందనీయమని మెగావత్ సురేష్ నాయక్ అన్నారు.గిరిజనుల చిరకాల ఆకాంక్షలకు ప్రాధాన్యతనిస్తూ ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటుకు చొరవ చూపిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి, రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఆయన తెలిపారు.

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు పారిజాత నరసింహారెడ్డికి ఘనంగా అభినందనలు.





- మర్యాదపూర్వకంగా భేటీ అయి శాలువా, మొక్కతో సత్కరించిన మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు యలమంచి ఉదయ్ కిరణ్, అల్విన్ కాలనీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్

మియాపూర్ నవంబర్ 06 మన మీ వార్త:

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డి సి సి) అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన పారిజాత నరసింహారెడ్డిని మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు యలమంచి ఉదయ్ కిరణ్, అల్విన్ కాలనీ సీనియర్ నాయకులు పట్వారీ శశిధర్ మర్యాదపూర్వకంగా కలుసుకుని హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా పారిజాత నరసింహారెడ్డి ని శాలువాతో ఘనంగా సత్కరించి, మొక్కను అందజేశారు.

అనంతరం నాయకులు మాట్లాడుతూ.. పారిజాత నరసింహారెడ్డి సమర్థవంతమైన నాయకత్వంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తూ, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి ఆమె నాయకత్వం మరిన్ని విజయాలను అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివేకానంద నగర్ సీనియర్ నాయకులు బాష్పాక యాదగిరి, బాబ్జి, సాయి లోహిత్, శశి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కొత్త బాధ్యతల్లో పారిజాత నరసింహారెడ్డి మరిన్ని విజయాలు సాధించి, రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి విశేష కృషి చేయాలని నాయకులు మరోసారి హృదయపూర్వక శు భాకాంక్షలు తెలియజేశారు.

ఓల్డ్ ఎం.ఐ.జి.లో 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్ల తొలగింపును అడ్డుకున్న పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి

పటాన్ చేరు నవంబర్ 06 మీ వార్త ప్రతినిధి :

- 45 రోజుల గడువు ఇవ్వాలని రైల్వే అధికారులకు విజ్ఞప్తి..

ఓల్డ్ ఎం.ఐ.జి., శేరిలింగంపల్లి ప్రాంతంలో గత సుమారు 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న పేద కుటుంబాల గుడిసెలను తొలగించేందుకు రైల్వే పోలీసులు, అధికారులు మరియు సిబ్బంది వచ్చిన విషయం తెలుసుకున్న పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆదర్శ్ రెడ్డి వెంటనే అక్కడికి చేరుకుని తొలగింపు చర్యలను నిలిపివేయాలని కోరారు.ఎన్నో సంవత్సరాలుగా అక్కడే నివసిస్తున్న పేద కుటుంబాలకు ప్రత్యామ్నాయ నివాస ఏర్పాట్లు చేయకుండా ఇళ్లను తొలగించడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.అనంతరం రైల్వే అధికారుల సమక్షంలోనే



స్థానిక ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ గారితో ఫోన్‌లో మాట్లాడి ఈ సమస్యను వివరించారు. బాధిత కుటుంబాలకు ప్రత్యామ్నాయ నివాస ఏర్పాట్లు కల్పించేలా ఎమ్మెల్యే గాంధీ గారితో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఆదర్శ్ రెడ్డి గారు తెలిపారు. అలాగే, నివాసితులకు ఇబ్బందులు



కలగకుండా మానవతా దృక్పథంతో కనీసం 45 రోజుల గడువు ఇవ్వాలని రైల్వే అధికారులను కోరారు. దీనికి స్పందించిన రైల్వే సిబ్బంది 45 రోజుల గడువు వరకు వేచి ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మోహన్ గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, భాస్కర్ ముదిరాజ్, గిరి, నర్సింహ, సంపత్ గౌడ్, చిన్న, తిలావత్, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన

కాసిపేట, నవంబర్ 6:(మన మీ వార్త మండల ప్రతినిధి)



కాసిపేట మండలం సండ్రల్‌పహాడ్ గ్రామంలో శుక్రవారం ఆత్మ ఆధ్వర్యంలో వరి సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు క్షేత్ర పాఠశాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారుమడి యాజమాన్యం, సరైన సమయంలో నాట్లు వేయడం, మొక్కల మధ్య దూరం, సమతుల్య ఎరువుల వినియోగం, నీటి యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ అధికారులు వివరించారు. చీడపీడలు, తెగుళ్ల నివారణకు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలని సూచించారు. రాబోయే యాసంగిలో సూపర్ ఎల్ నినో ప్రభావంతో నీటి లభ్యత తగ్గే అవకాశాలున్న నేపథ్యంలో వరికి బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు సూచించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాల కోసం ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకొని రైతు గుర్తింపు కార్డు పొందాలని, రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రత్నం సుకుమారి, ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, మండల వ్యవసాయ అధికారి చల్లా ప్రభాకర్, వ్యవసాయ విస్తరణ అధికారి టి. సాగర్, ఆత్మ డైరెక్టర్లు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

పిల్లల విద్యాసామర్థ్యాలను పెంపొందించడం కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

- ఫౌండేషన్ లిట్రసి అండ్ న్యూమరసి ఎఫ్ ఎల్ ఎన్. పై ప్రత్యేక సమావేశం
- విద్యాశాఖ పై సుదీర్ఘంగా సమీక్షా సమావేశం నిర్వహించిన :: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.





మన మీ వార్త నవంబర్06 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశం మందిరంలో ఇన్చార్జి డిఇఓ, అదనపు కలెక్టర్ రెవెన్యూ కె.అనిల్ కుమార్, లతో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్. సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు,

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని (107) పౌండేషన్ లిట్రసి అండ్ న్యూమరసి, ఎఫ్ఎల్ఎన్ స్పాట్ అసెస్మెంట్ ఫలితాలపై పాఠశాలలు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని పిల్లలకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధనలో అందించాలని అన్ని పారామీటర్లలో జిల్లాను ముందు వరుసలో ఉంచాలని కలెక్టర్ తెలిపారు,

పీఎం శ్రీ పాఠశాలల్లో మౌలిక వసతులు విద్య బోధనలు వివిధ పనులు తదితర అంశాలపై పెండింగ్ ఉండవద్దని అట్టి విషయంలో విద్యాశాఖ అధికారులు నివేదికలు వెంటనే సమర్పించాలని ఆదేశించారు,

మండల స్థాయిలో విద్యాశాఖ అధికారులు ప్రతినిత్యం పాఠశాలలను తనిఖీ చేస్తూ విద్య ప్రమాణాలను ఎఫ్ ఎల్ ఎన్ తరగతుల ద్వారా అందిస్తున్న విద్య బోధనలను వివరాలు సేకరించాలన్నారు,

క్షేత్రస్థాయిలో పాఠశాలలో మౌలిక వసతుల పెండింగ్ పనులు అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, కాంపౌండ్ వాల్స్, బ్లాక్ బోర్డ్స్ బెంచీలు, పిల్లలకు యూనిఫార్ములు, టెస్ట్ బుక్కులు, తదితర సౌకర్యాలను ఇబ్బందులు లేకుండా అందించాలని సూచించారు,

జాతీయ, రాష్ట్రస్థాయిలో విద్యాశాఖ అమలు చేస్తున్న పథకాలను జిల్లాలో కచ్చితంగా ముందు వరుసలో ఉంచాలని అందుకు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు,

ప్రాథమిక,హై స్కూల్ స్థాయిలలో కొన్ని చోట్ల విద్యార్థులు వెనుకబడి ఉన్నారని వారిని గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యా బోధనలు అందించాలన్నారు,

ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలుతోపాటు జిల్లాలో ఎఫ్ ఎల్ ఎన్, లీప్ కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నామని, అదేవిధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలన్నారు,

విద్యాసంస్థలలో ఉపాధ్యాయులు, పిల్లల యొక్క హాజరు 100 శాతం కచ్చితంగా నమోదు అవ్వాలని అందుకు తల్లిదండ్రులను పిల్లలను చైతన్యపరచాలన్నారు,

ఇన్స్పైర్, డ్రాఫ్ట్ బాక్సుల క్లియరెన్స్ తదితర కొన్ని అంశాలలో జిల్లా విద్యాశాఖ రాష్ట్రస్థాయిలో ముందు వరుసలో ఉందని తెలిపారు,

కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, టీంల వారీగా విభజించిన వారితో కలెక్టర్ క్షేత్రస్థాయిలో జరుగుతున్న విషయాలు విద్య బోధనల గురించి సవివరంగా అడిగి తెలుసుకున్నారు,

అత్యంత వెనుకబడిన పాఠశాలలు, విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు,

పిల్లలకు అందించే విద్య అంశాలు తదితర సౌకర్యాలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు.

పాఠశాలలను కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సందర్శించిన సమయంలో విద్యాశాఖ యాప్ లో నమోదు చేయాలని, ఏజిఆర్ రిజిస్టర్ లో ఎంటర్ చేసిన విషయాలను ఉపాధ్యాయులు నిరువృత్తి చేసుకోవాలన్నారు,

పదవ తరగతి పరీక్షల్లో జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించడం కోసం షెడ్యూల్ ప్రకారం సిలబస్సు డిసెంబర్ లోగా పూర్తి చేయాలని, పిల్లల యొక్క పరీక్ష టెస్టులను నిర్వహించాలన్నారు,

ఇటీవలే జరిగిన సమ్మిట్ 1, ఫలితాల ఆధారంగా సేకరించి పిల్లలను ఏబిసి విభజించి నివేదికను అందించాలన్నారు,

ఈ కార్యక్రమంలో ఏ ఏం ఓ , వెంకటేశ్వర్లు, గాయత్రి, కోఆర్డినేటర్స్ పూర్ణచందర్, సంతోష్, శంకర్, అన్ని మండలాల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

వరంగల్,జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు అవసరమైన గుడ్ల సరఫరాకు సంబంధించి టెండర్ల ప్రక్రియ



మన మీ వార్త నవంబర్ 06 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

నిబంధనల ప్రకారం, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.

గుడ్ల సరఫరా టెండర్లకు సంబంధించి నిర్వహించిన ప్రీ-బిడ్ సమావేశంలో టెండర్ల నిబంధనలు, సరఫరా విధానం, అర్హతలు, ధరలు, నాణ్యత ప్రమాణాలు తదితర అంశాలపై చర్చించారు.

టెండర్లలో పాల్గొనే కాంట్రాక్టర్లు నిబంధనలను పూర్తిగా పరిశీలించి, అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

గుడ్ల సరఫరాలో నాణ్యత, సమయపాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని, అర్హులైన సరఫరాదారులకు సమాన అవకాశాలు కల్పిస్తూ టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పూర్తి వివరాలు తెలుసుకోవడానికి ష్ట్రజూం:7/వశ్రీఘఅస్త్రుఘఅ.స్త్రశీఙ.అఅ లో అందుబాటులు ఉంటాయన్నారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్,డిబిసిడివో పుష్పలత, డిఎస్డిఓ హమీద్, జిల్లా మహిళా మరియు శిశు అభివృద్ధి శాఖ అధికారి రాజమణి, (ణూజణూ), సంబంధిత అధికారులు, టెండర్లలో పాల్గొనే ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

- సాధారణ ప్రసవాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించాలి
- డెంగ్యూ, మలేరియా నియంత్రణకు విస్తృత చర్యలు చేపట్టాలి

మన మీ వార్త నవంబర్ 06 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలులో నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద వైద్య ఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

జిల్లాలో జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, పురోగతి, లక్ష్యాల సాధనపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాతా శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, గర్భిణుల నమోదు, ఏఎన్‌సీ సేవలు, ప్రసవాల వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, సిజేరియన్ ప్రసవాలు అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి కారణాలను విశ్లేషించాలని ఆదేశించారు. లింగ నిర్ధారణ పరీక్షలు, అక్రమ గర్భస్రావాల నివారణకు పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని, టీకా కార్యక్రమాలకు సంబంధించి యూ-విన్ పోర్టల్‌లో పెండింగ్ వివరాలను వెంటనే నమోదు చేయాలన్నారు. హైపర్‌టెన్షన్, మధుమేహ వ్యాధుల స్క్రీనింగ్‌ను వంద శాతం పూర్తి చేసి బాధితులకు నిరంతర వైద్య సేవలు అందించాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా నియంత్రణకు ఫీల్డ్ సర్వేలు, డ్రై డే కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్స, రోగుల వివరాల నమోదు ప్రక్రియను మెరుగుపరచాలన్నారు. డీబీటీ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జోష్ టీమ్‌లను ఏర్పాటు చేసి ప్రత్యేక అధికారులు, వైద్యాధికారుల సమన్వయంతో కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పెండింగ్ అంశాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని, పురోగతి నివేదికలను సమర్పించాలని ఆదేశించారు.

కలెక్టర్‌ను కలిసిన రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఎన్‌టీఈపీ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుమలత అనంతరం కలెక్టర్‌ను కలిసి క్షయ నియంత్రణ కార్యక్రమంలో డీబీటీ ప్రక్రియను వేగవంతం చేయాలని, జోష్ టీమ్‌ల ఏర్పాటుకు అవసరమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సాజిదా, డాక్టర్ ఇక్తిదార్ అహ్మద్, డాక్టర్ అరుణ్ జోషి, డాక్టర్ రవీందర్, డాక్టర్ మానస శ్యామల, జిల్లాలోని వైద్యాధికారులు పాల్గొన్నారు.

క్యాప్షన్: జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద.

ఆర్‌సీ పురం జెడ్పీహెచ్ఎస్‌లో న్యాయ అవగాహన సదస్సు..

పటాన్ చేరు నవంబర్ 06 మీ వార్త ప్రతినిధి :

- బాలల హక్కులు, సైబర్ నేరాలు, బాలికల భద్రతపై అవగాహన..





విద్యార్థులు చిన్న వయస్సు నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సంగారెడ్డి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య సూచించారు. హైకోర్టు అడ్వకేట్ ఐలాపూర్ మాణిక్ యాదవ్ ఆధ్వర్యంలో రామచంద్రాపురం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు చట్టపరమైన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బి. సౌజన్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు.

భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, బాలల రక్షణ చట్టం (పోక్సో), సైబర్ నేరాలు, మొబైల్ ఫోన్ వినియోగం, బాలికల భద్రత, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, పౌర బాధ్యతల గురించి వివరించారు. విద్యార్థులు తమ హక్కులను తెలుసుకోవడంతో పాటు ఇతరుల హక్కులను గౌరవించాలని, చట్టాలను పాటిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా సామాజిక స్పృహ, రాజ్యాంగ విలువలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సబ్ఇన్‌స్పెక్టర్ విజయ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలి : సీపీ సాయిచైతన్య

(మన మీ వార్త న్యూస్) : నవంబర్ 06, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో పాల్గొనే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. నగరంలో క్రీడలు నిర్వహించే పలు ప్రాంతాలను ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు.తెలంగాణ వార్తలు

సమన్వయంతో పని చేయాలి

జానకంపేటలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించిన సీపీ క్రీడాకారుల బస కోసం చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా వసతి గదులు, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను సమకూర్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఆతిథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే పూర్తి చేయాలని , ప్రతి విభాగానికి ప్రత్యేక బాధ్యతలు కేటాయించి సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్--2026ను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని విధాలుగా సమగ్ర ఏర్పాట్లు చేస్తోందని పోలీస్ కమిషనర్ తెలిపారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్, సీటీసీ ఏసీపీ రాజశేఖర్ , బోధన్ రూరల్ సీఐ విజయబాబు, రుద్రూర్ సీఐ కృష్ణ, బోధన్ ఎస్‌హెచ్‌వో వెంకట్ నారాయణ, ఎడపల్లి ఎస్సై రమ తదితరులు ఉన్నారు.

ఎల్‌నినో నేపథ్యంలో రైతాంగానికి బాసటగా నిలవాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి

(మన మీ వార్త న్యూస్) : నవంబర్ 06, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



ఎల్‌నినో నేపథ్యంలో జిల్లా రైతాంగానికి బ్యాంకర్లు బాసటగా నిలువాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. కలెక్టరేట్ లో శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి బ్యాంకర్ల సమావేశం జరిగింది.

పంట రుణాల రీషెడ్యూల్..

ఎల్‌నినో వల్ల తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉన్న నేపథ్యంలో పంట రుణాల రీషెడ్యూల్, రైతులకు బ్యాంకుల ద్వారా అందించాల్సిన ఆర్థిక సహాయంపై ఈ సమావేశంలో చర్చించారు. ఎస్ఎల్బీసీ జారీ చేసిన తాజా మార్గదర్శకాల మేరకు జిల్లా రైతాంగానికి ప్రయోజనం చేకూరేలా బ్యాంకర్లు చొరవ చూపాలన్నారు. వ్యవసాయమే ప్రధాన ఆధారంగా ఉన్న నిజామాబాద్ జిల్లాలో ప్రస్తుత ప్రతీకూల పరిస్థితుల్లో రైతులకు బ్యాంకర్లు బాసటగా నిలువాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బ్యాంకర్లతో సమన్వయము పెంపొందించుకుని అర్హులైన రైతులకు సకాలంలో రుణాల రీషెడ్యూల్, కొత్త రుణాల పంపిణీ, అవసరమైన సహకారం అందేలా చూడాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

18 సాధారణ కరువు ప్రభావిత మండలాల్లో

ప్రభుత్వంచే గుర్తించబడిన జిల్లాలోని 18 సాధారణ కరువు ప్రభావిత మండలాల్లో అర్హులైన రైతులకు పంట రుణాలను ఎస్ఎల్బీసీ మార్గదర్శకాల ప్రకారం రీషెడ్యూల్ చేసి, 12 నెలల మారటోరియం కల్పించాలని కలెక్టర్ బ్యాంకర్లను ఆదేశించారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో రైతులకు కొత్తగా పంట రుణాలు సకాలంలో అందజేసి, వారికి అండగా నిలవాలని సూచించారు. వర్షాభావం దృష్ట్యా యాసంగిలో వరి సాగుకు బదులుగా ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని రైతులకు సూచించడం జరిగిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వరికి ప్రత్యామ్నాయంగా ఇతర అనువైన పంటలను సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు పంట రుణాల రూపంలో ఆర్థిక వెసులుబాటు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాజాగౌడ్, ఆర్బీఐ ప్రతినిధి రాములు, నాబార్డు డీడీఎం ప్రవీణ్, జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, వ్యవసాయ శాఖ ఏడీ వీరస్వామి, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి గోరి మండల కేంద్రంలో రూ.30 లక్షల వ్యయంతో

- నూతన మసీద్ నిర్మాణానికి శంకుస్థాపన

నవంబర్ 7,112026 పరకాల ప్రతినిధి మన మీ వార్త



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొత్తపల్లి గోరి మండల కేంద్రంలోని పీరీల మసీద్ నూతన భవన నిర్మాణానికి రూ.30 లక్షల వ్యయంతో భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని మతాల ప్రజలు సోదరభావంతో, ఐకమత్యంగా జీవించాలని అన్నారు. మత సామరస్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, మసీద్ నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. నూతన భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, మసీద్ కమిటీ సభ్యులు, ఆచారవంతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

హుజురాబాద్ మున్సిపల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం...వాడితల ప్రణవ్..





- ప్రజల నమ్మకానికి తగ్గట్టుగా పని చేస్తున్నాం..
- కోటి యాభై లక్షలతో నిర్మించబోయే 4ప్రధాన కూడళ్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన ప్రణవ్...
- హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన హుజురాబాద్ ఇంచార్జి వొడితల ప్రణవ్..

మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి నవంబర్ 06.

హుజురాబాద్ పట్టణ ప్రజలు తమపై పెట్టిన నమ్మకానికి తగ్గట్టుగా పని చేస్తున్నామని,హుజురాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని,15 కోట్లు రూపాయలను అభివృద్ధికి మంజూరు చేపించామని దాంట్లో భాగంగా హుజురాబాద్ ప్రధాన చౌరస్తాలో పట్టణ సుందరీకరణలో భాగంగా 4 చౌరస్తాల అభివృద్ధికి నేడు శ్రీకారం చుట్టారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్..శుక్రవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి దగ్గరలో గల చౌరస్తా అభివృద్ధికి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ



హుజురాబాద్ మున్సిపల్ పరిధిలో కోటి యాభై లక్షల రూపాయలతో నాలుగు ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేస్తున్నామని,4.5 కోట్లతో సీసీ రోడ్లు,2.5 కోట్లతో డ్రైనేజ్ పనులకు,చిన్నపిల్లలు ఆహ్లాదంగా ఉండడానికి చిల్డ్రన్ పార్క్ తో పాటు ఇతర అభివృద్ధి పనులు త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు.గ్రామాల్లో ఐ మాక్స్ లైట్స్,58 లక్షలతో గ్రామాల్లో తాగు నీటికి ఇబ్బందికి కలగకుండా బోర్లను మంజూరు చేపించామని తెలిపారు.హుజురాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఇతర నాయకుల్లాగా మాటలు చెప్పమని,ఏదైతే చెప్తామో దాన్ని చేసి చూపిస్తామని అన్నారు..

ఇందిరమ్మ ఇంట్లో దీపావళి..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద ప్రజలకు వరంగా మారిందని,ఇళ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని,పీసీసీ ఆదేశాల మేరకు మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి కార్యక్రమానికి నియోజకవర్గ ఇంచార్జిగా హుజురాబాద్ మండల పరిధిలోని ధర్మరాజుపల్లిలో దీపావళి పండుగ ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులతో జరుపుకోనున్నట్లు తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా 4,50,000 వేల ఇళ్లు మంజూరు కాగా 2,21,500 ఇళ్లు పూర్తి అయ్యాయని,నియోజకవర్గ వ్యాప్తంగా 5500 ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు 2500 పై చిలుకు ఇళ్లు పూర్తి అయ్యాయని అన్నారు.ఈ సందర్భంగా ప్రజా ప్రభుత్వాన్ని,ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,వైస్ చైర్మన్ అంజలి,కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు,పట్టణ అధ్యక్షుడు,జిల్లా అధికార ప్రతినిధులు,యూత్,మైనారిటీ,మహిళ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ములుగు జిల్లా గ్రామాల అభివృద్ధి పనులకే ప్రాధాన్యమివ్వాలి

- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు తక్కువ ధరకే సిమెంట్
- త్వరలో అర్హులకు నూతన పింఛన్లు
- వెంకటాపూర్ మండలంలో 11,863 మందికి స్మార్ట్ రేషన్‌కార్డులు
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క

మన మీ వార్త నవంబర్ 06 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

గ్రామ అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకే ప్రాధాన్యమివ్వాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క సూచించారు. పేదల సంక్షేమంతోపాటు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.

శుక్రవారం వెంకటాపూర్ మండలం నారాయణగిరిపల్లెలో ఐటీడీఏ ఏటూరునాగారం ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధులు రూ.20 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని మంత్రి సీతక్క ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ప్రారంభించారు.

అనంతరం రామాంజపురం గ్రామంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సీఆర్ఆర్ ఎస్‌సీపీ, ప్లెయిన్ నిధులు రూ.135 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలను మంత్రి ప్రారంభించారు. అలాగే సీఆర్ఆర్ 2025--26 నిధులు రూ.150 లక్షల అంచనా వ్యయంతో రామాంజపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి వినాయక రైస్‌మిల్ పంచముఖాలయం వరకు నిర్మించిన రోడ్డును ప్రారంభించారు.

తదనంతరం వెంకటాపూర్ మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి సీతక్క ముఖ్యఅతిథిగా హాజరై, లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్‌కార్డులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నారాయణగిరిపల్లె గ్రామపంచాయతీ అభివృద్ధికి ఇప్పటివరకు దాదాపు రూ.కోటిన్నర నిధులు





కేటాయించినట్లు తెలిపారు. గ్రామంలోని ప్రతి వాడలో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించేందుకు పాలకవర్గం సమావేశమై తీర్మానాలు చేయాలని సూచించారు. ఆలయాలకు వెళ్లే దారులతోపాటు గ్రామ అవసరాలను ప్రాధాన్య క్రమంలో గుర్తించి ప్రతిపాదనలు అందజేస్తే, ఆయా పనులకు నిధులు మంజూరు చేస్తామని పేర్కొన్నారు.

గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు. మహిళా సంఘాల భవనాలు, పాఠశాల ప్రహరీలు, యువతకు గ్రంథాలయ భవనం, చెరువుల కాలువలు తదితర అవసరాలకు అనుగుణంగా పనులను గుర్తించాలని తెలిపారు. గ్రామంలో వివాహాలు నిర్వహించుకునేందుకు ఫంక్షన్ హాల్ నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని, ఇంకా ఇళ్లు లేని అర్హులను గుర్తించి వారికి కూడా ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 లక్షలు అందిస్తోందని పేర్కొన్నారు. నిర్మాణ వ్యయం పేదలకు భారం కాకుండా తక్కువ ధరకు సిమెంట్ అందించే సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు.

బహిరంగ మార్కెట్‌లో బస్తా సిమెంట్ ధర దాదాపు రూ.300 నుంచి రూ.350 వరకు ఉండగా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ.230 నుంచి రూ.250కే అందిస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. లబ్ధిదారులకు అవసరమైన సిమెంట్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించి, ఈ సౌకర్యాన్ని వినియోగించుకునేలా పంచాయతీ కార్యదర్శులు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో కొత్తగా దాదాపు నాలుగున్నర లక్షల మందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పింఛన్లు అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఈ నెల 8వ తేదీ నుంచి కొత్త లబ్ధిదారులకు పింఛన్లు అందించే కార్యక్రమం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

వెంకటాపూర్ మండలంలో 11,863 మందికి స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేస్తున్నట్లు మంత్రి తెలిపారు. గతంలో రేషన్‌కార్డులు పొందని అర్హులకు కూడా నూతన కార్డులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు సులభంగా వెంట తీసుకెళ్లేందుకు అనువుగా స్మార్ట్ కార్డులను రూపొందించినట్లు తెలిపారు.

కుటుంబ నిర్వహణలో మహిళలు కీలక పాత్ర పోషిస్తారని మంత్రి పేర్కొన్నారు. మహిళల పేరు మీద రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అందించడం ద్వారా వారికి కుటుంబంలో భద్రతతోపాటు గౌరవం కల్పించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. మహిళలు ఆత్మగౌరవంతో జీవించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారి సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధులు గ్రామ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని, వారంలో మూడు నుంచి నాలుగు రోజులు ములుగు జిల్లాలోనే పర్యటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నట్లు మంత్రి తెలిపారు. సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గ సభ్యులు సమన్వయంతో పనిచేసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఆదర్శ గ్రామంగా ఎంపికైతే రూ.కోటి నిధులు పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, తహసిల్దార్ గిరిబాబు, ఆయా గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో వచ్చే ఉచిత లింకుల వలలో పడకండి.రేగొండ ఎస్సై సుధాకర్ హెచ్చరిక..

నవంబర్ 7,11,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త



భూపాలపల్లి జయశంకర్ రేగొండ మండలం జిల్లా ఆన్‌లైన్‌లో వచ్చే ఉచిత లింకుల వలలో పడకండి.ఎందుకంటే "ఉచితం" అనే ముసుగులో సైబర్ నేరగాళ్లు మిమ్మల్ని మోసం చేయడానికి రకరకాల ప్లాన్లు వేస్తుంటారనీ రేగొండ ఎస్సై సుధాకర్ హెచ్చరించారు.. శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.

"ఉచితం" అనే ముసుగులో సైబర్ నేరగాళ్లు మిమ్మల్ని మోసం చేయడానికి రకరకాల ప్లాన్లు వేస్తుంటారనీ ఈ విధమైన మోసాల నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోవడానికి కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.

ఆశ చూపించే లింకులు దీపావళి పండుగ ఆఫర్"మీకు ఉచితంగా రూ.5000 రీఛార్జ్ వచ్చింది", "ఉచిత స్మార్ట్‌ఫోన్ గెలుచుకున్నారు", లేదా "ప్రభుత్వ పథకం కింద ఉచితంగా డబ్బులు ఇస్తున్నారు" అంటూ వాట్సాప్, ఎస్ఎమ్ఎస్‌లలో వచ్చే లింకులను అస్సలు నమ్మకండి.

నకిలీ వెబ్‌సైట్లు ఈ లింకులను క్లిక్ చేయగానే అవి అసలైన వెబ్‌సైట్ లాగే కనిపించే నకిలీ (Fake) పేజీలకు మిమ్మల్ని తీసుకెళ్తాయి. అక్కడ మీ బ్యాంక్ వివరాలు, పాస్‌వర్డ్‌లు, లేదా ఆధార్ నంబర్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలిస్తారు.

వైరస్/మాల్‌వేర్ ప్రమాదం జరుగుతుంది కొన్ని లింకులను క్లిక్ చేయడం వల్ల మీ ఫోన్ లేదా కంప్యూటర్లలోకి తెలియకుండానే ప్రమాదకరమైన సాఫ్ట్‌వేర్ డౌన్‌లోడ్ అయిపోతుంది. దీనివల్ల మీ ఫోన్ హ్యాక్‌కి గురయ్యే అవకాశం ఉంది. ఇలాంటి లింకులను నిజమేనని నమ్మి మీ స్నేహితులకు, వాట్సాప్ గ్రూపులకు ఫార్వార్డ్ చేయకండి.

ఏదైనా ఆఫర్ లేదా ప్రభుత్వ పథకం గురించి తెలిస్తే, నేరుగా వారి అధికారిక (అఫీషియల్) వెబ్‌సైట్‌కి వెళ్లి మాత్రమే సరిచూసుకోండి.

ఒకవేళ పొరపాటున లింక్ క్లిక్ చేసి డబ్బులు పోగొట్టుకుంటే, వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేసి లేదా cybercrime.gov.in వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయండి.

"ఉచితం" అనే ప్రతిదీ నిజం కాదు, కాబట్టి ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండండి అన్నారు..

పోటీ పరీక్షల బోధనకు అతిథి అధ్యాపకులకు ఆహ్వానం

ఖానాపురం నవంబర్ 6 (మల్లేష్ మీ వార్త ప్రతినిధి):



విద్యార్థులకు పోటీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేలా నాణ్యమైన శిక్షణ అందించేందుకు ఖానాపురం మండలంలోని బుధరావుపేట మోడల్ జూనియర్ కళాశాల అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పెరక సునీత ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు కామన్ లా అడ్మిషన్ టెస్ట్ తో పాటు ఇతర పోటీ పరీక్షలకు బోధించేందుకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

అర్హతలు ఇవే.....

ఎల్.ఎల్.బి./ఎల్.ఎల్.ఎం., ఎం.ఏ. ఇంగ్లీష్, ఎం.ఏ. పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్‌లో విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. బోధనలో అనుభవంతో పాటు మంచి కమ్యూనికేషన్ నైపుణ్యాలు కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.

ఎంపికైన అతిథి అధ్యాపకులకు ఒక్కో పీరియడ్‌కు రూ.650 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు ప్రిన్సిపల్ వెల్లడించారు. తరగతులు ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు 2026 నవంబర్ 10లోగా బుధరావుపేట మోడల్ జూనియర్ కళాశాలలో దరఖాస్తు ఫారాన్ని సమర్పించాలని ప్రిన్సిపల్ పెరక సునీత సూచించారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వేరో ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ



మొగుళ్ళపల్లి,(మీవార్త ప్రతినిధిమనోజ్)నవంబర్6:

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని అంబేద్కర్ విగ్రహం దగ్గర స్వేరో ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొడిపాక రమేష్ బాబు స్వేరో రాష్ట్ర కమిటీ మెంబెర్ మీడిదొడ్డి పృధ్వి రాజ్ స్వేరో జిల్లా నాయకులు పుల్యాల భగత్ స్వేరో ,స్వేరో జిల్లా అధికార ప్రతినిధి, మొగుళ్లపల్లి మండల ఉప సర్పంచ్ ఫోరమ్ మండల ఉపాధక్షులు నేర్పటి శ్రీనివాస్, మొగుళ్లపల్లి మండల స్వేరో కన్వినర్ బొచ్చు రాధాకృష్ణ, కో కన్వినర్ పాడుగుల శివకుమార్ తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

జంటతో అసభ్యంగా ప్రవర్తించి డబ్బు స్కూటీ లాక్కున్న నిందితుడి అరెస్టు

(మన మీ వార్త న్యూస్) : నవంబర్ 06, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి):-



నిర్మానుష్య ప్రాంతంలో తిరిగే జంటలను వేదించడం వారి వద్ద ఉన్న బంగారు నగలను, వాహనాలను లాక్కోవడంలో ఆరితేరిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిజామాబాద్ 5వ టౌన్ ఎస్సై సునీల్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ నగరంలోని న్యాల్ కల్ రోడ్డులో గల స్మార్ట్ సిటీ వెంచర్‌లో ఒక మహిళ తన కాబోయే భర్తతో ఉన్న సమయంలో అక్కడికి వచ్చిన ముగ్గురు వ్యక్తులు మద్యం సేవిస్తూ మహిళను వేధించి, ఆమె చేయి, చున్నీని లాగి అసభ్యంగా ప్రవర్తించారు. అంతేకాకుండా, వారి వద్ద ఉన్న రూ.4,000 నగదుతో పాటు స్కూటీని బలవంతంగా లాక్కొన్న సంఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు 5వ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన ఎస్సై సునీల్ నిందితులైన గోడనే గణేష్, ప్రమోద్, పరమేశ్వర్‌లలో ప్రధాన నిందితుడైన గోడనే గణేష్‌ను శుక్రవారం అరెస్టు చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మిగతా నిందితుల ఆచూకీ కోసం దర్యాప్తు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.గోడనే గణేష్ పై గతంలోనూ చాలా కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. పోలీసు యూనిఫాం ధరించి దోచుకున్న కేసుతో పాటు నకిలీ కరెన్సీ, బలవంతపు వసూళ్ళకు గణేష్ సూత్రధారి అని తెలిసింది.

పద్మశాలి ఆత్మగౌరవ భవనానికి రూ.5 కోట్లు కేటాయింపు..సీఎం రేవంత్ రెడ్డికి పాలాభిషేకంతో కృతజ్ఞతలు

మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి నవంబర్ 06.



హైదరాబాద్‌లోని కోకాపేటలో 2.5 ఎకరాల స్థలంలో పద్మశాలి ఆత్మగౌరవ భవన నిర్మాణం కోసం రూ.5 కోట్ల నిధులు కేటాయించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌లకు కృతజ్ఞతలు



తెలుపుతూ శుక్రవారం హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. పద్మశాలి సంఘం కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో, మంచికట్ల కమలాకర్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రణవ్ బాబు, హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, బండారి సదానందం, మార్త రవీందర్, వేముల యాదగిరి, చందుపట్ల జనార్దన్, కూరపాటి రామచంద్రం, సంఘం సత్యనారాయణ, సంగం శ్రీనివాస్, మెడికల్ సంఘం శ్రీనివాస్, చిప్ప దేవసాని ప్రియదర్శిని, కేఆర్ భిక్షపతి, కాంగ్రెస్ నాయకుడు ఇప్పకాయల సాగర్, కుడికాల ప్రభాకర్, ముషం రాజేందర్, కోమటి సదానందం, మామిడాల శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

చిల్కానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటర్ నమోదుపై ముమ్మర ప్రచారం

చిలుకా నగర్ నవంబర్ 6 (మన మీ వార్త):



చిల్కానగర్ డివిజన్లోని పలు పాఠశాలల్లో డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కార్యక్రమం పై ముమ్మర ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం పలువురు



పట్టబద్రులను కలిసి ఓటు నమోదు పై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా రాజేష్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణలో పట్టబద్రుడు చాలా కీలకమని పేర్కొన్నారు. మరికొన్ని రోజుల్లో జరగనున్న హైదరాబాద్ రంగారెడ్డి మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదై తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో డిజైన్ పరిధిలోని పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

మండల జలసిరి సమావేశంలో ప్రభుత్వ సూచనలు తెలిపిన ఎంపీడీవో కీర్తి రెడ్డి.



మనోహరాబాద్, నవంబర్ 06 మన మీ వార్త ప్రతినిధి.



మండల పరిధిలోని రైతు వేదికలో ఎంపీడీవో కీర్తి రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు మరియు సీనియర్ మేట్ లు, మండల స్థాయి అధికారులకు నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులకు ప్రతి గ్రామ పంచాయతీకి నవంబర్ 15 వరకు జలసిరి పూర్తి చేయాలని ఎంపీడీవో గ్రామాల వారిగా టార్గెట్ ఇవ్వడం జరిగింది వ్యక్తిగత ఇంకుడు గుంతలు ప్రతి గ్రామంలో 50 చొప్పున పూర్తి చేయాలని అలాగే మరుగుదొడ్లు కూడా నిర్మించుకోవాలని సూచించారు. కమ్యూనిటీ ఇంకుడు గుంతలు ప్రతి గ్రామంలో 15 పూర్తి చేయాలని అలాగే బోర్వెల్ రీఛార్జ్ స్ట్రక్చర్ లు 2 ఫారం ఫండ్ లు ప్రతి గ్రామ పంచాయతీకి 2 డ్రైవ్ అండ్ సోక్ ఫిట్ ప్రతి గ్రామపంచాయతీకి 1 పూర్తి చేయాలని ప్రతి గ్రామంలో ఉపాధి హామీ కూలీలు 65 మంది తప్పక చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలో అన్ని గ్రామాల కార్యదర్శిలు ఫీల్డ్ అసిస్టెంట్లు మరియు సీనియర్ మేట్ లో మండల అధికారులు ఎంపీఓ శ్రీనివాస్ రెడ్డి, ఏపీవో ఆదినారాయణ, విబిజి రాంజీ సిబ్బంది టెక్నికల్ అసిస్టెంట్ లు జగపతి, జ్యోతి, కంప్యూటర్ ఆపరేటర్ రమేష్, భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.

మద్దిమడలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



కాసిపేట, నవంబర్ 6:(మన మీ వార్త మండల ప్రతినిధి)

కాసిపేట మండలం మద్దిమడ గ్రామపంచాయతీలో శుక్రవారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సులభతరం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తోంది.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆడే దివ్య జంగు, మండల అధ్యక్షుడు పన్నాల మహేష్, వార్డు సభ్యుడు రోడ్డ మల్లేష్, రేషన్ డీలర్ సంధ్యారాణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

దేవాపూర్‌లో రెండు వీవో భవనాలకు భూమిపూజ



కాసిపేట, నవంబర్ 6:(మన మీ వార్త మండల ప్రతినిధి)

కాసిపేట మండలం దేవాపూర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ సిడాం రాందాస్ ఆధ్వర్యంలో శుక్రవారం 11, 12వ వార్డుల్లో రెండు వీవో భవనాల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రత్నం సుకుమారి, ఆత్మ కమిటీ చైర్మన్ రౌతు సత్తయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పన్నాల మహేష్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ కార్యదర్శి రత్నం ప్రదీప్ ఉపసర్పంచ్ గుండ అనసూయ, మద్దిమడ సర్పంచ్ ఆడే దివ్య జంగు, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఏపీఎం రాజ్‌కుమార్, సీసీ రాజమల్లు, ఏఈ పీఆర్ జగన్, పంచాయతీ కార్యదర్శి కవిత, వీవో నాయకులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన వొడితల ప్రణవ్..





మన మీ వార్త హుజూరాబాద్ ప్రతినిధి నవంబర్ 06.

హుజురాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై రోగులతో నేరుగా మాట్లాడి వివరాలు తీసుకున్నారు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్..శుక్రవారం రోజున హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం నలుమూలల నుండి పెద్దఎత్తున వైద్యసేవల కోసం వస్తారని వారికి అండగా,భరోసా ఇవ్వడానికి ఆసుపత్రికి వచ్చామని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యానికి పెద్దపేట వేస్తున్నామని,దానికి తగ్గట్టుగా నిధులు మంజూరు చేస్తున్నామని అన్నారు.ఈ సందర్భంగా రోగులు పలు సమస్యలు ప్రణవ్ దృష్టికి రాగా వాటిని పరిష్కరిస్తానని తెలిపారు.ఆసుపత్రి విషయంలో ఇప్పటికే జిల్లా కలెక్టర్,డిఎంహెచ్ఓ కు మాట్లాడడం జరిగిందని,ఆసుపత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని,కౌన్సిలర్లు,కో ఆప్షన్ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు జవహర్ నగర్‌లో బిగ్ షాక్

- బీజేపీలో చేరిన మాజీ ప్రధాన కార్యదర్శి కప్పల శ్రావణ్ కుమార్ - ఈటల రాజేందర్ సమక్షంలో చేరిక

జవహర్ నగర్ , నవంబర్ 06 :(వార్త ప్రతినిధి)

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జవహర్ నగర్ 3వ డివిజన్ అంబేద్కర్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జవహర్ నగర్ కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి, యువ నాయకుడు కప్పల శ్రావణ్ కుమార్ తన అనుచరగణంతో కలిసి భారతీయ జనతా పార్టీలో చేరారు.

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ నివాసంలో లేదా కార్యాలయంలో జరిగిన ఈ చేరిక కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్ స్వయంగా కప్పల శ్రావణ్ కుమార్‌కు బీజేపీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున అనుచరులు కూడా బీజేపీలో చేరడం విశేషం.

ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ, కప్పల శ్రావణ్ కుమార్ వంటి క్రియాశీలక, నిత్యం ప్రజల్లో ఉండే నాయకులు బీజేపీలోకి రావడం పార్టీకి ఎంతో బలాన్ని చేకూరుస్తుందని అన్నారు. ఆయన రాకతో జవహర్ నగర్ 3వ డివిజన్ తో పాటు మొత్తం జవహర్ నగర్ ప్రాంతంలో బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొందని పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో ప్రజల పక్షాన నిలబడి, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు ఏ చిన్న కష్టం వచ్చినా బీజేపీ అండగా ఉంటుందని, కార్యకర్తలకు, నాయకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు.





ముఖ్యంగా జవహర్ నగర్ ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న చెత్త డంపింగ్ యార్డ్ సమస్యను ప్రస్తావించిన ఈటల, డంపింగ్ యార్డ్ వల్ల స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య, పర్యావరణ సమస్యలపై బీజేపీ చేస్తున్న పోరాటం నిరంతరం కొనసాగుతుందని, ఈ పోరాటంలో ప్రజలందరూ పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్థానిక సమస్యల పరిష్కారం కోసం, ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తామని, పార్టీలోకి కొత్తగా వచ్చిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, గుర్తింపు, బాధ్యతలు ఉంటాయని హామీ ఇచ్చారు.

భారీగా హాజరైన బీజేపీ శ్రేణులు:

జవహర్ నగర్ డివిజన్ అధ్యక్షుడు కలికోట కమలాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బుద్ధి శ్రీనివాస్, మేడ్చల్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి, నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి, జిల్లా బీజేపీ కార్యదర్శి గాలి సంపత్ యాదవ్, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి ముత్యం సుజాత, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు మహేందర్ యాదవ్, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రామ్ నాయక్, జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షురాలు రషీదా బేగం, మాజీ కార్పొరేటర్ పానుగంటి బాబు తదితరులు పాల్గొన్నారు.

వీరితో పాటు సీనియర్ నాయకులు అశోక్ గౌడ్, సంతోష్ గుప్తా, నరేష్ యాదవ్, చంద్రపురి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు జోగారావు, జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులు మహేశ్వరి గౌడ్, గిరికత్తుల వెంకన్న, కీసర డివిజన్ బీజేపీ అధ్యక్షుడు బాలరాజ్ యాదవ్, స్థానిక డివిజన్ ప్రధాన కార్యదర్శులు పుల్లూరి అనిల్, బొమ్మ యాదగిరి, వేపుల సన్నీ, నాయకులు కొరిపెల్లి దయాకర్, శాగ అనిల్, రాకేష్, సాయి కుమార్, శ్రీను ముదిరాజ్, మహిళా నాయకులు కూరగాయల స్వర్ణ, శ్యామల, భవాని తదితర పెద్ద సంఖ్యలో బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొని కప్పల శ్రావణ్ కుమార్‌కు స్వాగతం పలికారు.

అక్రమ మద్యం విక్రయాలపై విచారణ జరపాలి

- దుగ్గొండి బ్రాందీ షాపును సీజ్ చేయాలి

- సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు మోడం మల్లేశం

నర్సంపేట, నవంబర్ 6 (బి.మల్లేష్ ,మీ వార్త ప్రతినిధి):

నర్సంపేట నాయోజకవర్గం దుగ్గొండి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రాందీ షాపులో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు మోడం మల్లేశం డిమాండ్ చేశారు. అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న షాపును సీజ్ చేయాలని, షాపు యాజమాన్యానికి సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ సీఐతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని కోరారు. ఈ మేరకు సీపీఐ ఎంఎల్ పార్టీ ఆధ్వర్యంలో నర్సంపేట ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించారు.

ఈసందర్భంగా సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు మోడం మల్లేశం మాట్లాడుతూ దుగ్గొండి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రాందీ షాపును జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లు తనిఖీ చేసిన సమయంలో అక్రమ మద్యం బయటపడినట్లు ఆరోపించారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని బ్రాందీ షాపుల నుంచి తక్కువ ధరలకు మద్యం కొనుగోలు చేసి, ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.తనిఖీల్లో అక్రమ మద్యం గుర్తించినప్పటికీ, షాపు యాజమాన్యం సంబంధిత అధికారులతో మంతనాలు జరిపి, డబ్బులు చేతికందించడంతో ఎలాంటి కేసులు నమోదు చేయకుండా, చర్యలు తీసుకోకుండా అధికారులు వెనుదిరిగినట్లు ఆరోపించారు.అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడుతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు, వారికి సహకరించినట్లు ఆరోపణలు రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని నాయకులు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న అక్రమ మద్యం వ్యాపారాన్ని అరికట్టాలని, సంబంధిత బ్రాందీ షాపును వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.గిర్నిబావి, నర్సంపేట డివిజన్ పరిధిలోని ఇతర మండలాల్లో కూడా బ్రాందీ షాపుల్లో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయన్నారు.ఈమేరకు ఎక్సైజ్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలని కోరారు.అక్రమ మద్యం వ్యాపారులకు సహకరించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ, ఇద్దరు కానిస్టేబుళ్లపై ఉన్నతాధికారులు విచారణ జరిపి, బాధ్యులుగా తేలితే సస్పెండ్ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.



ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు మోడం మల్లేశం, భూమా అశోక్, అనిల్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కోనూరులో జన సురక్ష కార్యక్రమం

కాసిపేట, నవంబర్ 6:(మన మీ వార్త మండల ప్రతినిధి)

కాసిపేట మండలం కోనూరు గ్రామంలో శుక్రవారం జన సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండాపూర్ తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ జగదీష్ ఆధ్వర్యంలో ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, బీమా పథకాలపై అవగాహన కల్పించారు.సేవింగ్స్ ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బంగారు రుణాలు, బీమా సదుపాయాలు, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన పథకాల గురించి వివరించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వీడ్స్ కౌన్సిలర్లు రాహుల్, రాజ్‌కుమార్, తిరుపతి, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ సతీష్, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.



ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా
- కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోంది
-పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నాం

నవంబర్ 7,11,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త

పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం యందు సిఎంఆర్ఎఫ్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి శుక్రవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల టౌన్, పరకాల, నడి కూడా, ఆత్మకూరు , దామెర, సంగెం, గీసుకొండ మండలాలు,15,16,17వ డివిజన్ లకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ మరియు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....53 మంది లబ్ధిదారులకు 53లక్షల6148 వేల రూ విలువగల కళ్యాణ లక్ష్మి మరియు 221 మంది లబ్ధిదారులకు 77లక్షల 35 వేల రూ విలువగల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసామన్నారు.అలాగే నియోజకవర్గ వ్యాప్తంగా 6841 మందికి 47కోట్ల 94 లక్షల 56వేల 510 రూ విలువగల చెక్కులను పంపిణీ చేశామన్నారు. పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిలుస్తుందని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు దనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని తెలిపారు. పేద ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పరకాల ఇందిరా మహిళా డైరీ,



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్,నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ చీరల పంపిణీ,200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు బీమా, సన్న వడ్లకు రూ 500 బోనస్,సన్న బియ్యం పంపిణీ,మహాలక్ష్మి ,గ్యాస్ సబ్సిడీ, వడ్డీ లేని రుణాలు, శ్రీనిధి రుణాలు, ఇందిరమ్మ ఇల్లు,తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు కొత్త కళ

హైదరాబాద్ : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.714.73 కోట్లతో పనులు చేపట్టగా.. ఇప్పటివరకు 71 శాతం పూర్తయ్యాయి. ఉత్తర, దక్షిణ వైపుల ఐకానిక్ భవనాలు, రెండు అంతస్తుల ఎయిర్ కాన్‌కోర్స్, ప్లాట్‌ఫారాలపై రూఫింగ్, ట్రావలేటర్లతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, మల్టీలెవల్ కార్ పార్కింగ్, మెట్రో స్కైవాక్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. కొన్ని కీలక నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలిన పనులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తయ్యే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే రైల్వే జంక్షన్లలో ఒకటైన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన సమగ్ర పునరాభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం రూ.714.73 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటివరకు 71 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది చివరి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ.. కొన్ని నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటం వల్ల వచ్చే ఏడాది మార్చి నాటికి మొత్తం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే సికింద్రాబాద్ స్టేషన్ ఆధునిక రవాణా కేంద్రంగా కొత్త రూపును సంతరించుకోనుంది.సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రతిరోజూ సుమారు 180 రైళ్ల రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం లక్షన్నర మందికిపైగా ప్రయాణికులు ఈ స్టేషన్‌ను వినియోగిస్తున్నారు. నగర జనాభా, రైళ్ల సంఖ్య, ప్రయాణికుల రద్దీ భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని భారీ స్థాయిలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా స్టేషన్‌కు ఉత్తరం, దక్షిణం వైపున ఆకర్షణీయమైన ఐకానిక్ భవనాలను నిర్మిస్తున్నారు. రెండు అంతస్తుల భారీ ఎయిర్ కాన్‌కోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులు ప్లాట్‌ఫారాలపై వర్షం, ఎండ ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేందుకు పూర్తిస్థాయి రూఫింగ్ నిర్మిస్తున్నారు. ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేసేందుకు ఒకటి,



పది నంబర్ ప్లాట్‌ఫారాల వద్ద ట్రావలేటర్లతో కూడిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు. వీటితో పాటు ఉత్తరం వైపు మల్టీలెవల్ కార్ పార్కింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. మెట్రో రైల్వే స్టేషన్‌కు నేరుగా అనుసంధానం కల్పించేలా స్కైవాక్ నిర్మాణం చేపడుతున్నారు. దీనివల్ల రైలు దిగిన ప్రయాణికులు బయటకు వచ్చి రహదారులు దాటాల్సిన అవసరం లేకుండా మెట్రోకు చేరుకునే అవకాశం ఉంటుంది. ప్లాట్‌ఫారాలపై ఆధునిక ఫ్లోరింగ్, మెరుగైన ప్రయాణికుల సౌకర్యాలు కూడా ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి. ఇప్పటివరకు 71 శాతం పనులు పూర్తికాగా.. మిగిలిన 29 శాతం పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఉత్తర, దక్షిణ ప్రధాన స్టేషన్ భవనాలు, ఉత్తరం వైపు మల్టీలెవల్ కార్ పార్కింగ్, బేస్‌మెంట్, ఎయిర్ కాన్‌కోర్స్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. హైదరాబాద్ ఎండ్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ప్లాట్‌ఫారాలపై రూఫింగ్, ఒకటి, పది నంబర్ ప్లాట్‌ఫారాల వద్ద ట్రావలేటర్లతో కూడిన వంతెనలు, మెట్రో స్కైవాక్ అనుసంధాన పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. వీటితోపాటు ప్లాట్‌ఫారాలపై ఆధునిక ఫ్లోరింగ్ పనులను పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టారు.ప్రాజెక్టులో భాగంగా కొన్ని కీలక పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కోసం నూతన భవనాన్ని నిర్మించారు. కాజీపేట వైపు కొత్త ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చింది. దక్షిణం వైపు స్టేషన్ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లోని రాకపోకల విభాగాలు, ప్రయాణికుల రాక, బయలుదేరే ప్రాంతాల నిర్మాణం పూర్తయింది. దక్షిణం వైపు బేస్‌మెంట్, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ పనులు కూడా ముగిశాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే రైలు, మెట్రో, రోడ్డు రవాణా మధ్య అనుసంధానం మరింత మెరుగుపడటంతోపాటు ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతి లభించనుంది.

కనిపించని అధికార పార్టీ ప్రభావం

వరంగల్ : వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతున్నాయి. వరంగల్- ఖమ్మం- నల్గొండ, మహబూబ్‌నగర్- రంగారెడ్డి-హైదరాబాద్ నియోజకవర్గాల ను కైవసం చేసుకోవడం ద్వారా తమ రాజకీయ ఆధిపత్యాన్ని చాటాలని అధికార కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇప్పటికే మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, వరంగల్- ఖమ్మం- నల్గొండ స్థానానికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించి ముందడుగు వేసింది. అయితే ఓటరు నమోదు ప్రక్రియలో మాత్రం కాంగ్రెస్ పార్టీ బాగా వెనుకబడినట్లు వార్తలు అందుతున్నాయి. ఎన్నికల పోరులో గెలుపోటములను ప్రభావితం చేసే అత్యంత కీలకమైన ఓటరు నమోదు ప్రక్రియ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 6 చివరి తేదీగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ గడువు ముగిసినప్పటికీ, నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అఖా స్పష్టం చేశారు. గతంలో ఓటర్లుగా ఉన్నవారు సైతం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్న నిబంధన ఉండటంతో, పెద్ద ఎత్తున అర్హులను నమోదు చేయించడం పార్టీల ముందున్న అతిపెద్ద సవాలు.ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత సీరియస్‌గా తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఓటరు నమోదుపై ప్రారంభం నుంచే పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తూ వస్తున్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, యువతను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి బలమైన ఓటు బ్యాంకును సృష్టించుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినా, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కేడర్ ఆశించిన స్థాయిలో వేగం పుంజుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.



పార్టీ నాయకత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఓటర్లను నమోదు చేయించడంలో కొంత నిర్లిప్తత ప్రదర్శించినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇతర పార్టీలతో పోలిస్తే, అధికారంలో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించినంతగా గ్రౌండ్ వర్క్ జరగలేదన్న గుసగుసలు పార్టీ వర్గాల్లోనే చర్చనీయాంశమయ్యాయి.ఓటరు నమోదులో కేడర్ వెనుకబడిందన్న వార్తలు, నివేదికలు అధిష్టానాన్ని అప్రమత్తం చేశాయి. దీంతో చివరి గడువు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకత్వం మరింత దూకుడు పెంచింది. పార్టీ శ్రేణులకు మరోసారి గట్టి హెచ్చరికలు జారీ చేస్తూ, మిగిలిన సమయంలోనైనా వేగంగా దరఖాస్తులు పూర్తి చేయించాలని ఆదేశించింది. కాలేజీలు, యూనివర్సిటీలు, ఉద్యోగ సంఘాలు, పట్టభద్రులూ అధికంగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించింది.నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానుండగా, ఆ తర్వాత డిసెంబర్ 10 వరకు అభ్యంతరాల స్వీకరణ, డిసెంబర్ 30న తుది జాబితా ప్రచురణ ఉంటుంది. తుది జాబితా వచ్చే వరకు కూడా దరఖాస్తులకు అవకాశం ఉన్నప్పటికీ.. ప్రారంభ దశలో జరిగిన జాప్యాన్ని పూడ్చడంపైనే ఇప్పుడు పార్టీ దృష్టి కేంద్రీకృతమైంది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే పార్టీ బలం ఒక్కటే సరిపోదు. వ్యక్తిగత ప్రభావం, మేధావుల నాడిని పట్టడం చాలా ముఖ్యం. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే ప్రభుత్వ విధానాలకు ప్రజామద్దతు ఉందని భావించడానికి ఒక బలమైన సంకేతం దొరుకుతుంది. అయితే, ఓటరు నమోదు ప్రక్రియలో ప్రారంభంలో ఎదురైన ఆటంకాలు, కేడర్ నుంచి రావాల్సినంత స్పందన రాకపోవడం వంటి పరిణామాలు కాంగ్రెస్ అభ్యర్థుల విజయ అవకాశాలపై ఏ మేరకు ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.

హుండీ ఆదాయం రూ.8.15 లక్షలు



శివ్వంపేట మీ వార్త ప్రతినిధి నవంబర్ (6):

మండల పరిధిలోని చాకరిమెట్ల స్వయంభూ శ్రీ సహకార ఆంజనేయస్వామి దేవస్థానంలో ఏడు నెలల హుండీ ఆదాయాన్ని శుక్రవారం అధికారులు లెక్కించగా రూ.8,15,516 వచ్చినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు స్వామివారికి సమర్పించిన కానుకల ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు.ఆలయానికి భక్తుల రాక పెరుగుతుండటంతో హుండీ ఆదాయం కూడా గణనీయంగా లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలకులు,దేవస్థానం ఫౌండర్ ట్రస్టీ ఆంజనేయ శర్మ, కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్,సర్పంచ్ సింగాయిపల్లి నారాయణరావు, శ్రీ లలిత సేవా సంస్థ సేవకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో దీపావళి జరుపుకోండి

కాంగ్రెస్ నాయకులకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్.కుమార్ గౌడ్ సూచన

హైదరాబాద్ ఈ నెల 8వ తేదీన దీపావళి రోజున కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు అంత ఇందిరమ్మ ఇళ్లలో లబ్ధిదారులతో కలిసి దీపావళి పండుగ చేసుకోవాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్.కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇందిరమ్మ పేరుతో గతంలో ఎన్నడూ లేని విదంగా పేదలకు కొత్త ఇల్లు ఇవ్వడం జరిగింది ఇది వారికి ఎంతో ఆనందాన్ని ఇచ్చే సందర్భం .. ఈ ఆనందాన్ని వారితో పంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పేదల కల నెరిన సమయంలో వారితో దీపావళి జరుపుకోవాలని కోరుతున్నాము. గ్రామాల్లో రెండు దఫాలలో ఇల్లు ఇవ్వడం జరిగింది. హైదరాబాద్ లక్ష ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తయింది. కొన్ని ఇళ్లలో గృహ ప్రవేశాలు.కూడా జరిగాయి..ఇది నభూతో న భవిష్యత్ ఇలాంటి పండుగను మనం ఘనంగా ఇందిరమ్మ ఇళ్లలో జరుపుకోవాలని.విజ్ఞప్తి చేస్తున్నానని అయన అన్నారు.

వరంగల్‌లో భారీగా కల్తీ కారం, పసుపు పొడి పట్టివేత.. 2,250 కిలోలు స్వాధీనం

వరంగల్ : నగరంలో కల్తీ ఆహార పదార్థాల తయారీపై అధికారులు కొరడా ఝుళిపించారు. మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి భారీగా కల్తీ కారం, పసుపు పొడిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో కరీమాబాద్‌కు చెందిన ఆకుతోట గోపిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 2,250 కిలోల కల్తీ కారం, పసుపు పొడిని అధికారులు పట్టుకోగా, వీటి విలువ సుమారు రూ.5.92 లక్షలుగా అంచనా వేశారు. ఎలాంటి లైసెన్స్, లేబుల్స్ లేకుండా అపరిశుభ్ర వాతావరణంలో పొడులను ప్యాకింగ్ చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న కల్తీ వ్యాపారులపై అధికారులు చర్యలు చేపట్టారు.

ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అండగా కాంగ్రెస్

కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి

జనగామ : తెలంగాణ ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి అండగా కాంగ్రెస్ పార్టీ వుంటుందని కాంగ్రెస్ నేత కొమ్మూరి ప్రతాప్ రెడ్డి అన్నారు. ఉద్యమకారుడు, సొంత పార్టీ నాయకుడు ఆత్మహత్య చేసుకుని మరణిస్తే కనీసం పట్టించుకోని బీఆర్ఎస్, అలాంటిది ఉద్యమ పార్టీ అని చెప్పుకోవడం విడ్డూరమని అన్నారు.

బచ్చన్నపేట మండలం, కొన్నే గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ నాయకుడు వేముల లక్ష్మణ్ గౌడ్ . బీఆర్ఎస్ పార్టీ కోసం అప్పు చేసి రూ.20 లక్షలు ఖర్చు చేశారు. అప్పులు తీర్చలేక, పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యమకారులకు ఎలాంటి సహాయం అందకపోవడంతో అప్పుల బాధ భరించలేక ఆత్మహత్య చేసుకున్నారు. లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో పాటు, ఇల్లు కట్టుకోవడానికి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అయన అందజేసారు. ఎన్నికల్లో లక్ష్మణ్ గౌడ్‌ను వాడుకుని లబ్ధిపొంది, నేడు కనీసం ఆయన కుటుంబాన్ని కూడా స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి పరామర్శించలేదని అయన విమర్శించారు.

అమెరికాలో నల్గొండ యువతి అదృశ్యం

నల్గొండ : నల్గొండ జిల్లాకు చెందిన యువతి అమెరికా లో మిస్సింగ్ అయింది. కనగల్ మండలం శాబ్దులాపురం గ్రామం నుంచి యాదగిరిరెడ్డి?రూప దంపతుల కుమార్తె శ్రీజ (23) ఉన్నత చదువుల కోసం అమెరికాలోని బోస్టన్‌కు వెళ్లింది. ఓ కళాశాలలో చదువుతూ పార్ట్‌టైమ్ జాబ్ చేస్తోంది. ఈ నెల 2వ తేదీన వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదని, ఫోన్ లొకేషన్ సమీపంలోని బీచ్ వద్ద చూపిస్తోందని తోటి విద్యార్థినులు తల్లిదండ్రులకు సమా చారం అందించారు. మిస్సింగ్ కేసు నమోదయింది. పోలీసులు గాలింపులు చేసట్టారు. ఒక్కగానొక్క కుమార్తె అమెరికాలో అదృశ్యం కావడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు.

గెలిచిన కౌన్సిలర్ అభ్యర్థులు సంయమనంతో ఉండాలి

ఉయ్యూరు టౌన్ సీఐ ఎఎఎ రామారావు

ఉయ్యూరు టౌన్ ఎన్నికల ఫలితాల అనంతరం పట్టణ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ప్రత్యర్థుల ఇళ్ల ముందు బాణాసంచా కాల్చడం, వారిని గేలి చేయడం వంటి ఘటనలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి చర్యల విషయంలో చాలా కఠినంగా వ్యవహరిస్తామని టౌన్ సీఐ ఎఎఎ రామారావు హెచ్చరించారు "ప్రజలు మీపై నమ్మకం పెట్టుకుని గెలిపించారు. ఆ నమ్మకానికి తగిన హుందాతనంతో ప్రవర్తించాలని, ప్రత్యర్థుల ఇళ్ల ముందు బాణాసంచా కాల్చడం, గేలి చేయడం, రెచ్చగొట్టే నినాదాలు చేయడం వంటి చిల్లర పనులు మానుకోవాలని హితవు పలికారు. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఇతరులను రెచ్చగొట్టి పట్టణ ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఉపేక్షించేది లేదు. బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించారు

మళ్లీ బండి సంజయ్ కు పగ్గాలు !

కరీంనగర్ : రాజకీయాల్లో మరోసారి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి చుట్టూ ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని నెలల కిందట పార్టీ పగ్గాలు చేపట్టిన ఎన్. రామచంద్రరావును మహబూబ్‌నగర్- రంగారెడ్డి- హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అధిష్టానం దాదాపు ఖరారు చేసింది. దీంతో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు తిరిగి ఎంపీ బండి సంజయ్ చేతికి వెళ్లనున్నాయనే ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండేవారు. అప్పట్లో బీజేపీ దూకుడు ఊహించని స్థాయిలో ఉండేది. ఆయన చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది.

ప్రపంచ ఏఐ అప్లికేషన్ క్యాపిటల్‌గా భారత్

న్యూఢిల్లీ: ప్రపంచ సాంకేతిక రంగంలో వేగంగా చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా భారత్‌ను గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ తయారీ రంగాల్లో దేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో పలు కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ప్రపంచ ఏఐ అప్లికేషన్ క్యాపిటల్‌గా భారత్‌ను మార్చడమే తమ లక్ష్యమని కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. శుక్రవారం ఢిల్లీలో సెమికాన్ 2.0 వెబ్ అప్లికేషన్ పోర్టల్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

వ్యవసాయం నుంచి వైద్యం వరకు ఏఐ వినియోగం

ఏఐ సాంకేతికతను కేవలం పరిశోధనలకే పరిమితం చేయకుండా ప్రజల రోజువారీ జీవితానికి ఉపయోగపడేలా విస్తరించాల్సిన అవసరం ఉందని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. వ్యవసాయం, వైద్యం, విద్య వంటి కీలక రంగాల్లో ఆచరణాత్మక ఏఐ నమూనాల అభివృద్ధికి భారత్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పంటల నిర్వహణ, దిగుబడుల అంచనా, వైద్య సేవల మెరుగుదల, బోధనా విధానాల్లో మార్పులు తీసుకురావడానికి ఏఐ ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. ఇప్పటికే భారతీయ పరిశ్రమలు ఈ దిశగా గణనీయమైన పురోగతి సాధిస్తున్నాయని చెప్పారు. విదేశీ సంస్థలతో పోటీపడే స్థాయిలో దేశీయ ఏఐ అప్లికేషన్లను అభివృద్ధి చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

సెమికాన్ 2.0 పోర్టల్ ప్రారంభం

దేశీయ సెమీకండక్టర్ పరిశ్రమను మరింత బలోపేతం చేయడంలో భాగంగా సెమికాన్ 2.0 పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మంత్రి వెల్లడించారు. ఈ పోర్టల్ ద్వారా పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను మాత్రమే స్వీకరిస్తామని తెలిపారు. వాస్తవంగా పెట్టుబడులు పెట్టి, ప్రాజెక్టులను అమలు చేయాలనే నిబద్ధత కలిగిన సంస్థలకే ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. అసంపూర్తి వివరాలతో దరఖాస్తులు సమర్పించే సంస్థలకు అవకాశం ఉండదని పేర్కొన్నారు. సెమీకండక్టర్ రంగంలో కేవలం ఆసక్తి చూపించే సంస్థల కంటే క్షేత్రస్థాయిలో ప్రాజెక్టులను అమలు చేసే సామర్థ్యం ఉన్న సంస్థలను ప్రోత్సహిస్తామని తెలిపారు.



ఈ క్రమంలో అర్హత లేని 18-19 కంపెనీలను తొలగించాలని ఐటీ శాఖ కార్యదర్శిని ఆదేశించినట్లు వెల్లడించారు.

దేశీయ జీపీయూ చిప్ అభివృద్ధికి ప్రణాళిక

కృత్రిమ మేధస్సు వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ల (జీపీయూ) అవసరం కూడా గణనీయంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో దేశీయంగా జీపీయూ చిప్‌ను అభివృద్ధి చేసేందుకు రూపొందిస్తున్న రోడ్‌మ్యాప్ తుది దశకు చేరుకుంటోందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. చిప్ రూపకల్పన, తయారీ సామర్థ్యాలను దేశంలోనే అభివృద్ధి చేసుకోవడం ద్వారా విదేశీ సాంకేతికతపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని కేంద్రం భావిస్తోంది. సెమీకండక్టర్ రంగంలో స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ఇది కీలక ముందడుగుగా నిలవనుంది.

రూ.7,500 కోట్లతో మరో 12 ప్రాజెక్టులు

ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్స్ మాన్యుఫ్యాక్చరింగ్ స్కీమ్ (ఈసీఎంఎస్) కింద మరో 12 దరఖాస్తులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు ఐటీ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్ వెల్లడించారు. ఈ ప్రాజెక్టుల మొత్తం విలువ రూ.7,500 కోట్లకు పైగా ఉంటుందని తెలిపారు. ఎలక్ట్రానిక్స్ విడిభాగాల తయారీతో పాటు ముడి పదార్థాలు, ఉత్పత్తికి అవసరమైన యంత్రాలు, పరికరాల తయారీకి సంబంధించిన యూనిట్లు ఇందులో ఉన్నాయని వివరించారు. దేశీయంగా ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యవస్థను విస్తరించడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

ఎంఎస్ఎంఈలకు పెద్దపీట

ఈసీఎంఎస్ కింద ఆమోదం పొందిన యూనిట్లలో 50 శాతం చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎస్ఎంఈ), సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈ) చెందినవేనని అశ్విని వైష్ణవ్ తెలిపారు. దేశీయ తయారీ రంగంలో చిన్న పరిశ్రమల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఒకప్పుడు భారత్‌లో మొబైల్ ఫోన్ల తయారీ అంటే కేవలం విడిభాగాలను అసెంబ్లింగ్ చేయడానికే పరిమితమవుతుందని విమర్శలు వచ్చేవని గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం మొబైల్ తయారీ రంగం మాడ్యూల్స్, విడిభాగాలు, ముడి పదార్థాల ఉత్పత్తి వరకు విస్తరించిందని వివరించారు. ఇదే తరహాలో సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లోనూ సమగ్ర తయారీ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యమని చెప్పారు.

సోషల్ మీడియా సంస్థలకు కీలక సూచనలు

మరోవైపు సోషల్ మీడియా సంస్థలు తమ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వహించాలని కేంద్ర మంత్రి సూచించారు. ముఖ్యంగా పిల్లలు, మహిళల ఆన్‌లైన్ భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. డిజిటల్ అరెస్ట్ మోసాలు, ఇతర సైబర్ నేరాలను అరికట్టేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. వినియోగదారుల ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించే సమర్థవంతమైన వ్యవస్థలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్ మోసాల బారినపడిన బాధితులు న్యాయం కోసం పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి మారాలని అభిప్రాయపడ్డారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేసి పరిష్కారం పొందగలిగే సులభమైన ఫిర్యాదుల వ్యవస్థను సోషల్ మీడియా సంస్థలు అందుబాటులోకి తీసుకురావాలని అశ్విని వైష్ణవ్ సూచించారు.

సాంకేతిక స్వావలంబనే లక్ష్యం

ఏఐ అప్లికేషన్ల అభివృద్ధి నుంచి సెమీకండక్టర్ చిప్‌ల తయారీ వరకు దేశీయ సామర్థ్యాలను పెంపొందించడమే కేంద్ర ప్రభుత్వ వ్యూహంగా కనిపిస్తోంది. చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు అవకాశాలు కల్పించడం, పెట్టుబడులను ఆకర్షించడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా భారత్‌ను ప్రపంచ సాంకేతిక ఉత్పత్తి కేంద్రంగా మార్చేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి.

ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన వారికి మరో అవకాశం

న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి పేర్లు గల్లంతైన వారికి కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఎన్యూమరేషన్ ఫారాలు అందకపోవడం, అందిన ఫారాలను తిరిగి సమర్పించకపోవడం వంటి కారణాలతో ముసాయిదా జాబితాలో చోటు కోల్పోయిన అర్హులైన ఓటర్లు తుది జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల్లో ఈ అవకాశం వర్తించనుంది. శుక్రవారం ఈ మేరకు ఆయా రాష్ట్రాల ఎన్నికల అధికారులకు ఈసీ కీలక ఆదేశాలు జారీ చేసింది.

ఏడు రాష్ట్రాల ఓటర్లకు అవకాశం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఢిల్లీ, మహారాష్ట్ర, హరియాణా, ఝార్ఖండ్, నాగాలాండ్ రాష్ట్రాల్లోని ఓటర్లకు ఈ నిర్ణయం వర్తిస్తుంది. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా గైర్హాజరు, నివాసం మారినవారు, మరణించినవారు, డూప్లికేట్ ఓటర్లు వంటి కేటగిరీల్లో గుర్తించిన వారితో పాటు ఎన్యూమరేషన్ ఫారాలు జారీ చేసినప్పటికీ వాటిని తిరిగి సమర్పించని కారణంగా ముసాయిదా జాబితాలో పేర్లు కోల్పోయిన వారికి మరో అవకాశం ఇవ్వాలని ఈసీ నిర్ణయించింది. అర్హులైన ఒక్క ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకూడదన్న ఉద్దేశంతో ఈ చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది.

ఇంటింటికీ వెళ్లి సంప్రదించాలి

ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారిని గుర్తించేందుకు బూత్ వారీగా ప్రత్యేక జాబితాలను సిద్ధం చేయాలని ఈసీ ఆదేశించింది. ఆయా ఓటర్ల పేర్లు ఎందుకు తొలగించబడ్డాయో ప్రాథమిక కారణాలతో సహా ఈ జాబితాలను సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించాలి. రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ల అధికారిక వెబ్‌సైట్లలోనూ అందుబాటులో ఉంచాలి. పేర్లు గల్లంతైన ఓటర్లకు కొత్తగా ఎన్యూమరేషన్ ఫారాలు అందించాలని సూచించింది. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఇంటింటికీ వెళ్లి వారిని సంప్రదించాలని పేర్కొంది. అవసరాన్ని బట్టి వాట్సాప్, ఈ-మెయిల్, ఎస్ఎంఎస్ వంటి మార్గాల్లోనూ సమాచారం అందించాలని ఆదేశించింది.



పాత చిరునామాలోనే ఉంటే ఇలా..

గతంలో ఉన్న నివాసంలోనే కొనసాగుతూ, కేవలం ఎన్యూమరేషన్ ఫారం అందకపోవడం వల్ల ఓటర్ల జాబితాలో పేరు కోల్పోయిన వారు తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం కొత్త ఎన్యూమరేషన్ ఫారంతో పాటు గతంలో ఫారాన్ని ఎందుకు సమర్పించలేకపోయారో వివరిస్తూ ఒక ప్రకటన (స్టేట్‌మెంట్) అందజేయాల్సి ఉంటుంది. సంబంధిత వివరాలను అధికారులు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటారు.

చిరునామా మారినవారికి ప్రత్యేక వెసులుబాటు

అదే రాష్ట్రంలో మరో ప్రాంతానికి నివాసం మార్చుకున్న ఓటర్లు చిరునామా మార్పు కోసం ప్రత్యేకంగా ఫారం-8 సమర్పించాల్సిన అవసరం లేదని ఈసీ స్పష్టం చేసింది. కొత్త ఎన్యూమరేషన్ ఫారంతో పాటు ప్రస్తుత చిరునామా, అసెంబ్లీ నియోజకవర్గం వివరాలు, చిరునామా ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. ఈ వివరాల ఆధారంగా ఓటరు నమోదు ప్రక్రియను అధికారులు పరిశీలిస్తారు.

నిరాశ్రయులకూ ఓటు హక్కు

చిరునామా ధ్రువీకరణ పత్రాలు లేని నిరాశ్రయుల విషయంలోనూ ఈసీ ప్రత్యేక వెసులుబాటు కల్పించింది. అలాంటి వారి వద్ద నివాసానికి సంబంధించిన పత్రాలు లేకపోతే బూత్ స్థాయి అధికారి క్షేత్రస్థాయిలో నిర్వహించే పరిశీలన ఆధారంగా రూపొందించిన నివేదికను నివాస ధ్రువీకరణగా పరిగణించనున్నారు. తద్వారా చిరునామా పత్రాలు లేని కారణంతో అర్హులైన నిరాశ్రయులు ఓటు హక్కుకు దూరం కాకుండా చర్యలు తీసుకోనున్నారు. అయితే సమర్పించిన దరఖాస్తులు, వివరాలను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తుది జాబితాలో పేర్ల నమోదుపై నిర్ణయం తీసుకుంటారు.

డూప్లికేట్ ఓట్లకు తావులేకుండా చర్యలు

అర్హులైన ఓటర్లందరికీ తుది జాబితాలో చోటు కల్పించడంతో పాటు ఒకే వ్యక్తి పేరు రెండుసార్లు నమోదుకాకుండా పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఈసీ రాష్ట్ర ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరించాలని, దరఖాస్తుల పరిశీలనలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించింది. అర్హులైన వారికి అవకాశం కల్పిస్తూనే నకిలీ, డూప్లికేట్ నమోదులను నిరోధించడంపై దృష్టి సారించింది.

ఈసీ నిర్ణయంపై కాంగ్రెస్ విమర్శలు

మరోవైపు ఎన్నికల సంఘం తాజా నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఈ నిర్ణయాన్ని యూటర్న్‌గా అభివర్ణించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఓటు చోరీకి కొత్త రూపంగా ఉపయోగించారని, ఇప్పుడు విమర్శలు వెల్లువెత్తడంతో తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఈ విషయంలో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఎస్ఐఆర్‌పై కొనసాగుతున్న రాజకీయ వివాదం

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై గత కొంతకాలంగా ప్రతిపక్షాలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, అర్హులైన కోట్లాది మంది ఓటర్ల పేర్లు తొలగించే ప్రమాదం ఉందని ఆరోపిస్తూ ఎస్ఐఆర్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం తోసిపుచ్చింది. ఓటర్ల జాబితాల ప్రక్షాళన చట్టబద్ధంగానే జరుగుతోందని, సుప్రీంకోర్టు పర్యవేక్షణలోనూ ఈ ప్రక్రియ కొనసాగుతోందని తన చర్యలను సమర్థించుకుంది. ఈ నేపథ్యంలో తాజాగా పేర్లు కోల్పోయిన వారికి మరో అవకాశం కల్పిస్తూ ఈసీ తీసుకున్న నిర్ణయం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

శాటిలైట్ కమ్యూనికేషన్ రంగంలో అందరికీ ఆహ్వానం

న్యూఢిల్లీ: శాటిలైట్ కమ్యూనికేషన్ రంగంలోకి ప్రవేశించేందుకు అన్ని సంస్థలకూ భారత్ స్వాగతం పలుకుతోందని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ రంగంలో ఏ ఒక్క సంస్థకూ గుత్తాధిపత్యం ఉండబోదని, వినియోగదారులే తమకు నచ్చిన సేవలందించే సంస్థను ఎంపిక చేసుకుంటారని తెలిపింది. సంస్థలు అందించే ధరలు, సేవల నాణ్యత, వినియోగదారులకు కల్పించే విలువ ఆధారంగా మార్కెట్‌లో పోటీ ఉంటుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం భారత్‌లో రిలయన్స్ జియో, వన్‌వెబ్, ఎలాన్ మస్క్‌కు చెందిన స్టార్‌లింక్ సంస్థలకు శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలకు సంబంధించిన లైసెన్సులు ఉన్నాయి. వీటిలో స్టార్‌లింక్ అన్నింటికంటే చివరగా దరఖాస్తు చేసుకుని, చివరగా లైసెన్స్ పొందినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. నిబంధనల అమలుకు సంబంధించిన పత్రాలను వన్‌వెబ్ ముందుగా సమర్పించగా, ఆ తర్వాత జియో, చివరగా స్టార్‌లింక్ సమర్పించినట్లు తెలిపాయి. మొత్తం ప్రక్రియ పారదర్శకంగా సాగిందని స్పష్టం చేశాయి. భారత్‌లో స్టార్‌లింక్ వాణిజ్య కార్యకలాపాలను అడ్డుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఎలాన్ మస్క్ ఇటీవల చేసిన ఆరోపణల నేపథ్యంలో కేంద్రం వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది. కొందరు శక్తిమంతమైన వ్యాపారవేత్తలు తమ మార్కెట్ స్థానాన్ని కాపాడుకునేందుకు స్టార్‌లింక్ ప్రవేశాన్ని అడ్డుకోవాలని చూస్తున్నారని మస్క్ ఆరోపించారు. మార్కెట్‌లో పోటీ పెరిగితే వినియోగదారులకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. భారత్‌లో ఇప్పటికే కొన్ని సంస్థలు తక్కువ ధరలకు ఇంటర్నెట్ సేవలు అందిస్తున్నాయని, వాటితో పోటీపడాలంటే స్టార్‌లింక్ కూడా వినియోగదారులకు అందుబాటులో ఉండే ధరలను నిర్ణయించాల్సి ఉంటుందని మస్క్ వ్యాఖ్యానించారు. పోటీ కారణంగా సంస్థల లాభాలపై ప్రభావం ఉండవచ్చేమో కానీ, వినియోగదారులకు మాత్రం మెరుగైన సేవలు అందే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. భారత్‌లో శాటిలైట్ ఇంటర్నెట్ సేవలు పూర్తిస్థాయిలో ప్రారంభం కావడానికి ఇంకా రెండు కీలక దశలు మిగిలి ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మొదటిది స్పెక్ట్రమ్ కేటాయింపు, దానికి సంబంధించిన ధరల విధానాన్ని ఖరారు చేయడం. రెండోది లైసెన్స్ పొందిన మూడు సంస్థలు జాతీయ భద్రతకు సంబంధించిన అన్ని నిబంధనలను పూర్తి చేయడం.

వాణిజ్య సేవలు ప్రారంభించే ముందు ఆయా సంస్థలు తమ సాంకేతిక సామర్థ్యాన్ని నిరూపించుకోవడంతో పాటు భద్రతా ప్రమాణాలను పాటించాల్సి ఉంటుందని అధికారులు స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే తుది అనుమతులు లభిస్తాయని పేర్కొన్నారు.

గుత్తాధిపత్యానికి తావులేదు: సింధియా

భారత్‌లో శాటిలైట్ కమ్యూనికేషన్ రంగంలో గుత్తాధిపత్యానికి ఎలాంటి అవకాశం ఉండదని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా గతంలోనే స్పష్టం చేశారు. స్టార్‌లింక్‌తో పాటు లైసెన్సులు పొందిన అన్ని సంస్థలూ దేశ భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సిందేనని తెలిపారు. సంస్థలకు అనుమతులు ఇచ్చే ముందు భద్రతాపరమైన అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తామని పేర్కొన్నారు. శాటిలైట్ కమ్యూనికేషన్ సేవల ధరల విధానాన్ని ఖరారు చేసే ప్రక్రియ తుది దశకు చేరుకుంటోందని కేంద్రం తెలిపింది. నిబంధనలు అన్ని సంస్థలకూ సమానంగా వర్తిస్తాయని పునరుద్ఘాటించింది.

ఓటు హక్కుతో పాటు సంక్షేమ పథకాలకూ ముప్పు

న్యూఢిల్లీ: ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను ఆధార్ కార్డుకు బదులుగా ఓటర్ ఐడీ కార్డుతో అనుసంధానించాలన్న ప్రతిపాదనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది కేవలం ఓట్ల చోరీ మాత్రమే కాదని, పౌరుల ప్రాథమిక హక్కులను హరించే ప్రయత్నమని ఆరోపించారు. ఓటర్ల జాబితాను తమకు అనుకూలంగా మార్చుకుని, అదే జాబితా ఆధారంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించాలా వద్దా అని నిర్ణయించే పరిస్థితి తీసుకురావాలని చూస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.

ఓటర్ ఐడీతో పథకాల అమలుపై అభ్యంతరం

ఆధార్ కార్డులకు బదులుగా బయోమెట్రిక్ వివరాలు, ఓటర్ ఐడీ ఆధారంగా సంక్షేమ పథకాలను అమలు చేయాలంటూ కేంద్ర మంత్రి లలన్ సింగ్ మాట్లాడిన వీడియోను రాహుల్ గాంధీ తన పోస్టుకు జత చేశారు. గల్లీకో సంస్థ ఐదు నిమిషాల్లోనే ఆధార్ కార్డులు తయారు చేసి ఇస్తోందని, అందుకే ప్రత్యామ్నాయ గుర్తింపు విధానాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందని మంత్రి వ్యాఖ్యానించినట్లు ఆ వీడియోలో ఉంది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే ఓటర్ల జాబితాలో పేరు లేని పేదలు సంక్షేమ పథకాల ప్రయోజనాలను కోల్పోయే ప్రమాదం ఉందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఓటు అనేది పౌరుడి హక్కు మాత్రమేనని, పేదవాడి పెన్షన్‌ను ఓటర్ కార్డుకు బానిసగా మార్చలేరని స్పష్టం చేశారు. ఈ హక్కుల చోరీని ఎట్టి పరిస్థితుల్లోనూ జరగనివ్వబోమని పేర్కొన్నారు.

ఎస్ఐఆర్‌పై మరోసారి విమర్శలు

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో లక్షలాది మంది పేర్లను తొలగిస్తున్నారని రాహుల్ ఆరోపించారు. బీజేపీని ఓడించాలని భావించే ఓటర్లను లక్ష్యంగా చేసుకుని పేర్లు తొలగించే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించారు. ఓటరు పేరు తొలగితే ఓటు హక్కు పోతుందని, తద్వారా ఇతర పౌర హక్కులపైనా ప్రభావం పడుతుందని అన్నారు. భవిష్యత్తులో రేషన్, పెన్షన్లు, ఉపాధి హామీ, ఇళ్లు, స్కాలర్‌షిప్‌లు, రిజర్వేషన్ల వంటి ప్రయోజనాలకూ ఓటర్ ఐడీని ప్రామాణికంగా చేస్తారా? అని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలు నిష్పక్షపాతంగా ఉండాల్సిన అవసరం ఉందని, ఎన్నికల సంఘం స్వతంత్రంగా వ్యవహరించాలని కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై కూడా రాహుల్ విమర్శలు చేశారు. ఓట్ల చోరీలో బీజేపీతో కుమ్మక్కయ్యారని ఆరోపించారు. అయితే, ఇవన్నీ కాంగ్రెస్ నేత చేసిన ఆరోపణలుగా మాత్రమే చూడాలి.

కాలుష్య నివారణకు సంస్కరణలు అవసరం

మరోవైపు దేశంలో పెరుగుతున్న వాయు కాలుష్యంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్యం తీవ్రరూపం దాల్చుతోందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వాయు కాలుష్యాన్ని నియంత్రించేందుకు దాదాపు ఎనిమిదేళ్ల క్రితం ప్రారంభించిన జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమంలో తక్షణ సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ విశ్లేషణను ప్రస్తావిస్తూ.. కొన్ని ప్రాంతాల్లో కాలుష్యం ప్రజారోగ్య సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తోందని జైరాం రమేశ్ పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రస్తుత విధానాలను సమీక్షించి, సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

ఓబీసీ క్రీమీలేయర్‌లో తల్లిదండ్రుల జీతం లెక్కించొద్దు!

న్యూఢిల్లీ: ఓబీసీ రిజర్వేషన్ అభ్యర్థుల క్రీమీలేయర్ స్థితిని నిర్ణయించే సమయంలో తల్లిదండ్రుల జీతాన్ని యాంత్రికంగా పరిగణనలోకి తీసుకోరాదని సుప్రీంకోర్టు మరోసారి స్పష్టం చేసింది. ఈ అంశంపై గతంలో ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాల్సిన అవసరం లేదని పేర్కొంటూ, తీర్పులో మార్పులు చేయాలన్న కేంద్ర ప్రభుత్వ అభ్యర్థనను శుక్రవారం తిరస్కరించింది. జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

సీఎస్ఈ--2025 అభ్యర్థులకూ వర్తింపు

సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీఎస్ఈ)--2025లో ఎంపికైన ఓబీసీ అభ్యర్థులకు సర్వీసుల కేటాయింపు విషయంలోనూ 2026 మార్చి 11న ఇచ్చిన తీర్పులోని సూత్రాలే వర్తిస్తాయని ధర్మాసనం స్పష్టం చేసింది. ఎంపికైన అభ్యర్థులకు పాత ప్రమాణాల ప్రకారం క్రీమీలేయర్ స్థితిని నిర్ణయించేందుకు అనుమతించాలని, మార్చి తీర్పు ప్రభావాన్ని గత తేదీల నుంచి అమలు చేయకుండా పరిమితం చేయాలని కేంద్రం అనుబంధ దరఖాస్తులు దాఖలు చేసింది. అయితే సర్వీసుల కేటాయింపు ప్రక్రియ ఇంకా పెండింగ్‌లో ఉన్నందున, మార్చి 11 నాటి తీర్పు అమలును వాయిదా వేయడానికి సహేతుకమైన కారణాలు లేవని కోర్టు పేర్కొంది. ఆ తీర్పులో వివరించిన క్రీమీలేయర్ సూత్రాల ప్రకారమే సీఎస్ఈ--2025 అభ్యర్థులకు సర్వీసుల కేటాయింపు జరగాలని స్పష్టం చేసింది.

కేసు నేపథ్యం ఇదీ..

సివిల్ సర్వీసెస్ పరీక్షలో అర్హత సాధించిన కొందరు ఓబీసీ అభ్యర్థులను వారి తల్లిదండ్రులు ప్రభుత్వ రంగ సంస్థల్లో (పీఎస్‌యూ) పనిచేస్తున్నారనే కారణంతో క్రీమీలేయర్ పరిధిలోకి చేర్చారు. తల్లిదండ్రుల ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని డీఓపీటీ ఈ నిర్ణయం తీసుకోవడంతో వారికి ఓబీసీ రిజర్వేషన్ ప్రయోజనాలు దక్కలేదు. దీంతో బాధిత అభ్యర్థులు కేంద్ర పరిపాలనా ట్రైబ్యునల్ (క్యాట్)ను ఆశ్రయించారు. అనంతరం మద్రాస్, ఢిల్లీ, కేరళ హైకోర్టుల్లోనూ వారికి అనుకూలంగా తీర్పులు వెలువడ్డాయి. ఈ వ్యవహారంపై కేంద్రం దాఖలు చేసిన అప్పీళ్లను ఈ ఏడాది మార్చిలో సుప్రీంకోర్టు కొట్టివేసింది. సంబంధిత అభ్యర్థులు, ఇంటర్వీనర్ల వాదనలను పరిశీలించి ఆరు నెలల్లోగా ఆదేశాలను అమలు చేయాలని కేంద్రాన్ని ఆదేశించింది.

పాత నియామకాలకు మినహాయింపు

తాజా ఉత్తర్వుల్లో గత తీర్పు ప్రభావంపై కూడా ధర్మాసనం స్పష్టత ఇచ్చింది. ఇప్పటికే పూర్తయిన ఎంపికలు, నియామకాలు, సర్వీసుల కేటాయింపులను తిరిగి తెరవాల్సిన అవసరం లేదని తెలిపింది. దీనివల్ల ఇతర ఉద్యోగుల సీనియారిటీకి కూడా ఎలాంటి భంగం కలగదని పేర్కొంది. అయితే 1993 నాటి ఆఫీస్ మెమోరాండం, 2004లో జారీ చేసిన స్పష్టీకరణ లేఖకు సంబంధించి మార్చి తీర్పులో ఇచ్చిన అన్వయం రాజ్యాంగంలోని ఆర్టికల్ 141 ప్రకారం అందరికీ కట్టుబడి ఉంటుందని స్పష్టం చేసింది. ఇదే తరహా అంశాలపై ఇతర అభ్యర్థుల కేసులు కోర్టులు, ట్రైబ్యునళ్లు లేదా సంబంధిత అధికారుల వద్ద పెండింగ్‌లో ఉంటే, మార్చి తీర్పులోని సూత్రాలను పరిగణనలోకి తీసుకుని వాటి మెరిట్స్ ఆధారంగా నిర్ణయం తీసుకోవచ్చని తెలిపింది.

దిల్లీని కమ్మేసిన కాలుష్యం.. గ్రాప్-3 ఆంక్షలు అమలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో వాయు కాలుష్యం తీవ్రరూపం దాల్చడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. వాయు నాణ్యత సూచీ (ఏక్యూఐ) 390 దాటడంతో దిల్లీతో పాటు జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సీఆర్)లో తక్షణమే గ్రాప్-3 ఆంక్షలు అమలు చేయాలని నిర్ణయించింది. కాలుష్యాన్ని నియంత్రించేందుకు అత్యవసరం కాని నిర్మాణ, కూల్చివేత పనులపై పూర్తిస్థాయి నిషేధం విధించింది. వాహనాల రాకపోకలు, పారిశ్రామిక కార్యకలాపాలపైనా కఠిన ఆంక్షలు అమల్లోకి తీసుకొచ్చింది.

వాహనాలపై కఠిన ఆంక్షలు

గ్రాప్-3 నిబంధనల్లో భాగంగా బీఎస్-3 ప

కొడంగల్‌లో అభివృద్ధి జాతర!

-మొదటిపేజీ తరువాయి

అనంతరం వివిధ శాఖలు, సంస్థలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శిస్తారు. ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి నిర్వహించి వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, ఆధునిక సాగు పద్ధతులు, రైతుల సమస్యలపై చర్చిస్తారు. పారిశ్రామికవేత్తలతోనూ సమావేశమై పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలపై మాట్లాడతారు. అనంతరం రోడ్డు మార్గంలో కొడంగల్‌కు చేరుకుని అక్కడే బస చేస్తారు.

మహిళా సంఘాలతో సీఎం భేటీ

ఆదివారం ఉదయం కొడంగల్ నివాసం నుంచి హకీంపేటకు చేరుకునే సీఎం రేవంత్‌రెడ్డి స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. మహిళా సంఘాల ఆర్థిక అభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాలపై వారితో మాట్లాడతారు.

రూ.81 కోట్లతో ఆయిల్‌పామ్ కర్మాగారం

లగచర్ల పారిశ్రామిక కారిడార్‌లో రూ.81 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఎకోపామ్ ఆయిల్‌పామ్ కర్మాగారానికి సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుతో ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రాసెసింగ్ సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. స్థానికంగా ఉపాధి అవకాశాలు కూడా పెరిగే అవకాశం ఉంది. నాట్కో సంస్థ సీఎస్ఆర్ నిధులు రూ.4 కోట్లతో నిర్మించిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలను ప్రారంభిస్తారు. హకీంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా అందుబాటులోకి తీసుకురానున్నారు.

విద్య, వైద్య, పోలీస్ మౌలిక వసతులకు ప్రాధాన్యం

బొంరాస్‌పేటలో రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల, రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను సీఎం ప్రారంభిస్తారు. కొడంగల్‌లో రూ.3.80 కోట్ల వ్యయంతో నిర్మించిన పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. దుద్యాలలో రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్, రూ.12 కోట్లతో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మండల కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తారు.

కోస్గిలో రూ.6 కోట్లతో నిర్మించిన సైన్స్ మ్యూజియాన్ని ప్రారంభిస్తారు. దౌల్తాబాద్ మండలం బాలంపేటలో రూ.2.35 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభించనున్నారు. ఈ నిర్మాణాలతో ఆయా ప్రాంతాల్లో విద్య, వైద్యం, పోలీసు సేవలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.

రూ.5,060 కోట్లతో రేడియల్ రోడ్డు-2

కొడంగల్ ప్రాంతంలో రవాణా సదుపాయాలను మెరుగుపరిచే దిశగా భారీ ప్రాజెక్టుకు సీఎం శ్రీకారం చుట్టనున్నారు. కోస్గి మండలం నాచారం నుంచి కొత్వాల్‌గూడ వరకు రూ.5,060 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2కు శంకుస్థాపన చేస్తారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ప్రాంతీయ రవాణా వ్యవస్థకు ఊతం లభించడంతో పాటు పారిశ్రామిక, ఆర్థిక కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభించే అవకాశం ఉంది.

10 జిల్లాల రైతులతో భారీ బహిరంగ సభ

సోమవారం సాయంత్రం 4 గంటలకు కొడంగల్ నివాసం నుంచి హకీంపేటకు చేరుకుని సీఎం రేవంత్‌రెడ్డి రైతు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ సభకు పది జిల్లాల నుంచి దాదాపు 50 వేల మంది రైతులను సమీకరించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, మెదక్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల రైతులు సభకు హాజరుకానున్నారు. రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి, ప్రభుత్వ కార్యక్రమాలపై సీఎం ప్రసంగించనున్నారు.

'నేను సైతం ఇందిరమ్మ ఇంట్లో దీపావళి'

మరోవైపు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి దీపావళి పండుగ జరుపుకోనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. గురువారం సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఈ విషయాన్ని ప్రకటించారు. పండుగ వేళ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సొంతింటి సంతోషంలో తానూ భాగస్వామిని కానున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు కూడా ఇందిరమ్మ ఇళ్లకు వెళ్లి లబ్ధిదారులతో కలిసి దీపావళి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. మొత్తంగా మూడు రోజుల కొడంగల్ పర్యటనలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలతో పాటు రైతులు, మహిళలు, పారిశ్రామికవేత్తలతో సీఎం సమావేశాలు నిర్వహించనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది.

పాత విద్యుత్ వినియోగానికి కొత్త బాదుడు

-మొదటిపేజీ తరువాయి

పొందుపరిచాయి. ఇప్పటికే వర్షాలు లేక విద్యుత్ వినియోగం పెరిగి బిల్లులు అధికంగా వస్తున్నాయని ఆందోళన చెందుతున్న వినియోగదారులకు ఈ అదనపు ఛార్జీలు మరింత భారంగా మారాయి.

హైదరాబాద్ పరిధిలోనే భారీ భారం

కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో ప్రస్తుతం 63.51 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 53.06 లక్షలు గృహ కనెక్షన్లు కాగా, 8.60 లక్షలు వాణిజ్య కనెక్షన్లు. మిగిలినవి హెచ్‌టీ, ఇతర ప్రభుత్వ విభాగాల కనెక్షన్లు. 2022-23, 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో ఈ పరిధిలో సుమారు 57 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండేవి. ఆ రెండేళ్లలో వ్యవసాయ అవసరాలు మినహాయించి విద్యుత్ కొనుగోళ్లకు చేసిన అదనపు వ్యయాన్ని ట్రూ అప్ ఛార్జీల రూపంలో వసూలు చేసేందుకు తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీజీఈఆర్‌సీ) ఆమోదం తెలిపింది. టీజీఎస్‌పీడీసీఎల్ పరిధిలో మొత్తం రూ.4,222.93 కోట్ల వసూళ్లకు అనుమతి లభించగా, అందులో క్యూర్ పరిధి వాటా 60 శాతంగా ఉంది. ఈ లెక్కన హైదరాబాద్ వినియోగదారులపై రూ.2,533 కోట్లకు పైగా భారం పడనుంది.

29 నెలల పాటు వసూళ్లు

ట్రూ అప్ ఛార్జీలను 29 నెలల పాటు వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నారు. సగటున నెలకు రూ.87 కోట్లకు పైగా వసూలయ్యే అవకాశం ఉంది. నవంబర్ నెల బిల్లుల్లో గతంలో వినియోగించిన ప్రతి యూనిట్‌పై 30 పైసల చొప్పున అదనపు ఛార్జీ విధించారు. డిసెంబర్ నుంచి ఈ మొత్తం యూనిట్‌కు 50 పైసలకు పెరగనుంది. దీంతో వచ్చే నెల నుంచి విద్యుత్ బిల్లులు మరింత పెరిగే అవకాశముంది. గేటెడ్ కమ్యూనిటీలకు లక్షల్లో బిల్లులు



ట్రూ అప్ ఛార్జీల ప్రభావం గేటెడ్ కమ్యూనిటీలపై భారీగా కనిపిస్తోంది. గచ్చిబౌలిలోని మై హోమ్ విహంగకు నవంబర్ నెలలోనే రూ.2.39 లక్షల ట్రూ అప్ ఛార్జీలు విధించినట్లు సమాచారం. ఐటీ కారిడార్‌లోని పలు భారీ నివాస సముదాయాలకు కూడా లక్షల రూపాయల్లో అదనపు బిల్లులు రావడం నివాసితుల్లో ఆందోళన కలిగిస్తోంది. డిసెంబర్ నుంచి యూనిట్ ఛార్జీ పెరగనుండటంతో ఈ భారం మరింత అధికం కానుంది.

అద్దెదారులకు తీరని తిప్పలు

ట్రూ అప్ ఛార్జీల విధానం అద్దెకు నివసించే వారిని మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. హైదరాబాద్‌లో ఉద్యోగ, ఉపాధి అవసరాల కోసం తరచూ ఇళ్లు మారే వారు అధికంగా ఉంటారు. 2022-23లో ఒక ఇంట్లో విద్యుత్ వినియోగించిన వ్యక్తి ప్రస్తుతం అక్కడ ఉండకపోవచ్చు. అయినప్పటికీ అప్పటి వినియోగానికి సంబంధించిన అదనపు ఛార్జీలు ఇప్పుడు అదే విద్యుత్ కనెక్షన్ బిల్లులో చేరుతున్నాయి. దీంతో ప్రస్తుతం ఆ ఇంట్లో ఉంటున్న అద్దెదారులు గతంలో వేరే వారు వినియోగించిన విద్యుత్తుకు కూడా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశం అద్దెదారులు, ఇంటి యజమానుల మధ్య వాగ్వాదాలకు దారితీస్తోంది. అసలు విద్యుత్తు వినియోగించిన వారు ఒకరైతే, ఇప్పుడు ఆ అదనపు భారం మోస్తున్నది మరొకరన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

బీసీ స్టడీ సర్కిల్ విద్యార్థుల స్టైపెండ్ పెంపు

హైదరాబాద్: తెలంగాణలోని చదువుకున్న నిరుద్యోగ యువతలో చాలామందికి కేంద్ర ప్రభుత్వంలో గానీ రాష్ట్ర ప్రభుత్వంలో గానీ ఉద్యోగాలు సాధించాలనేది ఒక చిరకాల స్వప్నం. ఆ స్వప్నాన్ని సాధించే దిశగా తెలంగాణ యువత చేస్తున్న ప్రయత్నాలను మరింత ప్రోత్సహించే విధంగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 12 బీసీ స్టడీ సర్కిల్‌లలో పోటీ పరీక్షలకు కోచింగ్‌ను తీసుకుంటున్న విద్యార్థులకు అందించే స్టైపెండ్ మొత్తాన్ని పెంచామని, ఇది కాంగ్రెస్ నాయకత్వం లోని ప్రజా ప్రభుత్వం, గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో నిరుద్యోగ యువతకు అందిస్తున్న ఆర్థిక చేయూత అని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలియచేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 12 బీసీ స్టడీ సర్కిల్ లను నిర్వహిస్తున్నామని వీటి ద్వారా ప్రతి ఏటా ఔత్సాహిక యువతీయువకులకు మెరిట్ ప్రాతిపదికన పోటీ పరీక్షలకు సంబంధించిన ఉచిత కోచింగ్ సౌకర్యాన్ని అందిస్తున్నామని ఈ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ తీసుకుంటున్న యువతీ యువకులకు ప్రభుత్వపరంగా అందజేసే స్టైపెండ్‌ను గతంలో ఎన్నడూ లేనివిధంగా పెంచామని, ఇది నిరుద్యోగ యువతీ యువకులకు ఆర్థికపరమైన వెసులుబాటుని, పోటీ పరీక్షల సన్నద్ధత కు సంబంధించిన పూర్తి సహకారాన్ని అందిస్తుందని కనుక ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని యువత తమ కలల్ని నిజం చేసుకోవాలని ఆయన తెలియజేశారు.

యూపీఎస్సీ సివిల్స్ సర్వీసెస్ ఉచిత కోచింగ్ కు ఎంపికైన యువతీయువకుల నెలవారీ స్టైపెండ్ ను ప్రస్తుతం ఉన్న 5 వేల నుంచి 7 వేలకు పెంచామని, బుక్ ఫండ్ పేరిట ప్రతియేటా ఒకసారి ఇస్తున్న మొత్తాన్ని 5 వేల రూపాయల నుంచి 10 వేల రూపాయలకు పెంచామని, ఇక తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిర్వహించే గ్రూప్ వన్, టు, త్రీ, ఫోర్, బ్యాంకింగ్ సర్వీస్, రైల్వే రిక్రూట్‌మెంట్, స్టాఫ్ సెలక్షన్ ఉద్యోగాలకు ఉద్దేశించిన ఫౌండేషన్ కోర్సు లో కోచింగ్ తీసుకుంటున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఇప్పటివరకూ ఇస్తున్న స్టైపెండ్ నెలకు 1000 రూపాయలను,



1500 రూపాయలకు ఈ నవంబర్ నెల నుంచి పెంచామని ఆయన ఈ సందర్భంగా వెల్లడించారు. అలాగే, యుపీఎస్సీ సివిల్ సర్వీసు పరీక్ష లలో విజయానికి నిరంతర అధ్యయనం, కొన్ని సంవత్సరాల నిరంతర సాధన అవసరమని, అందుకే బీసీ స్టడీ సర్కిల్ చరిత్ర లో మొదటిసారిగా గత 2సంవత్సరాలలో బీసీ స్టడీ సర్కిల్ లో సివిల్ సర్వీసుల ఫ్రీ కోచింగ్ తీసుకున్న పూర్వ విద్యార్థులకు మరింత పటిష్టమైన ప్రిపరేషన్ అందించేందుకు తాజా అభ్యర్థులతో సమానమైన స్టైపెండ్ ను ఇస్తూ మళ్ళీ ప్రవేశం కల్పిస్తున్నామని, దీని కోసం వారికి యూపీ ఎస్ సీ తరహాలో స్క్రీనింగ్ పరీక్షను నిర్వహించి ఎంపిక చేసామని, ఇది పేద, బలహీన వర్గాల నిరుద్యోగ యువతకు కొండంత ధైర్యాన్ని ఇస్తుందని, వారికి కావాల్సిన కోచింగ్, మెంటర్షిప్ తో పాటు ఆర్థిక సహాయం అంది, వారు తమ పూర్తి సమయాన్ని పోటీ పరీక్షల పైననే కేటాయించే అవకాశం దొరుకుతుందని ఆయన వివరించారు. బీసీ స్టడీ సర్కిల్లో కోచింగ్ తీసుకుంటున్న యువతీ యువకులలో సివిల్ సర్వీసెస్ సాధించే దిశగా చేయాల్సిన ప్రయత్నాలపై ఇటీవల ఒక నిపుణుల కమిటీని నియమించామని, ఆ కమిటీ బీసీ స్టడీ సర్కిల్ ల అభివృద్ధికి, మెరుగైన సేవలు అందించేందుకు ఎన్నో సూచనలు చేసిందని, వాటిలో ప్రధానమైన సూచన అయిన స్టైపెండ్ పెంపుదలను తక్షణమే అమలు చేసామని, బీసీ స్టడీ సర్కిల్లో మరిన్ని మెరుగైన సేవలందించేందుకు కమిటీ చేసిన సూచనల అన్నిటినీ పరిశీలించామని, వాటన్నిటినీ అమలు చేసే దిశగా ఆదేశాలు ఇచ్చామని ఆయన అన్నారు.

ప్రతి బిసి స్టడీ సర్కిల్ భవనంలోని గోడలపై పోటీ పరీక్షలకు సంబంధించిన విజ్ఞాన విషయాలను, గ్రాఫ్ లు, మ్యాప్ లను పెయింటింగ్ రూపంలో వేయాలని, హైదరాబాదు బీసీ స్టడీ సర్కిల్లో మెట్ల మీద, గోడలపైన అంతటా పోటీ పరీక్షల్లో సాధారణంగా అడిగే చరిత్ర, జాగ్రఫీ, భారత రాజ్యాంగం, ఎకానమీ, సైన్స్ అండ్ టెక్నాలజీ కి సంబంధించిన ఎన్నో విశేషాలని పెయింటింగ్ రూపంలో గోడలపై అలంకరించి అందంగా ముస్తాబు చేశారని, దీనివల్ల తరగతి గదిలో లేని ఇతర సమయాల్లో కూడా ఆ పరిసరాల్లో ఉండే ఈ జ్ఞానపరమైన అంశాలను చూడటం ద్వారా విద్యార్థులు జ్ఞానాన్ని ఆర్జిస్తారని, మరింత గుర్తుపెట్టుకుంటారని, ఇలా గోడలు కూడా జ్ఞానాన్ని బోధించే తరహాలో రూపొందించిన విధానాన్ని ఆయన ప్రశంసించారు. ప్రతి బిసి స్టడీ సర్కిల్ సొంత భవనాలలో స్టడీ రూమ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని, డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జా, కమిషనర్ శ్రీమతి బాల మాయా దేవి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ ఇతరులు పాల్గొన్నారు.

అన్నదాత సహా అందరికీ ముప్పే!



-మొదటిపేజీ తరువాయి

పేర్కొంది. వర్షాభావ పరిస్థితులతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, కరవు ప్రభావం క్రమంగా పట్టణ ప్రాంతాలపైనా కనిపిస్తోందని తెలిపింది. పొలం నుంచి మార్కెట్ వరకు పంటల సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తమవుతోందని వివరించింది. వ్యవసాయ దిగుబడులు తగ్గడం, ఉత్పత్తి వ్యయాలు పెరగడం వల్ల ఆహార పదార్థాల ధరలు పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇది సామాన్యుల గృహ బడ్జెట్లపై భారం మోపడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపుతుందని విశ్లేషించింది.

ఆరు రాష్ట్రాల్లో కరవు ప్రకటన

ఎల్‌నినో ప్రభావంతో దేశ ఆహార సరఫరా వ్యవస్థకు ముప్పు ఏర్పడిందని క్లైమేట్ ట్రెండ్స్ తెలిపింది. ఇప్పటికే ఆరు రాష్ట్రాలు కరవును ప్రకటించాయని పేర్కొంది. అయితే ఇతర రాష్ట్రాల్లో కరవు పరిస్థితులు లేవని దీని అర్థం కాదని స్పష్టం చేసింది. కరవు ప్రకటిస్తే పెట్టుబడులపై ప్రభావం పడుతుందనే ఆందోళనతో కొన్ని రాష్ట్రాలు అధికారిక ప్రకటనకు వెనుకాడుతున్నాయని నివేదిక అభిప్రాయపడింది.

పంటలు పాడవుతున్నా.. నిల్వ సదుపాయాలు అంతంతే

కరవు కారణంగా భూములు సాగుకు అనుకూలత కోల్పోతే రైతు కుటుంబాలు జీవనోపాధిని కోల్పోయే ప్రమాదం ఉందని నివేదిక హెచ్చరించింది. ఇది వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా విస్తృత ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తుందని పేర్కొంది. కరవును కేవలం వ్యవసాయ సమస్యగా కాకుండా వ్యవస్థాగత సవాలుగా చూడాలని సూచించింది. దేశంలో పండ్లు, కూరగాయల్లో దాదాపు 40 శాతం వినియోగదారులకు చేరకముందే పాడైపోతున్నాయని వెల్లడించింది. తాజా వ్యవసాయ ఉత్పత్తుల్లో కేవలం నాలుగు శాతానికే కోల్డ్ చైన్ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. నిల్వ, రవాణా సౌకర్యాల కొరత కూడా రైతులకు నష్టాలను పెంచుతోందని వివరించింది.

ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి

వ్యవసాయ విధానాలు కేవలం దిగుబడుల పెంపుపైనే కాకుండా నేల ఆరోగ్య పరిరక్షణపైనా దృష్టి సారించాలని క్లైమేట్ ట్రెండ్స్ సూచించింది. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని పేర్కొంది. చిన్న, సన్నకారు రైతులకు తగిన ఆర్థిక సహాయం అందించాలని సిఫార్సు చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ విధానాలను ఇతర ప్రాంతాలకు కూడా ఆదర్శంగా తీసుకోవాలని సూచించింది.

నివేదికలోని కీలక సిఫార్సులు

పండ్లు, కూరగాయల నిల్వ కోసం కోల్డ్ చైన్ వ్యవస్థను విస్తరించాలి. ప్రభుత్వాలు ఈ రంగంలో పెట్టుబడులు పెంచాలి. రైతు సమూహ్యలు, సహకార సంస్థల్లో సంస్కరణలు చేపట్టి పొలం నుంచి మార్కెట్ వరకు సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలి. రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై శిక్షణ, అవసరమైన సౌకర్యాలు కల్పించాలి. పంట ఉత్పత్తులను విక్రయించేందుకు మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించాలి. కౌలు రైతులతో సహా అర్హులైన రైతులందరినీ పంట, వాతావరణ ఆధారిత బీమా పథకాల పరిధిలోకి తీసుకురావాలి. మండల స్థాయిలో వాతావరణ సలహాలు, కరవు ప్రమాద అంచనాలు, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. జీవ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించి, వాటికి తగిన రాయితీలు కల్పించాలి. వ్యవసాయ బడ్జెట్‌లో ప్రకృతి వ్యవసాయానికి ప్రత్యేక కేటాయింపులు చేయాలి. పంట నష్ట పరిహారాన్ని పొలం వరకే పరిమితం చేయకుండా, ఉత్పత్తి మార్కెట్‌కు చేరే వరకు సరఫరా వ్యవస్థ అంతటా భద్రత కల్పించాలి. వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు వ్యవసాయ విధానాల్లో సమగ్ర మార్పులు అవసరమని క్లైమేట్ ట్రెండ్స్ శ్వేతపత్రం స్పష్టం చేసింది. రైతుల ఆదాయ భద్రతతో పాటు ఆహార సరఫరా వ్యవస్థను కాపాడేందుకు దీర్ఘకాలిక ప్రణాళికలు చేపట్టాలని సూచించింది.

హౌసింగ్ బోర్డుకు సుప్రీం డెడ్‌లైన్



-మొదటిపేజీ తరువాయి

అన్ని ప్రక్రియలను ఈ నెల 23లోగా పూర్తి చేయాలని ధర్మాసనం ఆదేశించింది. రిజిస్ట్రేషన్లు పూర్తిచేసే విషయంలో ఇకపై జాప్యం చేయడానికి వీల్లేదని స్పష్టమైన గడువు విధించింది. అయితే ఈ ఆస్తులను లబ్ధిదారులు లేదా హౌసింగ్ బోర్డు ఇతర వ్యక్తులకు విక్రయించడానికి, బదిలీ చేయడానికి అనుమతి లేదని పేర్కొంది.

మూడో పక్షానికి హక్కులు వద్దు

ఈ కేసులో తుది తీర్పు వెలువడే వరకు సంబంధిత ఆస్తులపై మూడో పక్షానికి ఎలాంటి హక్కులు కల్పించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఒకవైపు ఆదేశిస్తూనే, మరోవైపు ఆస్తుల క్రయవిక్రయాలపై నియంత్రణలు విధించింది. తద్వారా కేసు తుది పరిష్కారం అయ్యే వరకు ఆస్తుల విషయంలో కొత్త వివాదాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంది.

దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదం

తెలంగాణ హౌసింగ్ బోర్డు చేపట్టిన పలు ప్రాజెక్టుల్లో రిజిస్ట్రేషన్లు దశాబ్దానికి పైగా పెండింగ్‌లో ఉన్నాయి. సుమారు 10 నుంచి 15 ఏళ్ల క్రితమే పలువురు లబ్ధిదారులు ఫ్లాట్లను బుక్ చేసుకున్నారు. కొనుగోలు ఒప్పందాల ప్రకారం చాలామంది 2011 నాటికే పూర్తి మొత్తాన్ని చెల్లించినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ హౌసింగ్ బోర్డు, నిర్మాణ సంస్థలు, డెవలపర్ల మధ్య వివాదాలు, మూడో పక్ష లావాదేవీల కారణంగా రిజిస్ట్రేషన్లు పూర్తికాలేదు.

లబ్ధిదారులకు ఊరట

రిజిస్ట్రేషన్ల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు సుప్రీంకోర్టు తాజా ఆదేశాలు ఊరటనిచ్చే అంశంగా మారాయి. ఈ నెల 23లోగా ప్రక్రియ పూర్తి చేయాలన్న గడువుతో హౌసింగ్ బోర్డుపై బాధ్యత పెరిగింది. అయితే తుది తీర్పు వచ్చే వరకు ఆస్తుల బదిలీలపై ఆంక్షలు కొనసాగనున్నాయి.

బిజినెస్

అతడు లోన్ ఎగ్గొడితే.. మీరు కట్టాల్సిందేనా?

గ్యారంటీ సంతకం చేసే ముందు ఈ విషయాలు తెలుసుకోండి!



స్నేహితుడో, బంధువో బ్యాంకు లోన్ తీసుకోవాలనుకున్నప్పుడు అర్హతలు సరిపోక మీ సాయం కోరవచ్చు. గ్యారంటీగా సంతకం చేయాలని అడగవచ్చు. వారి మీద నమ్మకంతో చాలామంది వెంటనే అంగీకరిస్తుంటారు. కానీ ఈ నిర్ణయం తీసుకునే ముందు ఒకసారి ఆలోచించాలి. ఎందుకంటే రుణానికి హామీదారుగా సంతకం చేయడం అంటే కేవలం స్నేహితుడికి సాయం చేయడం మాత్రమే కాదు.. అతడు లోన్ వాయిదాలు చెల్లించకపోతే ఆ బాధ్యతను మీరూ స్వీకరించడమే. భారత్‌లో రుణ హామీ ఒప్పందంపై సంతకం చేసిన తర్వాత, రుణగ్రహీత చెల్లించాల్సిన బకాయిలను వసూలు చేసేందుకు బ్యాంకు మిమ్మల్ని కూడా బాధ్యులుగా చేయవచ్చు.

మీ సేవింగ్స్‌కూ ముప్పు

రుణగ్రహీత వాయిదాలు చెల్లించడంలో విఫలమైతే, ఒప్పంద నిబంధనల ప్రకారం బ్యాంకు బకాయి మొత్తాన్ని మీ నుంచి వసూలు చేసేందుకు ప్రయత్నించవచ్చు. ఈ పరిణామం మీ ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అత్యవసర అవసరాల కోసం దాచుకున్న డబ్బు, భవిష్యత్తు ఖర్చుల కోసం కూడబెట్టిన సొమ్ము కూడా లోన్ చెల్లింపులకు వినియోగించాల్సి రావచ్చు. బకాయిలు అలాగే ఉంటే బ్యాంకు చట్టపరమైన చర్యలకూ దిగవచ్చు. కొన్ని పరిస్థితుల్లో మీ ఆస్తులకూ ముప్పు ఏర్పడవచ్చు.

మీ క్రెడిట్ స్కోర్ దెబ్బతినొచ్చు

మీరు తీసుకోని లోన్ కారణంగా మీ క్రెడిట్ హిస్టరీపై ప్రతికూల ప్రభావం పడవచ్చు. ప్రధాన రుణగ్రహీత వాయిదాలు సకాలంలో చెల్లించకపోయినా, లోన్ ఎగవేసినా ఆ వివరాలు క్రెడిట్ సమాచార సంస్థలకు చేరే అవకాశం ఉంది. దీంతో మీ క్రెడిట్ స్కోర్ తగ్గవచ్చు. భవిష్యత్తులో వ్యక్తిగత రుణం, గృహ రుణం, క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసినప్పుడు బ్యాంకులు మీ క్రెడిట్ హిస్టరీని పరిశీలిస్తాయి. అప్పుడు మీరు ఇప్పటివరకు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లించినా, హామీ ఇచ్చిన లోన్ ప్రతికూలతలు మీపై ప్రభావం చూపవచ్చు.

భవిష్యత్తులో మీకు రుణం రావడం కష్టమవుతుందా?

మరొకరి లోన్‌కు హామీగా నిలవడం మీ భవిష్యత్తు రుణ అర్హతపైనా ప్రభావం చూపవచ్చు. ఆ హామీని బ్యాంకులు మీపై ఉన్న ఆర్థిక బాధ్యతగా పరిగణించే అవకాశం ఉంది. మీరు సొంతంగా ఇల్లు కొనాలనుకున్నా, కారు తీసుకోవాలనుకున్నా లేదా వ్యక్తిగత అవసరాల కోసం రుణం కోరినా ఈ అంశాన్ని పరిశీలించవచ్చు. హామీగా ఉన్న మొత్తం ఎక్కువైతే, మీకు మంజూరయ్యే రుణ పరిమితి తగ్గే అవకాశముంది.

హామీ ఇచ్చే ముందు ఈ జాగ్రత్తలు తప్పనిసరి

రుణానికి గ్యారంటీగా సంతకం చేసే ముందు ఒప్పందాన్ని పూర్తిగా చదవాలి. రుణగ్రహీత చెల్లించకపోతే మీపై పడే బాధ్యత ఎంత? వడ్డీ, ఆలస్య రుసుములు, జరిమానాలు సహా ఎంత మొత్తం చెల్లించాల్సి రావచ్చు? ఏ పరిస్థితుల్లో బ్యాంకు మీ నుంచి డబ్బు వసూలు చేయవచ్చు? వంటి అంశాలను స్పష్టంగా తెలుసుకోవాలి. రుణం తీసుకుంటున్న వ్యక్తి ఆదాయం ఎంత? ఇప్పటికే ఇతర రుణాలు ఉన్నాయా? గతంలో వాయిదాలను సక్రమంగా చెల్లించారా? అన్న విషయాలనూ పరిశీలించాలి. స్నేహితులు, బంధువులకు ఆర్థికంగా అండగా నిలవడం మంచి విషయమే. అయితే ఆ సాయం మీకు భారంగా మారకూడదు. రుణగ్రహీత చెల్లించకపోతే మొత్తం బకాయిని మీరే చెల్లించగలరా? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పుకోండి. ఆ బాధ్యతను భరించే పరిస్థితి లేకపోతే గ్యారంటీగా సంతకం చేయకపోవడమే మంచిదని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

కుప్పకూలిన స్టాక్‌మార్కెట్లు..
ట్రిలియన్ డాలర్లు కోల్పోయిన టెకీ కంపెనీలు



న్యూయార్క్: అమెరికాలో మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్లు జయకేతనం ఎగురవేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఆ దేశ స్టాక్‌మార్కెట్ల లో ట్రిలియన్ల డాలర్లు ఆవిరైపోతున్నాయి. అమెరికా, యూరోప్, ఆసియా దేశాల్లోని టెకీ సంస్థలపై మిడ్‌టర్మ్ ఫలితాలు దారుణమైన ప్రభావాన్ని చూపుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డెవలప్మెంట్ మందగిస్తుందన్న భయాందోళనల వల్ల అమెరికా స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. అమెరికాలో నాస్‌డాక్ షేర్లు 5.5 శాతం పడిపోయాయి. దీంతో సుమారు 2.5 ట్రిలియన్ల డాలర్ల మార్కెట్ నష్టపోయినట్లు తెలుస్తోంది. నాస్‌డాక్‌తో పాటు ఇతర అమెరికా స్టాక్ ఇండెక్స్‌ల్లోనూ భారీ పతనం నమోదు అయ్యింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఆంక్షలు కఠినం చేసే అవకాశాలు ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. డేటా సెంటర్ల ఏర్పాటును డెమోక్రాట్లు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఏఐపై పెట్టుబడి పెట్టేందుకు వెనుకడుగు వేశారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా టెకీ కంపెనీల షేర్లు షేక్ అయ్యాయి. ఏఐపై భారీగా పెట్టుబడి పెడితే, దానికి తగిన లాభాలు వస్తాయా రావా అన్న ఆలోచనల్లో మదుపరులు ఉన్నట్లు తెలుస్తోంది. అమెరికాలో మ్యాగ్నిఫిషియంట్ సెవన్ టెకీ కంపెనీల్లో భాగమైన యాపిల్, ఎన్వీడియా, టెస్లా కంపెనీలు ట్రేడింగ్‌లో ట్రిలియన్ డాలర్లు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఎన్వీడియా కంపెనీ షేర్లు 9 శాతం పడిపోయాయి. ఇతర చిప్ తయారీ కంపెనీలు కూడా ఇబ్బందిపడ్డాయి. ఏఎండీ, మైక్రాన్ కంపెనీల షేర్లు దాదాపు 17 శాతం కుప్పకూలాయి. బిలియనీర్ ఎలన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్, టెస్లా కంపెనీల్లో షేర్లు 8, 11 శాతం పడిపోయినట్లు గుర్తించారు. దీంతో ఆ రెండు కంపెనీలకు చెందిన సుమారు 300 బిలియన్ల డాలర్ల మార్కెట్ వాల్యూ పడిపోయింది. రిపబ్లికన్ పార్టీ ప్రచారం కోసం మస్క్ సుమారు 450 మిలియన్ల డాలర్లు ఖర్చు చేశారు. దీంట్లో టెక్సాస్ సేనేట్ అభ్యర్థి కెన్ పాక్స్‌టన్ కోసం 45 మిలియన్ల డాలర్లు ఖర్చు పెట్టారు. కానీ అక్కడ డెమోక్రటిక్ అభ్యర్థి గెలుపొందారు. యురోప్‌కు చెందిన టెకీ కంపెనీ, చిప్‌మేకర్ ఇన్‌ఫినియాన్ షేర్లు కూడా 8.5 శాతం పడిపోయాయి. ఇక టెకీ ఎక్విప్మెంట్ తయారీ సంస్థ ఏఎస్ఎంఎల్ కంపెనీ షేర్లు 6.5 శాతం తగ్గాయి. శుక్రవారం ఏషియన్ మార్కెట్లు కూడా వణికిపోయాయి. జపాన్‌లో నిక్కీ షేర్ ఇండెక్స్ 6 శాతం పడిపోయింది. మెమోరీ చిప్ తయారీ సంస్థలు కియాక్సియా, టోక్యో ఎలక్ట్రాన్ కంపెనీ షేర్లు భారీగా పతనం అయ్యాయి. దక్షిణ కొరియాలో చిప్‌మేకర్ ఎస్‌కే హైనిక్స్ 10 శాతం, శాంసంగ్ 6.4 శాతం షేర్లు డౌనయ్యాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఖర్చులపై భయాందోళనల నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు కుదేలు అయినట్లు మార్కెట్‌వాచ్ నిపుణుడు బ్రిట్నీ నుయెన్ తెలిపారు.

మానవాభివృద్ధి లేని ఆర్థిక వృద్ధి!

ఒక దేశం లేదా ప్రాంతం ఆర్థికంగా ఎంత బలపడింది, జీడీపీ వృద్ధి రేటు ఎంత పెరిగింది అనే లెక్కలే నేడు అభివృద్ధికి ప్రామాణికంగా మారుతున్నాయి. అయితే, కేవలం ఆర్థిక సంపద గణాంకాలే ప్రగతికి గీటురాయి కాలేవని ఆర్థిక రంగ నిపుణులు ఎప్పటికప్పుడు స్పష్టం చేస్తున్నారు. మానవాభివృద్ధిని విస్మరించి కేవలం అంకెలను మాత్రమే ప్రాతిపదికగా తీసుకునే ఆర్థిక వృద్ధి అస్థిరమైనది మాత్రమే కాదు, పూర్తిగా అనైతికం కూడా. ఆర్థిక వ్యవస్థ ఎంత రిచ్‌గా ఉందన్నది ముఖ్యం కాదు, మనుషులు ఎంత సుఖంగా జీవిస్తున్నారు అనేదే అసలైన అభివృద్ధికి కొలమానం అని నిపుణులు చెబుతున్నారు.

డబ్బు ప్రాముఖ్యత – పరిమితులు

ఆధునిక సమాజంలో మనుగడ సాగించడానికి, ప్రాథమిక అవసరాలు తీర్చుకోవడానికి డబ్బు అత్యంత కీలకం. కనీస జీవన ప్రమాణాలు, మంచి విద్య, మెరుగైన వైద్యం, పౌష్టికాహారం, నివాసం పొందడానికి ఆర్థిక స్థోమత ఎంతో అవసరం. అయితే, డబ్బు కేవలం ఒక సాధనం మాత్రమే కానీ అదే గమ్యస్థానం కాకూడదు. ఆర్థిక సంపద కొందరు వ్యక్తులు, కొన్ని వ్యవస్థల వద్ద కేంద్రీకృతమవడం వల్ల సమాజంలో అసమానతలు పెరిగిపోతున్నాయని అనేక అధ్యయనాలు



హెచ్చరిస్తున్నాయి. ఒకవైపు వేల కోట్లు పోగేసుకునే వర్గం ఉండగా, మరోవైపు కనీస భోజనానికి నోచుకోని కోట్లాది మంది నిరుపేదలు ఉండటం స్థిరత్వం లేని ఆర్థిక విధానాలకు నిదర్శనం. కేవలం పరిశ్రమలు, ఐటీ రంగాలు, స్టాక్ మార్కెట్ సూచీలు పెరిగినంత మాత్రాన ప్రజల జీవితాలు బాగుపడినట్లు కాదు. ఆ సంపద ఫలాలు సమాజంలోని పేద వర్గాలకు, సామాన్యులకు ఏ మేర చేరుతున్నాయనేదే ముఖ్యం. మానవ వనరులపై పెట్టుబడి పెట్టని ఏ ప్రభుత్వ విధానమైనా దీర్ఘకాలంలో విఫలం కావాల్సిందే. ప్రముఖ ఆర్థికవేత్త అమర్త్య సేన్ వంటి నోబెల్ గ్రహీతలు ఎప్పుడూ 'సామర్థ్యాల అభివృద్ధి' గురించే మాట్లాడారు. ప్రజలకు ఆర్థిక వనరులు ఉండటంతో పాటు వాటిని ఉపయోగించుకునే స్వేచ్ఛ, ఆరోగ్యం, విద్య ఉంటేనే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఆర్థిక వృద్ధి అనేది మానవుడి శ్రేయస్సును పెంచే సాధనంగా పనిచేయాలి తప్ప, మానవుడిని కేవలం ఆర్థిక వృద్ధికి ఒక వస్తువుగా లేదా సాధనంగా చూడకూడదు. సమాజంలో ఆర్థికాభివృద్ధికి, మానవ వికాసానికి మధ్య సమతుల్యత లోపించినప్పుడు నిరుద్యోగం, పేదరికం, మానసిక ఒత్తిళ్లు, అనారోగ్య సమస్యలు పెరుగుతాయి. కేవలం భౌతిక సంపద వెంట పరుగులు పెట్టడం మాని ప్రతి ఒక్కరికీ నాణ్యమైన జీవనం, సమాన అవకాశాలు, గౌరవప్రదమైన బతుకును అందించే సమగ్ర విధానాల వైపు అడుగులు వేయాలి. సంపద సృష్టితో పాటు మానవ విలువలకు పెద్దపీట వేసినప్పుడే దేశంగా ప్రగతి పథంలో పయనిస్తుంది.

కోహ్లీ 100 సెంచరీల కల నెరవేరేనా?

2027 ప్రపంచకప్ లోపు కష్టమంటున్న మాజీ కోచ్!



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో 100 సెంచరీల మైలురాయిని అందుకోవాలని అభిమానులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే 2027 వన్డే ప్రపంచకప్‌లోపే ఈ ఘనత సాధించడం కష్టమేనని భారత జట్టు మాజీ సహాయ కోచ్ అభిషేక్ నాయర్ అభిప్రాయపడ్డాడు. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే కోహ్లీకి తగినన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉండాలని పేర్కొన్నాడు. ప్రపంచకప్ వరకు ఉన్న సమయాన్ని పరిగణనలోకి తీసుకుంటే వంద సెంచరీల మార్కును అందుకోవడానికి సరిపడా మ్యాచ్‌లు లేవని జియోస్టార్‌తో చెప్పాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అన్ని ఫార్మాట్లలో కలిపి కోహ్లీ 86 సెంచరీలు చేశాడు. భారత మాజీ క్రికెటర్ చతేశ్వర్ పుజారాతో కలిసి నాయర్ ఈ అంశంపై చర్చించాడు. "కోహ్లీ వంద సెంచరీలు చేయాలని నేనూ కోరుకుంటున్నా. కానీ ఆ స్థాయికి చేరుకోవాలంటే తగినన్ని మ్యాచ్‌లు ఆడాలి కదా! ప్రపంచకప్ తర్వాత కూడా అతడు ఆడొచ్చు. అయితే అప్పటికి అతడి స్ఫూర్తి ఇదే స్థాయిలో ఉంటుందా అన్నది చెప్పలేం. అందుకే ప్రపంచకప్‌లోపే ఈ ఘనత సాధించడం కష్టమని భావిస్తున్నా" అని నాయర్ వివరించాడు. వన్డేల్లో అత్యధిక సెంచరీలు సాధించిన ఆటగాడిగా కోహ్లీ ఇప్పటికే రికార్డు సృష్టించాడు. ఇప్పటివరకు ఈ ఫార్మాట్‌లో 55 శతకాలు బాదాడు. గతంలో సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 49 సెంచరీల రికార్డును అధిగమించాడు. 2023 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో న్యూజిలాండ్‌పై ముంబయిలోని వాంఖడే స్టేడియంలో తన 50వ వన్డే సెంచరీ సాధించి చరిత్ర సృష్టించాడు. ఇదే చర్చలో భారత జట్టు భవిష్యత్తు కూర్పుపైనా నాయర్ కీలక సూచనలు చేశాడు. హార్దిక్ పాండ్యాకు తోడుగా మరో ఆల్‌రౌండర్‌ను సిద్ధం చేయాలని అభిప్రాయపడ్డాడు. న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా వంటి పర్యటనల్లో ఇద్దరు సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్లు జట్టులో ఉంటే సమతూకం మెరుగవుతుందని చెప్పాడు. ఇద్దరు ప్రధాన పేసర్లతో పాటు బ్యాటింగ్ చేయగల ఇద్దరు ఆల్‌రౌండర్లు ఉంటే జట్టుకు అదనపు బలం చేకూరుతుందని వివరించాడు. మరోవైపు హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ సమస్యలను దృష్టిలో పెట్టుకుని నితీశ్ కుమార్ రెడ్డిని ప్రత్యామ్నాయ ఆల్‌రౌండర్‌గా తీర్చిదిద్దాలని పుజారా సూచించాడు. హార్దిక్ అందుబాటులో ఉంటే అతడే తొలి ఎంపిక అని, అయితే ఏడాది పొడవునా పూర్తి ఫిట్‌నెస్‌తో ఉండలేకపోతున్నందున సమాన సామర్థ్యాలున్న మరో ఆటగాడు అవసరమని పేర్కొన్నాడు. వన్డే క్రికెట్‌పై అభిమానుల్లో ఆసక్తి పెంచేందుకు మళ్లీ ముక్కోణపు, నాలుగు దేశాల టోర్నీలను నిర్వహించాలని నాయర్, పుజారా అభిప్రాయపడ్డారు. మూడు, నాలుగు జట్లు పాల్గొనే టోర్నీల్లో ప్రతి మ్యాచ్ కీలకంగా మారుతుందని, ఆటగాళ్లను ఎక్కువగా చూసే అవకాశం అభిమానులకు లభిస్తుందని పుజారా చెప్పాడు. ఇలాంటి పోటీలు పెద్ద టోర్నీలకు జట్లను సిద్ధం చేయడంతో పాటు వన్డే ఫార్మాట్‌పై ఆసక్తిని పెంచుతాయని నాయర్ పేర్కొన్నాడు. షార్జాలో ఆస్ట్రేలియాపై సచిన్ టెండూల్కర్ ఆడిన చారిత్రక ఇన్నింగ్స్ వంటి జ్ఞాపకాలు ఇలాంటి టోర్నీలతోనే ముడిపడి ఉన్నాయని గుర్తుచేశాడు.

ఆర్యావీర్ సెహ్వాగ్, లక్ష్య రాయిచందానీ హాఫ్ సెంచరీలు.. ఆసియా అండర్-19లో భారత్ బోణీ

మస్కట్: అండర్-19 ఆసియాకప్‌లో ఇండియా బోణీ కొట్టింది. ఇవాళ ఒమన్‌లోని మస్కట్‌లో నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌లో భారత్ జట్టు 10 వికెట్ తేడాతో విజయం సాధించింది. 129 పరుగుల లక్ష్యాన్ని కేవలం 19.1 ఓవర్లలో అందుకున్నది. ఓపెనర్లు ఆర్యవీర్ సెహ్వాగ్ చెలరేగి ఆడాడు. వీరేంద్ర సెహ్వాగ్ తనయుడైన ఆర్యవీర్.. కేవలం 52 బంతుల్లో 70 రన్స్ స్కోరు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏడు బౌండరీలు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. ఇక మరో ఓపెనర్ లక్ష్య రాయిచెందాని 63 బంతుల్లో 53 రన్స్ చేసి జట్టుకు విజయాన్ని అందించారు. ఈ విక్టరీతో ఇండియా తన పాయింట్ల పట్టికలో ఖాతా తెరిచింది. అయితే ఫస్ట్ బ్యాటింగ్ చేసిన నేపాల్ 42.3 ఓవర్లలో కేవలం 138 రన్స్ మాత్రమే స్కోరు చేసి ఆలౌటైంది.నేపాల్ జట్టులో దర్శ్ సోనార్ అత్యధికంగా 43 రన్స్ చేశాడు. భారత బౌలర్లలో అర్జుత్ రాజ్‌పుత్, ఇషాన్ సూద్‌లు చెరి మూడేసి వికెట్లు తీసుకున్నారు.



స్పోర్ట్స్

పాపం బాబర్ ఆజమ్..
ఫామ్ కోసం దేశవాళీకి వస్తే
అక్కడా అదే కథ! ఔటై బ్యాట్‌ను బాదేశాడు!



పాపం బాబర్ ఆజమ్.. ఫామ్ అందుకోవాలని దేశవాళీ క్రికెట్‌లోకి అడుగుపెడితే అక్కడా నిరాశే ఎదురైంది. శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు ముందు కాస్త పరుగులు చేసి ఆత్మవిశ్వాసం పెంచుకుందామనుకున్న పాక్ స్టార్‌కు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ చుక్కెదురైంది. స్వల్ప పరుగులకే పెవిలియన్ బాట పట్టాల్సి వచ్చింది. దీంతో మైదానంలోనే అసహనం బయటపెట్టాడు. ఔటై డ్రెస్సింగ్ రూమ్‌కు వెళుతూ బ్యాట్‌ను నేలకేసి కొట్టాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పాకిస్థాన్ దేశవాళీ టోర్నీ ఖైద్-ఎ-ఆజమ్ ట్రోఫీలో లాహోర్ వైట్స్ తరఫున బాబర్ ఆడుతున్నాడు. ఫటా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో 28 పరుగులే చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లోనైనా భారీ స్కోరు సాధిస్తాడని అభిమానులు ఆశిస్తే.. 42 పరుగులకే ఔటయ్యాడు. 77 బంతులు ఎదుర్కొన్న బాబర్.. షాహిద్ అజీజ్ వేసిన బంతిని వదిలేయాల్సింది పోయి క్లిక్ చేశాడు. ఆఫ్ స్టంప్‌కు చాలా దూరంగా వెళ్లిన బంతిని శరీరానికి దూరంగా ఆడటంతో బ్యాట్ అంచుకు తగిలి ఫస్ట్ స్లిప్‌లో క్యాచ్‌గా మారింది. అంతే.. మరోసారి పెవిలియన్ దారి పట్టాల్సి వచ్చింది. ఈసారి మాత్రం నిరాశను దాచుకోలేక బ్యాట్‌ను నేలపై బలంగా కొట్టాడు. ఇక మ్యాచ్‌లోనూ లాహోర్‌కు చేదు అనుభవమే ఎదురైంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఫటా 362 పరుగులు చేసింది. ఫవాద్ అర్షద్ 115 పరుగులతో రాణించాడు. లాహోర్ తొలి ఇన్నింగ్స్‌లో 234 పరుగులకే ఆలౌటైంది. అలీ జర్యాబ్ 51 పరుగులు చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో మహమ్మద్ ఫరూక్ 123 పరుగులతో చెలరేగడంతో ఫటా 283 పరుగులు సాధించింది. దీంతో లాహోర్ ముందు 412 పరుగుల లక్ష్యం నిలిచింది. కానీ ఆ జట్టు 170 పరుగులకే కుప్పకూలింది. ఫటా 241 పరుగుల భారీ విజయాన్ని అందుకుంది. ఇప్పుడు బాబర్‌కు మరో దేశవాళీ మ్యాచ్ ఆడే అవకాశం కూడా లేదు. ఈ నెల 9 నుంచి రావల్పిండిలో శ్రీలంకతో పాకిస్థాన్ తొలి టెస్టు ఆడనుంది. మరి దేశవాళీ క్రికెట్‌లో పరుగుల కోసం తంటాలు పడుతున్న బాబర్.. అంతర్జాతీయ టెస్టు వేదికపై అయినా తన బ్యాట్‌కు పని చెబుతాడేమో చూడాలి!



‘రామాయణ’పై మహేష్ బాబు ప్రశంసలు..
‘వారణాసి’లో శ్రీరాముడిగా ఎలా కనిపిస్తారోనని చర్చ..!

సూపర్ స్టార్ మహేష్ బాబు తాజాగా ‘రామాయణం’ సినిమాపై ప్రశంసల వర్షం కురిపించారు. రణబీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు నితీష్ తివారీ తెరకెక్కించిన ఈ భారీ పౌరాణిక చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి స్పందనను సొంతం చేసుకుంది. ముఖ్యంగా సినిమాలోని విజువల్స్, నటీనటుల అభినయం, భారీ నిర్మాణ విలువలపై సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇప్పటికే దర్శకులు ఎస్.ఎస్. రాజమౌళి, అట్లీ వంటి పలువురు ఈ చిత్రాన్ని మెచ్చుకోగా.. తాజాగా మహేష్ బాబు కూడా తన అభిప్రాయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ‘రామాయణ’ పార్ట్-1 సినిమా చూసిన మహేష్ బాబు.. చిత్ర బృందాన్ని అభినందిస్తూ ప్రత్యేకంగా పోస్ట్ చేశారు. చిన్నప్పటి నుంచి వింటూ పెరిగిన పురాణ గాథను ఇంత అద్భుతంగా వెండితెరపై ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. రణబీర్ కపూర్, యశ్, సాయి పల్లవిల నటన అద్భుతంగా ఉందని ప్రశంసించారు. ఇంత భారీ స్థాయిలో సినిమాను నిర్మించడానికి కృషి చేసిన నిర్మాత నమిత్ మల్హోత్రా, దర్శకుడు నితీష్ తివారీలకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ‘రామాయణ’ చిత్ర బృందం మొత్తం అభినందనలకు అర్హులని మహేష్ తన పోస్టులో పేర్కొన్నారు. ఇదిలా ఉంటే మహేష్ బాబు చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు ఆయన తదుపరి చిత్రం ‘వారణాసి’ గురించి కూడా చర్చకు దారితీసింది. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి దర్శకత్వంలో మహేష్ బాబు నటిస్తున్న ఈ భారీ చిత్రం సోషియో ఫాంటసీ, ట్రైమ్ ట్రావెల్, మైథలాజికల్ అంశాల కలయికతో రూపొందుతోంది. ఇందులో రామాయణానికి సంబంధించిన ఎపిసోడ్ అత్యంత కీలకంగా ఉండనుంది. ఈ చిత్రంలో మహేష్ బాబు తొలిసారిగా శ్రీరాముడి పాత్రలో కనిపించనున్నారు. దాదాపు 20 నిమిషాల పాటు సాగే రామాయణ ఘట్టం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనుందని ప్రచారం జరుగుతోంది. రాముడి పాత్ర కోసం మహేష్ ప్రత్యేకంగా సిద్ధమవుతున్నట్లు ఇప్పటికే వార్తలు వచ్చాయి. మహేష్ బాబును శ్రీరాముడి పాత్రలో చూపించేందుకు రాజమౌళి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలుస్తోంది. లుక్ టెస్ట్ సమయంలో మహేష్‌ను రాముడి గెటప్‌లో చూసి తాను ఆశ్చర్యపోయానని గతంలో రాజమౌళి వెల్లడించారు. దీంతో ‘వారణాసి’లో మహేష్ రాముడి అవతారంలో ఎలా కనిపిస్తారనే ఆసక్తి అభిమానుల్లో మరింత పెరిగింది.ఇక ‘రామాయణం’ సినిమాలో రణబీర్ కపూర్ శ్రీరాముడిగా కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో, మహేష్ బాబు రాముడి పాత్రలో ఎలా మెప్పిస్తారనే చర్చ మొదలైంది. ఇద్దరు స్టార్ హీరోలు ఒకే పౌరాణిక పాత్రలో కనిపించనుండటంతో అభిమానులు ఈ రెండు చిత్రాలపై ప్రత్యేక ఆసక్తి చూపిస్తున్నారు.

విజయ్ సేతుపతికి అరుదైన గౌరవం..
తొలి భారతీయ నటుడిగా ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేదికపై చరిత్ర!



తమిళ చిత్ర పరిశ్రమలో విలక్షణ నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న విజయ్ సేతుపతి మరో అరుదైన ఘనతను సొంతం చేసుకోబోతున్నారు. హీరోగా, విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా విభిన్న పాత్రల్లో ప్రేక్షకులను మెప్పిస్తున్న ఆయన ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో భారతీయ సినీ ప్రతిభకు ప్రతినిధిగా నిలవబోతున్నారు. ప్రతిష్ఠాత్మక 54వ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేడుకలో అవార్డు ప్రెజెంటర్‌గా వ్యవహరించే అవకాశం విజయ్ సేతుపతికి దక్కింది. ఈ ఘనత సాధించనున్న తొలి భారతీయ నటుడిగా ఆయన చరిత్ర సృష్టించబోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా టెలివిజన్ రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులు, సాంకేతిక నిపుణులను గుర్తిస్తూ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డులను అందిస్తారు. ఈ ఏడాది 54వ ఇంటర్నేషనల్ ఎమ్మీ అవార్డుల వేడుక నవంబర్ 23, 2026న న్యూయార్క్‌లో జరగనుంది. ప్రపంచవ్యాప్తంగా పలువురు ప్రముఖులు పాల్గొనే ఈ వేడుకలో అవార్డులు అందించే ప్రెజెంటర్లలో విజయ్ సేతుపతి కూడా ఉండనున్నారు. భారతీయ నటుడికి ఇలాంటి అంతర్జాతీయ వేదికపై గుర్తింపు దక్కడం సినీ పరిశ్రమకు గర్వకారణంగా మారింది. గతంలో బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా 2016లో జరిగిన 68వ ప్రైమ్‌టైమ్ ఎమ్మీ అవార్డుల వేడుకలో హాలీవుడ్ నటుడు టామ్ హిడిల్‌స్టన్‌తో కలిసి అవార్డును అందించారు. అయితే ప్రైమ్‌టైమ్ ఎమ్మీ, ఇంటర్నేషనల్ ఎమ్మీ రెండూ వేర్వేరు అవార్డుల వేడుకలు. ఇప్పుడు విజయ్ సేతుపతికి ఇంటర్నేషనల్ ఎమ్మీ వేదికపై ప్రెజెంటర్‌గా అవకాశం రావడం ప్రత్యేకతను సంతరించుకుంది.

సూర్య ‘సీన్’ ఓటీటీ రిలీజ్ టైం ఫిక్స్
నెట్‌ఫ్లిక్స్‌లో ఎప్పటి నుంచి స్ట్రీమింగ్ కానుందంటే!



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య మరోసారి పోలీస్ ఆఫీసర్ పాత్రలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన ప్రధాన పాత్రలో నటించిన తాజా యాక్షన్ థ్రిల్లర్ ‘సీన్’ దీపావళి కానుకగా నవంబర్ 6న థియేటర్లలో విడుదలైంది. ‘ఆవేశం’ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు జిత్తు మాధవన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. చాలా కాలం తర్వాత సూర్య పోలీస్ అధికారిగా కనిపిస్తుండటంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. థియేటర్లలో విడుదలైన ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకుంది. దీంతో ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీపై అభిమానులు ఆరా తీస్తున్నారు. ‘సీన్’ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ దక్కించుకుంది. సాధారణంగా థియేటర్లలో విడుదలైన సినిమాలు నాలుగు నుంచి ఆరు వారాల తర్వాత ఓటీటీలోకి వస్తున్నాయి. ఇదే విధానాన్ని అనుసరిస్తే ‘సీన్’ సినిమా డిసెంబర్‌లో డిజిటల్ ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా డిసెంబర్ మొదటి వారం లేదా మూడో వారంలో స్ట్రీమింగ్ కావచ్చని అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే ఓటీటీ విడుదల తేదీపై నెట్‌ఫ్లిక్స్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. థియేటర్లలో సినిమా ప్రదర్శన, ప్రేక్షకుల స్పందనను బట్టి విడుదల తేదీలో మార్పులు ఉండవచ్చు. ఈ సినిమాలో సూర్యకు జోడీగా నజ్రియా నజీమ్ నటించారు. వీరిద్దరి కలయిక సినిమాపై ప్రత్యేక ఆసక్తిని పెంచింది. అంతేకాకుండా నస్లేన్, లాల్, ఆనందరాజ్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించారు. సుశిన్ శ్యామ్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్, జగరమ్ స్టూడియోస్ బ్యానర్లపై సూర్య, జ్యోతిక సంయుక్తంగా నిర్మించారు. యాక్షన్‌తో పాటు క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అంశాలను మేళవించి దర్శకుడు ఈ సినిమాను రూపొందించారు. సీన్ సినిమా కథ విషయానికి వస్తే.. ఈ సినిమాలో సూర్య ఇన్బరాజ్ అనే పోలీస్ అధికారిగా కనిపించారు. పోలీస్ శాఖలో మంచి పేరు, గుర్తింపు సంపాదించుకున్న ఇన్బరాజ్ కొన్ని వ్యక్తిగత కారణాల వల్ల తన ఉద్యోగానికి రాజీనామా చేస్తాడు. అయితే గతంలో ఆయన పరిష్కరించకుండా వదిలేసిన ఒక కేసు మరోసారి తెరపైకి వస్తుంది. దీంతో ఆ కేసును ఎలాగైనా పరిష్కరించాలని ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఎదురవుతుంది.ఈ నేపథ్యంలో ఇన్బరాజ్ మరోసారి కేసు దర్యాప్తులోకి దిగాల్సి వస్తుంది. అయితే ఈసారి ఆయనకు ఎదురయ్యే పరిస్థితులు అంత సులభంగా ఉండవు. సమస్యాత్మకమైన, గందరగోళమైన ఓ పోలీస్ బృందంతో కలిసి దర్యాప్తు కొనసాగించాల్సి వస్తుంది. గతంలో పరిష్కారం కాని ఆ కేసు వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటి? పాత కేసుకు, ఇప్పుడు ఎదురైన పరిణామాలకు ఉన్న సంబంధం ఏంటి? మంచి పేరున్న సిన్సియర్ పోలీస్ అధికారి ఇన్బరాజ్ ఉద్యోగానికి ఎందుకు రాజీనామా చేశాడు? చివరకు ఈ కేసును ఎలా పరిష్కరించాడు? అనేది సినిమాలో ఆసక్తికరంగా ఉండనుంది.

బాలయ్య ‘దాదా’లో క్రేజీ ఐటెం సాంగ్..
థమన్ ఈసారి కూడా మాస్ బీట్‌తో దుమ్ములేపనున్నాడా?



నందమూరి నటసింహం బాలకృష్ణ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సినిమాల్లో ‘దాదా’ ఒకటి. గతంలో బాలయ్యతో ‘వీరసింహారెడ్డి’ వంటి విజయవంతమైన చిత్రాన్ని తెరకెక్కించిన దర్శకుడు గోపీచంద్ మలినేని ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న ఈ చిత్రాన్ని నిర్ణయించిన సమయానికి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్ర బృందం కష్టపడుతోంది. మరోవైపు ఈ సినిమాకు సంగీతం అందిస్తున్న ఎస్.ఎస్. థమన్ విషయంలోనూ అభిమానుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ సినిమాలో ఓ అదిరిపోయే ఐటెం సాంగ్ ఉండబోతుందనే ప్రచారం సినీ వర్గాల్లో ఆసక్తిని పెంచుతోంది. బాలకృష్ణ, థమన్ కాంబినేషన్‌కు టాలీవుడ్‌లో ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. వీరిద్దరి కలయికలో వచ్చిన పాటలు, నేపథ్య సంగీతం అభిమానులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా బాలయ్య మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా థమన్ అందించే బాణీలు థియేటర్లలో అభిమానులతో విజిల్స్ వేయిస్తుంటాయి. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమాల్లో పాటలు మంచి ఆదరణ పొందడంతో ‘దాదా’పై కూడా సంగీతం విషయంలో అంచనాలు పెరిగాయి. ఇప్పటికే బాలకృష్ణ సినిమాల్లో ఐటెం సాంగ్స్‌కు ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునేలా థమన్ అందించే బీట్స్ ఈ పాటలకు మరింత ఊపునిస్తుంటాయి. ఇప్పుడు ‘దాదా’ సినిమాలో కూడా ఓ ప్రత్యేకమైన ఐటెం సాంగ్ ఉండబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ పాట కోసం థమన్ అదిరిపోయే మాస్ బీట్స్ సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ప్రత్యేక పాటలో బాలయ్యతో కలిసి స్టెప్పులు వేసే బ్యూటీ ఎవరనే విషయం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. గతంలో బాలయ్య సినిమాల్లో ప్రత్యేక పాటలు చేసిన హీరోయిన్ల తరహాలో ఈసారి కూడా ఓ క్రేజీ హీరోయిన్‌ను తీసుకురాబోతున్నారా? అనే చర్చ జరుగుతోంది. అయితే ఈ పాటలో నటించబోయే హీరోయిన్ ఎవరు? పాట చిత్రీకరణ ఎప్పుడు జరగనుంది? అనే విషయాలపై అధికారిక సమాచారం రావాల్సి ఉంది. గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని వృద్ధి సినిమాస్ నిర్మిస్తోంది. బాలకృష్ణ మాస్ ఇమేజ్‌కు తగ్గట్టుగా యాక్షన్, ఎమోషన్స్, పవర్‌ఫుల్ డైలాగ్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు అంచనాలు ఉన్నాయి.



కళ్లకు కూలింగ్ గ్లాసెస్.. బ్లాక్ అవుట్‌ఫిట్‌లో కీర్తి సురేశ్ అదిరిపోయే లుక్

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512